
ంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



4 అణాలు
23-6-54

DHRA PATRIKA ILLUSTRATED WEEKLY



తరునర్తకి

—ఫొటో. సి. వి. నారాయణమూర్తి (పెరవలి)

సంవత్సరచందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 47
సంచిక 41
23-6-54

జయ జ్యేష్ఠ బహుళ సప్తమి బుధవారం



పిల్లలకోసం కట్టిన బొమ్మరిల్లు
(వసంత విహార్ పార్కు, బొంబాయి)



బుధవారం, జూన్ 9:

—రెండు తెలుగు రాష్ట్రాలుండాలని హైదరాబాద్ కాంగ్రెస్ చేసిన నిర్ణయం ఏకగ్రీవమైనది కాదనీ, విశాలాంధ్ర విషయమై నిర్ణయించడానికి తెలంగాణా ఆంధ్రప్రాంతాల ప్రతినిధుల సమావేశం జరపాలనీ తెలంగాణా కాంగ్రెస్ సభ్యులు పదమూడుమంది హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షునికి లేఖ వ్రాశారు.

—ఆంధ్రదేశంలో కరవుప్రాంతాలలో 17 ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మించడానికిగాను భారత ప్రభుత్వం కేటాయించిన ధనంలో రు. 6 కోట్లు వెచ్చించగలరని మంత్రి సంజీవరెడ్డిగారు కర్నూలులో పత్రికా ప్రతినిధులతో అన్నారు.

—హైదరాబాదులోని కర్ణాటక ప్రాంతాలతోసహా సంయుక్త కర్ణాటక రాష్ట్రాన్ని నిర్మించాలని కోరుతూ హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ కర్ణాటక ప్రతినిధులు తీర్మానించేశారు.

—హైదరాబాదులోని మరాఠ్వాడా ప్రాంతాన్ని కూడా చేర్చి బొంబాయి రాజధానిగా సంయుక్త మహారాష్ట్రం నిర్మించబడాలని హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ మరాఠ్వాడా ప్రతినిధులు తీర్మానించేశారు.

—ప్రస్తుత ఢిల్లీరాష్ట్రంతో ఉత్తర ప్రదేశ్, పంజాబ్, రాజాస్థాన్, పెప్సూ రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాలను చేర్చి విశాల ఢిల్లీరాష్ట్రం నిర్మించాలని ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన అయిదుగురు సభ్యుల కమిటీ నివేదించింది.

—ఆంధ్రరాష్ట్రానికి జూలై 5 మొదలు ప్రత్యేక హైకోర్టును స్థాపిస్తున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది.

—ఇండోచీనా ఆర్మిస్టిస్ కమిషన్‌లో కమ్యూనిస్టు ప్రతినిధి ఉండి తీరాలని చీనా ప్రధానిచౌఎన్‌లే జనీవా సమావేశంలో అన్నారు. ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణ చెయ్యాలని వియత్నామ్ ప్రతినిధి అన్నారు.

—ఆసియాలో శాంతి స్థాపనకోసమై తమ కొత్త ప్రతిపాదనలను పండిట్ నెహ్రూతో చర్చించడానికి ఢిల్లీ వెడుతున్నారని ఆస్ట్రేలియా విదేశాంగమంత్రి రిచర్డ్ కేసీ డమ్‌డమ్ విమానాశ్రయంలో (కలకత్తా) ప్రకటించారు. ఈ ప్రతిపాదనలను గురించి తరువాత జనీవాలో బ్రిటిష్, అమెరికన్ ప్రతినిధులతో చర్చించగలరని కూడా చెప్పారు.

—కెనడా, అర్జెంటీనా, అమెరికాల గోధుమ అమ్మకపు వెల నానాటికీ తగ్గుతోంది కాబట్టి ఆస్ట్రేలియా కూడా ధర తగ్గించుకోవలసి వస్తోందని మెల్బోర్న్‌లో ఆస్ట్రేలియన్ వీట్ బోర్డు అధ్యక్షుడు ప్రకటించాడు.

గురువారం జూన్ 10:

—ఆస్ట్రేలియా విదేశాంగ శాఖమంత్రి మిస్టర్ కేసీ భారతప్రధాని నెహ్రూను కలుసుకొని ఆగ్నేయ ఆసియా దేశాలకు సంబంధించిన పలు సమస్యలపై చర్చించారు.

—ఇండో-చైనాలోని సైనిక పరిస్థితులపై వ్యాఖ్యానిస్తూ అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్, ఫ్రెంచి ప్రభుత్వానికి యితరదేశాలవారు చేయవలసిన సహాయాన్ని గురించి చెప్పారు.

—జోసెఫ్ లేనియర్ ఆధిపత్యాన నడుస్తున్న ఫ్రెంచి మంత్రివర్గంవారు తమపైన రేపు రానున్న విశ్వాస తీర్మాన విజయం కోసం ఎంతైనా పాటుపడతామని ప్రకటించారు.

—బొంబాయి నగరాన్ని భాషాప్రయుక్త రాష్ట్రనిర్మాణ పథకం కోసం ప్రస్తుతం వున్న ఏర్పాటులోనుంచి ఏమాత్రమూ తప్పించవలసిన అవసరం లేదని బొంబాయిప్రదేశ్ కాంగ్రెస్ కమిటీవారు తీర్మానించారు.

—గుంటూరు వైద్యకళాశాలలో యీ జూలై 6 నుంచీ మూడవ ఏడాది కోర్సు ఆరంభమౌతుందని ఆంధ్రరాష్ట్ర ఆరోగ్య మంత్రి డి. సంజీవయ్యగారు అన్నారు.

శుక్రవారం, జూన్ 11:

—వియట్‌మిన్ సైన్యాలు హనోయ్ నగరాన్ని పట్టుకోవటంకోసం ద్విముఖ వ్యూహం పన్నినట్లు సైగాన్‌నుంచి వచ్చిన వార్త.

—కొరియాలో ఎన్నికలు యునైటెడ్ నేషన్స్‌వారి పర్యవేక్షణలో జరగటం తమకు అంగీకారయోగ్యమైనదిగా కనిపించటం లేదని కమ్యూనిస్టు చైనా ప్రధాని చౌ ఎన్ లై నేడు అన్నారు.

—ఇండో-చైనాలోని వియట్‌నామ్, లావోస్, కాంబోడియా రాష్ట్రాల పరిపాలనను తమ అధీనం చేసుకోవాలని కమ్యూనిస్టులు ప్రయత్నిస్తున్నారని ఆస్ట్రేలియా విదేశాంగశాఖమంత్రి కేసీ నేడు ఢిల్లీలో అన్నారు.

—జనీవాలో జరుగుతున్న ఇండో-చైనా సమావేశంలో ప్రసంగిస్తూ మాలటోవ్, వియట్‌నామ్‌లో దేశవ్యాప్తంగా ఎన్నికలు జరగాలనే వియట్‌మిన్ కోరిక పట్ల తాము సానుభూతి కనపరుస్తున్నామంటూ, యీ విషయంలో ఫ్రాంసుదేశ ప్రతినిధులు అనవసరమైన జాప్యం జరిగేట్లు చూస్తున్నారని ఆరోపించారు.

—పశ్చిమ రాజ్యాల కూటమిలోకి లాక్కోవాలని యితరులు ఎంత ప్రయత్నించినా వాటినన్నిటినీ లెక్క చేయకుండా, తాము ఉభయదేశాలూ ఒకే విధానాన్ని అనుసరించుదామని సాదీ అరేబియా, ఈజిప్టు దేశాలు ఒక ఒప్పందం చేసుకున్నాయి.

—తమ దేశం పాకిస్థాన్‌తో చేసుకున్న సంధి షరతులను ఏకగ్రీవంగా ఆమోదిస్తూ

విషయానుక్రమణిక

ముఖచిత్రం: బొంబాయితార నిగార్ సుల్తానా.

టర్కిష్ గ్రాండ్ నేషనల్ ఎసెంబ్లీ సభ్యులు తీర్మానించారు.

—అమెరికా వైదేశిక విధానాన్ని వివరిస్తూ అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ ఒక ప్రకటన చేశారు

—అవిభక్త మద్రాసు రాష్ట్రానికి రాజగోపాలాచారిగారు ముఖ్యమంత్రిగా వుండగా అమలులోకి వచ్చిన ప్రాథమిక విద్యావిధానం ఆంధ్రరాష్ట్రంలో అన్ని ప్రాంతాలలోనూ రద్దు అవుతుందని ఆంధ్ర రాష్ట్ర విద్యాశాఖమంత్రి అన్నారు.

—శ్రీ వెంకటేశ్వర విశ్వకళాపరిషత్తు మిగిలిన విశ్వవిద్యాలయాలతో పాటు జూన్ నెలనుంచీ కాకపోయినా, యీ ఆగస్టు నుంచైనా పని చేయటం ప్రారంభించవచ్చని విద్యాశాఖమంత్రి అభిప్రాయపడుతున్నారు.

శనివారం, జూన్ 12 :

—ఫ్రెంచి నేషనల్ అసెంబ్లీ సభ్యులు ప్రస్తుతం జోసఫ్ లానియల్ నాయకత్వాన నడుస్తున్న మంత్రివర్గంపై విశ్వాస ప్రకటన కోసం ప్రతిపాదితమైన తీర్మానాన్ని పదమూడు వోట్ల మెజారిటీతో ఓడించారు. తదనంతరం లానియల్ సమర్పించిన రాజీనామాలను ప్రెసిడెంట్ కోనీ కూటీ అంగీకరించలేదు.

—స్తంభించిపోయిన జనీవా సమావేశ భవితవ్యాన్ని గురించి బ్రిటిష్ విదేశాంగ శాఖమంత్రి ఆంథోనీ ఈడెన్, సోవియెట్ రష్యా ప్రతినిధి మాలటోవ్ సంప్రదింపులు జరిపారు.

—ఇండో-చైనా, కొరియా విషయాల్లో ఆగిపోయిన సంప్రదింపులను గురించి చర్చించే నిమిత్తం యునైటెడ్ నేషన్స్‌లోని భారతప్రభుత్వ ప్రతినిధి వి. కె. మీనన్ నేడు బ్రిటిష్ విదేశాంగ మంత్రి ఈడెన్‌ను కలుసుకొని మాట్లాడారు.

—తమ దేశాల సైన్యసంపత్తిని సమీకరించుకోవటానికి ఈజిప్టు, సౌదీ అరేబియా దేశాలు ఒప్పందం చేసుకొన్నాయని ఈజిప్టు మంత్రి మేజర్ సాలా సలాం నేడు కైరోలో ప్రకటించారు. ముస్లిం మతానుయాయులుగాను, అరబ్బీయులుగాను తమ రెండు దేశాలూ పాకిస్థాన్‌తో సన్నిహిత సంబంధాలు చెడిపోకుండా చూస్తామని కూడా అన్నారు.

—ఆర్థిక సైనికరంగాలలో పరస్పరం చేసుకోదలచిన సహాయాల విషయమై, టర్కీ పాకిస్థాన్ దేశాలు నేడు ఒక స్థిరమైన ఒప్పందానికి వచ్చాయి.

—ఫ్రెంచి యిండియా సెటిల్‌మెంటులోకి రాకపోకలను నియమబద్ధం చేసేందుకుగాను ప్రవేశపెట్టబడిన పెర్మిట్ల పద్ధతిని మరింత కటువుగా అమలుజరుప భారత ప్రభుత్వం నిర్ణయించిందని విదేశాంగ శాఖ కార్యదర్శి ఆర్. కె. నెహ్రూ నేడు ప్రకటించారు.

—కౌలుదార్ల రక్షణకు ఆంధ్ర ప్రభుత్వం తలపెట్టిన బిల్లును శాసనసభలో ప్రతిపాదించడానికి రాష్ట్రపతి ఆమోదం వచ్చిందనీ, యీ బిల్లు ప్రతిపాదన యీసారి జరుగనున్న ఆంధ్ర అసెంబ్లీ సమావేశంలో జరుగవచ్చుననీ తెలుస్తున్నది.

—వివిధ రాష్ట్రాలలో స్థానిక అభివృద్ధి కార్యక్రమాలు అమలుజరపడానికిగాను 1954 - 55 లో రాష్ట్ర ప్రభుత్వాలకు మంజూరుచేసే నిమిత్తం భారతప్రభుత్వం రు. 6 కోట్లు కేటాయించిందనీ, అందులో ఆంధ్రరాష్ట్రానికి రు. 34 లక్షలు వస్తాయనీ తేలింది.

—ఆంధ్రలో బస్సు సర్వీసును జాతీయం చేసే ఆలోచన ప్రస్తుతానికి రాష్ట్ర ప్రభుత్వానికి లేదని ఉప ముఖ్యమంత్రి ప్రకటించారు.

ఆదివారం, జూన్ 13 :

—ఫ్రెంచి వలస అయిన యానాం ప్రజలు దాస్యవిముక్తిని పొందారు. ప్రజా నాయకులు ప్రభుత్వ కార్యాలయాలన్నిటినీ వశపరుచుకొని పరిపాలనా యంత్రాంగాన్ని తమ అధీనంలోకి తెచ్చుకొన్నారు. ఈ విషయాన్ని వారు ఫ్రెంచి, భారత దేశాల ప్రభుత్వాలకే, ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వానికీ తెలియచేశారు.

—నిర్బంధ ధాన్యసేకరణ పద్ధతిని యికపై రద్దుచేయ ఆంధ్రప్రభుత్వం నిర్ణయించింది. ఇంతతో అన్నిచోట్లా లెవీ వుత్తరువులకు స్వస్తిచెప్పటం అవుతుంది. ఐదు మిగులు జిల్లాలలో స్వేచ్ఛాసేకరణ పద్ధతి మాత్రమే అమలులో వుంటుంది.

—శ్రీ వెంకటేశ్వర విశ్వకళాపరిషత్తుకు లోగడ వాగ్దానం చేసిన రు. $8\frac{1}{2}$ లక్షలతో పాటు మొత్తం రు. $7\frac{1}{2}$ లక్షలు యివ్వాలని ఆంధ్రప్రభుత్వం నిర్ణయించింది.

—ప్రభుత్వ అధీనంలో వున్న బంజరు భూములను, భూములు లేని పేదవారికి అభ్యర్థి ఒక్కొక్కరికి $2\frac{1}{2}$ ఎకరాల మాగాణిగాని 5 ఎకరాల మెట్టగాని మించకుండా వుచితంగా పంచి యివ్వాలని ఆంధ్రప్రభుత్వం నిశ్చయించింది.

—నేపాల్ రాజకీయాల్లో అమెరికన్ల జోక్యం ఏమాత్రం లేదని ఇండియా నేపాల్ దేశాలలో అమెరికా రాయబారిగా వుంటున్న జార్జి వి. అలెన్ అన్నారు.

—దక్షిణ ఆఫ్రికాలోని భారత హైకమీషనర్ కార్యాలయాన్ని యీ జులై నుంచి మూసివేయాలని భారతప్రభుత్వం నిర్ణయించినట్లు ఢిల్లీనుంచి వచ్చిన వార్త.

—విశాలాంధ్ర నిర్మాణ కృషికోసం సమావేశపరచబడిన విశాలాంధ్ర సదస్సు శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు గారి అధ్యక్షత క్రింద హైద్రాబాదులో ప్రారంభమయింది.

—కొరియా ఏకీకరణకు బలప్రయోగం ఒక్కటే మార్గమనీ, అవకాశం వచ్చినప్పుడు దక్షిణకొరియా సైనికులు ఉత్తర కొరియాపై దండెత్తగలరనీ, దక్షిణ కొరియా ప్రెసిడెంట్ డా॥ సింగ్మన్ రీ నేడు అన్నారు.

సోమవారం; జూన్ 14 :

—భారతప్రభుత్వ విద్యాశాఖ వారు దేశంలో జిల్లాకు ఒకటి చొప్పున 500 సర్వార్థసాధక పాఠశాలలు స్థాపించడానికి యోచన చేస్తున్నారని హుమయూన్ కబీర్ ప్రకటించారు.

—భాషాప్రయుక్తంగా రాష్ట్రాల పునర్విభజన జరిగే పక్షంలో బొంబాయి నగరాన్ని ప్రత్యేక రాష్ట్రంగా నిర్మించాలని బొంబాయి పౌరుల కమిటీ ఫజల్ అలీ కమిషన్‌కు విజ్ఞప్తిచేశారు

—హైద్రాబాదు రాష్ట్రాన్ని విడగొట్టి భాషారాష్ట్రాలు ఏర్పడాలని ఫజల్ అలీ కమిషన్‌కు ఇదివరలో పంపిన నివేదికతో పాటు తెలంగాణా కర్ణాటక, మరాఠ్వాడా ప్రతినిధుల నివేదికలను అనుబంధంగా పంపడానికి హైదరాబాదు ప్రదేశ కాంగ్రెస్ కార్యవర్గం తీర్మానించింది.

—భాషారాష్ట్రాల నిర్మాణంవల్ల కొత్త సమస్యలు ఉత్పన్నం కాగలవని చెప్తూ బొంబాయిప్రదేశ కాంగ్రెస్ నివేదిక పంపింది.

—తిరువాన్కూరు కొచ్చిన్ హైకోర్టుకు త్రివేండ్రంలో ఒక శాఖ స్థాపించబడింది.

—వలస పరిపాలనా విధానాన్ని అమెరికా ఎన్నడూ బలపరచబోదని చెప్తూ ఆసియాపట్ల అమెరికా వైఖరిని విదేశాంగ మంత్రి డల్లెస్ వివరించారు.

—ఆహార ధాన్యాలను నిలవచేసే విషయంలో ఇండియా అమెరికాలు ఒక ఒప్పందం చేసుకున్నాయి.

—భారతదేశంలోని శాసన సభాధిపతులు శ్రీనగర్‌లో సమావేశమై శాసన సభా వ్యవహారాలనుగురించి చర్చించారు.

—ఇండో - చైనాలో కమిషన్‌కు ఇండియా అధ్యక్షత వహించాలని జనీవా సమావేశంలో రష్యా ప్రతిపాదించింది.

(55-వ పేజీ చూడండి)

కాలక్షేపం

నియతి చేత గదర్థితుం - డయిన ధైర్య
పరుని ధైర్యగుణంబు మాప్పంగ దరమె ?
క్రిందు సేయంగ బడినట్టి కృష్ణవర్త్ముని
కీల లెయొందైన మీదుగా గెరలుగాదె.

తా॥ కొన్ని కష్టపరిస్థితుల మూలంగా ధైర్యవంతుడు హీనస్థితిలోనికి వచ్చినప్పటికిన్నీ, అతని ధైర్యగుణమును పోగొట్టుట అసాధ్యము. జ్వాలగా మండుచున్న దానిని తలక్రిందుగా ఉంచినప్పటికిన్నీ ఆ జ్వాల పైపైకి ప్రజ్వరిల్లుచునే యుండును గదా.

పరిస్థితులు మారినప్పటికీ ప్రకృతి మారదు అనే మాట లోకపరిపాటిగా అనడం కలదు. కాని, యీ సూత్రము సర్వకాల సర్వావస్థలయందున్నూ స్థిరసిద్ధాంతంగా వర్తిస్తూ ఉంటుందా అనేది పరిశీలించ జాతికి ఆ రెండు సహజగుణములున్నూ సంక్రమించవచ్చు. నక్కకు ఉపాయాలు తెలుసు. కాని దానికి భయం ఎక్కువ - పిరికిజంతువు. కుక్కలలో అమితమైన ధైర్యంగల జాగిలాలు ఉన్నాయి. అడవులలో వేటకు వెళ్లేవాళ్ళు నక్కలను పట్టుకొనడానికి కుక్కలను విడిచిపెట్టినప్పుడు చూడాలి. ఆ కుక్కలను తప్పించుకొనుటకై నక్కలు ఎంతటి జిత్తులను పన్నుచుండునో, ఆ జిత్తులకు పైఎత్తులుగా, వేటకుక్కలు తమ ధాటీ వీరీతిగా చూపించి హుటాహుటిగా పరువెత్తి వాటి యుసురుతీయునో, చూచినట్లయితే, ఆ పిరికి జాతికిన్నీ యీ దుడుకు జాతికిన్నీ పొత్తు కలియదనిన్నీ, ఒక జాతికీ యింకొక జాతికీ విరుద్ధలక్షణములు ఏర్పడుటవల్ల ఆ

వలసినవిషయం. ధైర్యంగలవాడు ధైర్యస్థుడుగానే ఉంటాడనిన్నీ, ధైర్యంలేనివాడు అధైర్యస్థుడుగానే ఉంటాడనిన్నీ, కాకః కాకః పికః పికః అన్నట్లుగా (కాకి కాకిగానే ఉంటుంది, కోయిల కోయిలగానే ఉంటుంది అన్నట్లుగా) తత్వాలు మార్పు చెందవని తరచు తర్కిస్తూ ఉంటారు తజ్ఞులు. కాని, పాశ్చాత్య తత్వవేత్తలైన డార్విను పండితుడున్నూ వాల్లేస్ పండితుడున్నూ, ఆయా జీవరాసుల ప్రకృతులు దేశకాల పరిస్థితులనుబట్టి మార్పు పొందుతూ ఉండంవల్లనే ఒక జాతి జంతువులలోనుంచి ఇంకొక జాతి జంతువులు ఆవిర్భవించినవని ఊహించియున్నారు. కోతిజాతిలోనుంచి మానవజాతి ఉద్భవించినదన్నారు. అది కూడా నిజమే. అరుపెలలు సహవాసం చేస్తే వారు వీరవుతారు. నక్కజాతికి ఊహాబలమున్నూ యుక్తిప్రజ్ఞయున్నూ ఎక్కువ. కుక్కజాతికి విశ్వాసం ఎక్కువ. అటువంటి సందర్భములో నక్కజాతికీ కుక్కజాతికీ కలిసి జన్మించిన మరొక వైరుధ్యమును సమన్వయించుటకు సాధ్యం కాదనిన్నీ భావిస్తాము. కాని ఇటువంటి విరుద్ధలక్షణములను సమన్వయించవచ్చు. యీ రెంటికీ జన్మించిన మరొక జాతిలో ఆ రెండు భిన్నస్వభావాలున్నూ అభిన్న స్వభావంగా అవతరించవచ్చు. ఇదే జాతిసాంకర్యసూత్రము. స్పానియల్ అనబడే ఒక చక్కని కుక్కజాతి ఉంది. ఇది కుక్కజాతికీ, నక్కజాతికీ కలిగిన సంకరజాతి అని అంటారు. ఈ స్పానియలు కుక్కయొక్క తెలివితేటలు చాలా ఎక్కువైనవి. తెలివితేటలతోబాటు యజమానితో కలిసిమెలిసి అతి విశ్వాసంగా ఉంటుంది.

ఈవిధంగా జాతిసాంకర్యంవల్ల కొత్త జాతులు కూడా ఉత్పత్తి కావచ్చు. బంగినపల్లి మామిడిచెట్లు సృష్ట్యారంభంలోనే, అనగా యీ ప్రపంచం పుట్టినప్పుడే, యీ లోకంలో అవతరించలేదు. అనేక రకాల మామిడిచెట్లను ఒకదానితో యింకొకటి కలిపి అంటుత్రొక్కుటవల్ల యీ క్రొత్త రకం మామిడిపండు పసందుగా తయారైంది.

బెజవాడనుంచి గుంటకల్లుపోయే రైలుమార్గం మీద కర్నూలుజిల్లాలో పాణ్యంఅనే స్టేషను ఉంది. పాణ్యంలో అపారమైన మామిడితోటలు చిరకాలంనుంచిన్నీ ఉంటూఉన్నాయి. అక్కడ ఆ తోటల ఖామందులు అయిన మధ్వబ్రాహ్మణులు అనేక రకాల మామిడిచెట్లకు అంట్లుతొక్కి అనేక కొత్త రకాల మామిడిపళ్ల జాతులను చాలా పసందైనవి తయారుచేశారు. ఒక మేలుజాతి అంటుమామిడికి "మాధవరావు పసందు" అని రమారమి అర్ధశతాబ్దం క్రిందట నామకరణం చేశారు. బహుశః మాధవరావు అనే ఆయన ఆ తోటఖామందు కావచ్చు. లేదా ఆయన స్వయంగా యీ అంటుజాతిని తయారుచేసియుండవచ్చు. మామూలుగా పుల్లని పెద్ద సైజు మామిడికాయలను కొని, కండ బాగా ఉండేవి, విశేషం పీచు లేనివి, ఏరి కోరి ఆవకాయ పెట్టుటకుగాను ఉపయోగిస్తాము. అటువంటి ఆవకాయఊరగాయకు శ్రేష్ఠమైన రకపు మామిడిజాతినే యితర రకముల మామిడితో అంటుత్రొక్కినట్లయితే, కొత్తగా ఉద్భవించెడి అంటు మామిడి పసందైన, సువాసనగల, కండదారను మించిన తీపిగల, పండ్లరకంగా, అములులో ఉన్న పండ్లజాతులను అతీతమైన కోతకాయగా తయారుకావచ్చు. మొట్టమొదట కల్పితమైన మాధవరావు పసందు అనే అంటు మామిడి అత్యంత రుచ్యంగా ఉండుటవల్ల దానిని "నాజూకు పసందు" అనే ముద్దు పేరుతో పిలుస్తూ ఉండేవారు.

ఆ జాతిచెట్లను బనగానపల్లిలో ఎక్కువగా పెంచి, తోటలువేసి సమృద్ధిగా కాయలుకాపించి, ఇతరప్రాంతాలకుకూడా బనగానపల్లినుంచి సరఫరా చేయడం సాగించిన పిమ్మట, ఈ "నాజూకు పసందు" అనే ముద్దుపేరు మూలపడిపోయింది. దానిని "బనగానపల్లి జాతి" పండు అని వ్యవహరించారు. ఈ కాయలు ఎన్ని తినినా, ఇంకా తినవలెనని నోరూరి ఆనందించినవారుకూడా, నోరు తిరుగక, "బనగానిపల్లె" అని పలుకలేక, "బంగినపల్లి" అనే చిన్న మాటలో దానిని బంగిచేసి వాడుతున్నారు. బంగినపల్లి బంగీలు యీరోజున ఆంధ్రదేశం అంతట ప్రతి రైలుస్టేషనులోను కన్పిస్తాయి అంటే, ఆ జాతియొక్క ఖ్యాతి ప్రతి ఓంకలోనూ నిశ్శంకగా ఉన్నదని ఢంకామీద దెబ్బకొట్టి చెప్పవచ్చు.

బంగినపల్లియందున్న అభిరుచి చేత, అసలు విషయం మాటలదోరణిలో బాటతప్పి తోటలో పడినట్లయింది. ఇంతకూ చెప్ప వచ్చిన దేమంటే, ఒక జాతికీ యింకొక జాతికీ అంటుత్రొక్కినయెడల మరొక కొత్తజాతి ఉద్భవించవచ్చు. జర్మనీలో

ఒక వృక్షశాస్త్ర పండితుడు టొమెటో చెట్టుకున్నూ (రామములక్కాయలు అనబడే ఎర్రని గుండ్రనిపండ్లు కాసే చెట్టుకున్నూ) పొటెటో చెట్టుకున్నూ (అనగా బంగాళా దుంప చెట్టుకున్నూ) జతకలిపినాడు. రామములక్కాయ లనే కర్పూరపు వంకాయ లనిన్నీ సీమవంకాయ లనిన్నీ పిలుస్తూ ఉండడం కలదు. ఈ మొక్కయున్నూ బంగాళాదుంప మొక్కయున్నూ కొన్ని ఆకారలక్షణాలూ పోలికలూ గల్గిన మొక్కలుగా ఉండడంచేత, యీ రెంటి కిన్నీ పొత్తుకలిపి చూద్దామని ఆ జర్మను పండితుడు ఆ పని చేశాడు. ఆయన చేసిన యీ పరిశోధనయొక్క ఫలితం ఏమిటంటే, కొత్తరకం చెట్టు తయారైంది. "టొమెటో" కున్నూ "పొటెటో"కున్నూ పుట్టిన జాతి గనుక దీనికి "పొమెటో" అని నామకరణం చేశాడు. దీనికి బంగాళాదుంపలవలె దుంప లున్నూ, రామములక్కాయలవంటి కాయ లున్నూ సంప్రాప్తించినవి.

కనుక, యిందువల్ల సమస్తమైనవారికీ తెలియబరచేది ఏమనగా, యీ ప్రపంచంలో "ధైర్యం గలవారు" అనేటటువంటి ఒక జాతి మనుష్యులుగాని, "ధైర్యంలేనివారు" అనేటటువంటి జాతి మనుష్యులు గాని సహజంగా స్థిరంగా ఏర్పడి ఉన్నారనే మతం, అజ్ఞాన సమన్వితం. బ్రిటిష్‌వారు యీ దేశాన్ని పరిపాలిస్తూ ఉన్న రోజులలో మన దేశరక్షణకు కావలసిన పటాలములను రెండు పెద్ద భాగాలుగా విభజించారు. ఇంగ్లీషు సోల్జర్లతో కూడియున్న ఆంగ్లేయ సైన్యం ఒక భాగం. భారతీయ సిపాయీలతో కూడియున్నటువంటి దేశీయ సైన్యం రెండవభాగం — ఈ దేశీయ సైన్యంలోనికి సిపాయీలుగా ఎవరిని చేర్చుకోవచ్చు, ఎవరిని చేర్చుకో కూడదు అనే విషయంలో కొన్ని సిద్ధాంతములను నిర్వచించారు. మన దేశంలోని వివిధప్రాంతాలలో ఉన్నటువంటి ప్రజలను రెండు రకాలుగా విభజించారు. (1) *Martial races* (2) *Non-Martial races* [(1) యోధజాతులు (2) అయోధజాతులు] అని విభజించారు. ఘూర్కాలు, రాజపుత్రులు మొదలైనవారు యుద్ధానికి పనికివచ్చేటటువంటి యోధజాతులవారని నిర్ణయించారు. అట్టి జాతులకు చెందిన వారినే పటాలములలో చేర్చుకొనేవారు. కొన్ని ప్రాంతాలలోని జనులకు పటాలపు నవుకరీలు యిచ్చేవారు కారు. ఎందుచేత నంటే వీరు యోధజాతులవారు కారు గనుక. తెనుగువారిని తగనివారనీ, వీరికి జాతి వారని, నిర్ణయించి వారిని అయోధజాతుల జాబితాలో అగ్రగణ్యులుగా చేసిన ఆంగ్లేయులు అబోధోపహతులని సాధించినప్పటికీ, ప్రయోజనంలేకపోయింది. పంజాబీ పటాలం, సిక్కు పటాలం, రాజపుట్ పటాలం, కాబూలీ పటాలం, బెంగాలీ లాన్సరుల పటాలం ఏర్పడినట్లుగా, ఆంధ్ర పటాలం అనేది ఆంగ్లేయ హయాములో మనకు ప్రాప్తించలేదు. ఎప్పుడో బర్మాయుద్ధంలో ఆంధ్రసైనిక దళం ఒకటి ముందంజవేయక వెనుకంజ వేసినదనే నేరారోపణచేసి, ఆంధ్రపటాలం ఆహవరంగానికి అయోగ్యం అనే అభాండం ఒకటి కల్పించారు. కాని మన ఆంధ్రదేశ చరిత్రలో, మన కాకతీయ ప్రతాపరుద్రుని కాలములో రెడ్డి పటాలములు కొన్ని ఉండేవనిన్నీ, వెలమవీరుల పటాలములు కొన్ని ఉండేవనిన్నీ ఆధారప్రమాణాలు కన్పిస్తాయి. శ్రీకృష్ణదేవరాయలవారు అనేక ప్రాంతాలు జయించారు. కాని, ఆయనకు అత్యంత విశ్వాసపాత్రులైన సైనికులు ఆంధ్రులే. తెనుగు పటాలములనే ఆయన నమ్ముకొని అనేక యుద్ధరంగాలలో అఖండ దిగ్విజయంపొంది శత్రుసైన్యాలను పటాపంచలు చేశాడు. "బంగాళాంగ కళింగ భూప సుభటాభ్రశ్రేణి ఝంఝూనిలా!" అని అల్లసాని పెద్దన్నగారు యీ



అఖండ విజయపరంపరలను ప్రస్తావించారు బంగాళ దేశపు, అంగదేశపు, కళింగదేశపు భూపతుల మంచిభటులయొక్క మేఘగాలి కలకు కృష్ణరాయలు ఝంఝామారుతము వంటివాడై, ఆయా రాజుల సేనలను చెల్లాచెదరు చేసినాడు. అటువంటి అఖండ విజ్ఞయాలకు కారణభూతులైన కమ్మవీరులు, వెలమవీరులు, రెడ్డివీరులు, ఊరు పేరు లేని వారలై ఆంగ్లహయాములో నిర్వీర్యు లెట్లా అయినారు?

కత్తి చేతబట్టగల వీరుడు క్షత్రియుడే అనిన్నీ, తదితరులు క్షాత్రంలేని నక్షత్ర కులనిన్నీ వాదించిన సనాతన మతంకూడా అటువంటిదే. పాత తాటియాకుల గ్రంథాలలో కులభేదములూ, వృత్తి భేదములూ, ఆ ప్రకారంగా శాసింపబడియున్నవనిన్నీ, ఒక కులంలోనివారు ఇంకొక కులవృత్తికి తగరనిన్నీ, వాదించేటటువంటి సనాతనులు ఆయా కులములగూర్చి పడే ఆకులపాటు ఆ తాటియాకుల గ్రంథపాఠ ప్రమాణములను కూడా అనుసరించలేరు. చాతుర్వర్ణ్యములను వారివారి గుణములను బట్టియు కర్మలను అనగా వృత్తులనుబట్టియు విభజించడమైనది. ఆమాట నిజమే. "గుణకర్మ విభాగశః" అని సంఘంయొక్క మేలుకోసం, ఆయా వృత్తులలో పోటాపోటీలు రాకుండా నిరుద్యోగ సమస్య ఏర్పడకుండా, పొలాలకు సర్వే రాళ్లు పాతినట్లుగా, కులాలకు సర్వే రాళ్లు పాతడం అవసరమే కాని, మెరక పొలంలోని మన్నును తీయించి పల్లపు పొలంగా చేసి కొత్త ఆయకట్టులో దానిని చేర్చకూడదని శాసించడం మతిలేని స్మృతిగా దిగుమతి అవుతుంది. మనుస్మృతిలో కూడా (10—65) శూద్రుడు సత్కర్మలొనరించి బ్రాహ్మణుడు కాగలడనియు, బ్రాహ్మణుడు దుష్కర్మలచే శూద్రుడగుననియు చెప్పబడింది. ఐతరేయ బ్రాహ్మణములో (2 భా - 36 - 19) కవష ఐలూషుడను శూద్రునిగూర్చి చెప్పబడింది అతని పాండిత్యమునుబట్టి అతనిని గౌరవించేవారు. అలనిని ఋషులలో చేర్చారు. ఋగ్వేదంలోని కొన్ని ఋక్కులకు (10 - 30 మొదలు 34 ఋక్కులకు) అతడు ఋషియై విఖ్యాతుడైనాడు.

"జన్మనా జాయతే శూద్రః
సంస్కారా ద ద్విజ ఉచ్యతే
వేదపాఠీ భవే ద్విప్రః
బ్రహ్మ జానాతి బ్రాహ్మణః"

అని శంకర దిగ్విజయంలో చెప్పబడి ఉంది జన్మమునుబట్టి అందరూ శూద్రులే కర్మవలన విప్రులగుచున్నారు బ్రహ్మజ్ఞానమువలన బ్రాహ్మణులగుచున్నారు.

ఇదంతా వేదకాలంనాటి మాట. స్మృతులకాలంలోని విషయం అటు తర్వాత గ్రీకు చక్రవర్తియగు అలెగ్జాండరు యీ దేశానికి దండెత్తివచ్చాడు ఆదినాలలో మెగాస్తనీసు అనే గ్రీకు రాయబారి యీ దేశంలోని కులముల పద్ధతిని వర్ణించి వ్రాశాడు. "ఏ వర్ణమువాడైనను జ్ఞాని (అనగా బ్రాహ్మణుడు) కావచ్చు" నని మెగాస్తనీసు వ్రాశాడు.

పూర్వకాలంలో వంశపారంపర్యమైన కులవృత్తి స్థిరంగా ఉండవలెననే శాసనం లేదు. కాని, సహజసిద్ధంగా వంశపరంపరగా తండ్రినుంచి కుమారునకు సంక్రమించేటటువంటి ప్రత్యేక వృత్తిప్రావీణ్యమూ, అభిరుచీ, ప్రజ్ఞాసామర్థ్యమూ చెడకుండా వృద్ధిచేసుకుంటూ ఉండడం కలదు ఈ కాలంలో కూడా తాతముత్తాతల కాలం నుంచీ ఆయుర్వేద వైద్యులుగా వ్యవహరిస్తున్నటువంటి ఆనువంశిక వైద్యులున్నారు. కాని, "వైద్యులు" అనేటటువంటి కులం ఒకటి ప్రత్యేకంగా లేదు. ఒకవృత్తినుంచి ఇంకొక వృత్తిలోనికి మారకుండా అనుసరించడంవల్ల ఆ యా వృత్తివిద్యలు ఎక్కువగా వికసిస్తాయి - నిజమే - కాని అందరికి ఆయా వృత్తులు నిర్ణయించినట్లుగా ఉంటాయి. నిరుద్యోగ సమస్య చాలా వరకు సమసిపోతుంది. కాని, ఒక వృత్తిలోని వారు ఇంకో వృత్తిలోనికి రాకూడదనే శాసనంగాని కట్టుబాటుగాని సంఘమునకు శ్రేయస్కరమైన అంగరక్షు కాజాలదు. అది కాళ్లకూ వేళ్లకూ బిగించిన సంకెళ్లవంటిదే అవుతుంది. అయింది నిజంగా యీ కాలానికి.

ఈకులాల కట్టుబాటునుగూర్చి 'సిడ్నీ లో' అనే యూరోపియను పండితుడు తాను రచించిన "హిందూదేశావలోకనము" అనే గ్రంథంలో యిలా వ్రాశాడు.

"ఈ కాలపు మిత్రసమాజములు, వాణిజ్య సంఘములు ప్రజాక్షేమాభివృద్ధి సంఘములు, మానవసేవా సంఘములు మొదలైన వన్నియు హిందువుల వర్ణవ్యవస్థలో యిమిడియున్నవి. పాశ్చాత్యదేశములో పని దొరకనివారికి పనులను కల్పించే సంస్థలు ఉన్నవి కాని ఇక్కడ అట్టివాని అగత్యం లేదు....కులవిభజనవల సమాన ప్రతిపత్తి గలవారిలో అన్యోన్య సంబంధ బాంధవ్యములు పెంపొందును. ఈ సంఘీభావశక్తియే స్వకులాభిమానంగా పరిణమించి స్వకులములోని వారిని పైకితీసికొని రావలెననే కోరికను పుట్టించును ప్రస్తుత పరిస్థితులను బట్టి చూడగా వర్ణవ్యవస్థను విసర్జించినయెడల భారతదేశం ఏతీరున ఉండునో ఊహించుట, యిప్పటి సందర్భమునుబట్టి సులభం కాదు.

వృత్తులకు ఉపాధులకు లోటులేకుండా చేసి ప్రజలకు సంతుష్టిని కలుగజేసింది యీ వర్ణవ్యవస్థ. అందుకు సంశయం లేదు."

ఈనాటి కమ్యూనిటీ ప్రాజెక్టులకు (సమాజ వికాసపథకములకు) యీ కులవృత్తులు అనేవి ఆటంకాలు కావు మన కొత్తపథ

(55-వ పేజీ చూడండి)

వీరుడు, ధీరుడు, విక్రమార్కుడు

[నూకాలమ్మ గృహం-యాయవారపు బ్రాహ్మడు ప్రవేశం.]

సిద్ధాంతి: శ్రీ సీతా రామాభ్యాన్నమః......

నూకాలమ్మ: సిద్ధాంతిగోరు, అట్లకేటి కాని, ఈయేల మంచిదేనా బాబు...

సి: ఓ, దేదీప్యమానమైన రోజు. ప్రయాణానికిగాని, ఓ పెళ్లికిగాని, వ్రతాలకిగాని..

నూ: అయ్యో కాదండీ, రాతకోతలకి.

సి: కోతలకేమో కాని, రాతలికి మహా దొడ్డరోజు.

నూ: మరిగలాగైతే, ఈ కాౖదుమీద రెండుగీతలు గీసిపెట్టు నాయినా. నీకు పున్నెం వుంటాది.

సి: నీ అమ్మకడుపు బంగారంగాను, యింకా తిరగవలసిన యిళ్లు చాలా వున్నాయి. యిప్పుడు వీలేదు

నూ: అట్టి కాడికి కే పిల్లకూడ దేటి?

సి: అలాగైతే యీ వేళ పింపమో.

నూ: ఆ నాలుగ్గింజలు నేనేత్తా లెద్దురు. కూంత రాసేద్దురు.

సి: ఓ, భేషక్కాగా వుంది. మరైతే కానీ...

నూ: ఇదిగో, శాత్తుర్లుగారు, ఏటిరాత్తావంటె, ఏలా రాతావంటె,

సి: అదంతా ఎందుకు, చిన్నవాళ్లకా, పెద్దవాళ్ళకా, ముందు చెప్పు, తరువాత విషయాలు చెపుదువుగాని.

నూ: "అయన్నీ నీ కెందుకు, నే నేలా సెప్తే ఆలాగ రాయండి

సి: చచ్చానురా దేవుడా! సరే అలాగే కానీ...

నూ: నా పెనిమిటి, బరతకి, నీబారియా నూకాలమ్మ రాసుకునే దేటంటే, ఇక్కడ అంతా సేమంగున్నారు. అక్కడ, నీ సేమాలు, నాకేటి తెల్దం లేదు. మనిద్దరికి పెళ్ళయి పదేళ్ళయింది. యీ పదేళ్ల లోను, తుమ రెండు మూడేళ్ళో కాపరం కాలబెట్టావు విద్దంలో కెళ్ళి డబ్బట్టు కొత్తాన నెళ్ళేవు ఒక సైలైనా దమ్మిడీ పంపేవుకావు. ఏం తిని. బతకమన్నావు. ఏ పెంతసేపు ఉత్తరాలు రాటమే కాని, మణిసిరాటం కాపడదు. (ఏడుస్తూ)మంతో పెళ్లయినోళ్లు పిల్లాజల్లలతో, సిలకా గోరింకల్లాగ ఉంటవేటి, నా రాతిలాగ తగు తినీది కూడే. (కోపంతో) ఆకు కట్టేది బట్టే, నేను కట్టిదీ బట్టే. నీకేవన్నా బుద్ధి గేనం వుందా...నువ్వూ మణిసి వే...

సి: ఇదేవిటి, ఇదేవిటి నే నేం చేసేను. మీది మీది కొచ్చేస్తున్నా వేమిటి?

నూ: ఆ కాౖదుమీ దలాగ రాయండి. నిన్నెందుకు తిడతానయ్యా...నా నోరు కొవ్వా.

సి: ఆహా, రాసే సే ను, పై విలాసం చెప్పు.

నూ: పోస్టోరు దయుంచి ఈ కాౖదు యిప్పించి సదివి యినిపించేది.

సి: ముందు నీ మొగుడి పేరు చెప్పు.

నూ: మొగిడిపే రెవరైనా సెపుతారా... మీకు తెలిదేటి నాయనగోరి పేరు.

సి: అన్నటు వీరయ్య కదూ.

నూ: అవునండి చింబోతు ఈరయ్యండి. ఇదిగో ఈ సీటీలోవుంది సూసిరాసుకోండి. అ అ మర్సిపోయాను నీకు నాదణ్ణాలని ఆకర్ని కూంత ఎట్టండి.

బి. ఏ. రామారావు

సి: ఎక్కడరాయమన్నావు. ఎడ్రసు లోనే?

నూ: ఎక్కడైతేనేం లెద్దురు. కూంత యిరికిద్దురు.

సి: అఘోరించినట్టే వుంది. సరేలే.

నూ: ఆ యెల్లేదార్ని ఈ కాడ్సు పోస్టు పెట్టెలో పడేసి కూంతబేగి పంపేమనండి బాబు, బాబు

సి: అలాగే కాని, మా నాట మర్చిపోయేవు. చెంబునిండా బియ్యా మోసుకురా.

నూ: అయిబాబు మరిసిపోలేదండి. ఊ...ఎల్లిరండి.

* * *

[చాతీమీద పతకాలు తగిలించుకొని వస్తూవున్న వీరయ్యకి సిద్ధాంతి వీధిలో ఎదురవుతాడు]

సి: ఏమోయి వీరయ్యా...ఎప్పుడు రావడం. నీ గురించి నీ పెళ్లాం గోలపెడుతోంది. ఇప్పుడే నీకు ఉత్తరం రాసి పోసులో వేసివస్తున్నా.

సి: ఏమని రాయిస్తుంది? నువ్వుగాని తక్షణం రాకపోతే, నీళ్లున్న ఏనుయ్యో, గొయ్యో చూసుకుంటానని రాయించింది.

వీ: అలాగైతే మంచిసైముకి వొచ్చేనన్న మాట.

సి: సరేకాని వీరయ్యా...ఏమిటా పతకాలు?

వీ: కూంతో కొంతో సదుంకున్నావోడివి అయ్యేటో నేను సెప్పాలా. సదువుకోవయ్యా

సి: వీరుడు, ధీరుడు, విక్రమార్కుడు... అమ్మబాబో. వీటిని ఏవూళ్లో యిచ్చేరు.

వీ: ఏదో వూళ్లో యిచ్చేరుకాని, షంతులారూ...నా పెళ్లాం అగ్గిబుగ్గయి పోటం లేదుకద.

సి: అంత వీరుడవు, ధీరుడవు, విక్రమార్కుడవు, నీ భార్యకు భయపడుతున్నావా...నాకు సిగ్గేస్తోందోయ్.

వీ: మద్దిని నీకు సిగ్గెందుకయ్యా నాకు బయమేటండి. నాగురించి పాప మేడుత్తుందేమో అని అడిగేనుకాని...బాబూ ఎల్లొత్తానండి.

సి: వెళ్లిరా. మళ్లా కలుసుకుందాంలే...

* * *

[వీరయ్య గృహం ... వీరయ్య ప్రవేశం.]

వీ: నూకాలు, నూకాలు ... (తలుపు కొడుతూ) నూకాలు...నూకాలు.

నూ: (లోపలనించి) ఎవలు సెప్మా. మావాయన గొంతుకులాగుంది. అంతదుష్టమా. ఎవలాలూ...

వీ: నేనే..నీ పెనిమిటి బరతని. అప్పిడే మరిసిపోయే వేటి?

నూ: అవును. అతగాడే. అమ్మ... ఎన్నాలకిన్నాను ఆ గొంతుకు. (తలుపు తీసి) ఏటుత్తర పత్తరం లేకుండా వొచ్చీసేరు. మిమ్మల్నావూరు రానిచ్చిందా? సిద్ధాంతి గారితో కాౖదు రాయించి ఈయాలే పడీసీసేను.

వీ: అవునంట. కాపడి సెప్పేడు. అవును కాని సిక్కిసీమైపోయే వేటి? తిండితిప్పలు తిండం లేదేటి.

నూ: తింఖేమాౖతం అరగొద్దు. మీ

వీరుడు, ధీరుడు, విక్రమార్కుడు

కాని, నా కంటంపీకలో పేనమున్నాదను కున్నా రేటి ?

వీ: అవును గాని నా తిండితిప్పలు మాటేటి?

నూ: మీరొత్తారని కలగన్నా నా. పొయి రాజేత్తాను. ఎంతసేపు నిమిసం.

వీ: నే వరిటిపళ్లొట్టుకొచ్చేన్లే. ఇప్పుడే నేటయిపోయింది. అయితినేద్దాం.

నూ: వొంటిమీద కాసిని నీళ్లేసుకోరేటి. నూతికాడకెల్లి, ఎంతసేపు ... మీరొచ్చే టప్పడికి వొన్నం అయిపోదూ.

[భోంచేసి కూర్చుంటా రిద్దరూను.]

వీ: అబ్బ, ఏం, ఎన్నాలకి నీసేతొంట తిన్నానే నూకాలు.

నూ: అవును కాని ఆ దేసాలు వొదిలి రాబుద్దియ్యలేదేటి ? ఎల్లినోడకెల్లి మళ్లీ వొడకొత్తనన్నావు. ఒకనెలా, రెండు నెల్లా.. నీకేవన్నా గేనముందా, బుద్ధుందా. నాతో పెల్లయిన మా మావకూతురు పది మంది పిల్లలతల్లయింది. (ఏడుస్తా) నా నొక్కకాయి...ఒక్కకాయి...

వీ: అయితే నీ కిప్పుడువొచ్చినలోటేటి. పిల్లలు లేరని ఏడుత్తున్నావు కాని నీ బరత ఎన్ని ఇద్దాలు గెలిసేడు, ఏటి, అడేవాలోసించేవా.

నూ: ఇద్దాలు గెలిత్తే మనకొచ్చిపడిందేట్టి? పోనియికానిండి నా ఏడుపు నాది. అడగడం మర్సిపోయేను. ఎంత డబ్బొట్టుకొచ్చేరేటి. ఇలాగియ్యండి జాగర్త పెడతాను...రోజులు బాగా నేవు.

వీ: అబ్బో సాలా సంపాదించేను.

నూ: ఏది, ఏది, ఇలాగియ్యండి ... దాత్తాను.

వీ: ఇక్కడికి తేలేదు. తెత్తే కరుసైపోతాదని అక్కడే వుంచొచ్చాను. ఈ పాలెల్లి నప్పుడొట్టుకొత్తాలే.

నూ: మల్లీ యెల్లడంవుందేటి. సేన్లే మా బాగా సేసేరు. అక్కడొదిలి పెటిరాడమేటిడబ్బు. మనం జాగర్త సేసుకోలేమ నే? మా బాగా సేసేరులెండి. ఎంటనే పెల్లి గ్రాములెట్టి పంపీమని ఉత్తరం ముక్క రాయండి. అది ఇక్కడ ఎవరికీ తెలీకుండా దాసీసుకుందాం.

వీ: అలాగే కాని తొంగుందు. నేను కంటిమీద రెప్పేసి వారం పదేను రోజులైంది.

నూ: అవును కాని, సాతీమీద బిళ్ళలు తగిలించుకొచ్చేరు, అయ్యేటి?

వీ: సానా గొడవుందిలే. యిద్దాలు గెలిత్తే మెచ్చుకోని మెడలీసిచ్చేరు.

నూ: మీ మెడలిర్సీసేరా? ఎందుకు?

వీ: మెడలిరటం కాదే. నీకేటి రూల్సు తెల్దు. మెడలీసులు బవుమతిలిచ్చేరు. బవుమతులు. నేను పెద్ద ఈరుడ్ని అని పేరిచ్చేరు. ఈరుడంటే ఏటో తెల్సా. నువ్వు సదుంకోలేదు...నీకేటి తెలుత్తాది. ఈరుడంటే...ఈరుడన్న మాట.

నూ: నీ పేరొదిలీసి ఈరిగోడేటి?

వీ: ఈరిగోడా...ఈరుడంటే పెద్ద రగిడీ సన్నమాట. పడుకుందు. రేపు సెపుతాను.

[మర్నాడు - ఉదయం... వీరయ్య గృహం]

వీ: నూడు, నూకీ, కాఫీ లడీఅయిందా..

నూ: కాఫీ లేదు గీపీలేదు. సద్దెన్నం తిందురు. వొంటికి సలవ.

వీ: నా వొల్లేడెక్కిపోలేదు. కాఫీలేంది నిమసముండలేను.

సీ: శీతారామాభ్యాన్నమహా...

వీ: మాబాగా వొచ్చేరండి...బాబు సిద్ధాంతిగారు మనూళ్ళో వొటేల్లేమీ లెగ లేదటండీ.

సి: వాటికి లోటా - చాలా వెలిసేయి.

వీ: అయితే పదండి, కూంత కాఫీ తాగొద్దాం.

నూ: ఆ వొచ్చిది మా తమ్ముడు నాగున్నాడు. రెండు కాఫీనీలు పడేత్తానుండండి.

వీ: కూసేరండి పంతులారు. అల తమ్ముడు ఒత్తన్నాడని కాఫీ సేత్తానంటంది. ఇన్నాలకి ఇంతదూరం నుంచొచ్చేమని మన మీద్దైనైనా వుందా?

నరసయ్య: అయ్య నా బావోయి... ఎన్నాలకి కనపడ్డావు.

వీ: అవున్రా, నరసింవులు. సేన్నాలయింది. వున్కాలు బాగా నడుత్తుందా.

నూ: ఏదో కాలచ్చేపం సేత్తున్నాడు. ఇనసపెక్టేరొచ్చిముందు, ఈదిలో ఆడతన్నా నలుగురి పిల్లల్ని కాల్లుసేతులు కట్టి తీసికెల్లి కూసోబెడతాడు.

సి: మొన్నొచ్చిన ఇన్నపెక్టరు చాలా మంచిపేరిచ్చేట్టకదూ నీకూ!

నరసయ్య: ఏం మంచిపేరులెండి. నూరయ్యగారి పిల్లలు రాజమండ్రీలో సదువుకుంటన్నారు. అళ్ళు ఆ టైముకి మనూరొస్తేని, తీసుకెల్లి బళ్ళో కూసోబెట్టేను. అన్ని కొస్సిన్లు అల్ని అడిగితప్పడికి టా, టా అని సెప్పీసేరు. గుమ్మత్తిపోయి గుమ్మంలో బోర్లపడ్డాడనుకోండి. ఇనసపెట్టు.

వీ: మంచిపనా, దగాకోరుపని కాద టండీ. మంచోడికేనయ్యా పంతులారు... మెచ్చుకుంటున్నావు.

న: పోనికాని బావా, ఏటిసేసనాలు సెపుదు. అబ్బ. ఎన్నాలకి కొపడ్డావు. సచ్చినోడు బతికొచ్చినట్టుంది.

వీ: ఇందాకటినుంచి సూత్తున్నాను. ఈ సాతీమీద ఇయ్యేట అడుగుతారని. అలాగ సూత్తన్నావుకాని, అడిగేవా...

న: అవును బావ. అడుగుదామనుకుం టుంటే నువ్వే అడిగేవు. ఏటయియ్యి?

వీ: మీరంతా సదువుకున్నావోలు. నేను సెప్పాలా. ఇద్దంలోకెల్లి వూరికినే వొత్తా మేటి?

నూ: అవును, డబ్బొట్రా లేదు గాని, ఇగొయ్యేటుకొచ్చారు.

వీ: సెప్పరా. నరిసెవులు, మీ అప్ప తోటి. ఎప్పుడు సూసినా డబ్బే. డబ్బయితే కరుసైపోతాది. పేరు.

సి: పేరు అలా నిలబడిపోతుంది.

వీ: అదీ, అదీ మాబాగా సెప్పేరండి పంతులారూ. అలాగ అది నీటట్టు మళ్లీ సెప్పండి. అవును గాని నరిసివులు, ఇయ్యేం దుకొచ్చాయో అడిగేవా.

న: అడుగుతుంటే సెప్తున్నావా?

వీ: ఇంకా ఇద్దరు ముగ్గురొత్తే బాగున్ను. మల్లా ఆలకి ఏరే సెప్పాలి.

సి: ముందు మాకు చెపుతూ.

వీ: జఫానోలొచ్చి మావూరికి 30 మైళ్ళ దూరంలో మకాం సేసేరని తెలిసి మా పెద్ద దొర నన్ను పిలిసి, మీ రెలాగైనా ఎల్లి అల్ని కొట్టెయ్యాలన్నాడు. నాతో వొచ్చి నోలు వుట్టి పిరికోలు, ఫరవాలేదు రండ్రా అన్నాను. మమ్మల్ని సూసి జఫానోలు టుపాకిబార్లు పేల్సడం మొదలెట్టేరు. భూమ్మీద బోర్లపడుకున్నాం. గుళ్ళు గాల్లో పిట్టల్లాగ ఎగిరిపోయాయి.

నూ: అమ్మ బాబో ఆ గుళ్లు తగిలి తేటి గతి?

వీ: మరే టనుకున్నావేటి? కాలిసేరు, కాలిసేరు, మందయిపోయింది. అది కని పెట్టి సెమ్మదిగా లెగిసి సూసేటప్పటికి కర్రలట్టుకొత్తున్నారు.

న: ఎవరూ?

వీ: ఎవరు? జఫానోలు. ఎటు సూసినా పీందారి కొపడలేదు. పాలిన్' అని కేక లేసేను. మావోలంతా ముద్దలాగ సేరిపో యారు. అక్కడొక కర్రముక్క పడుం టేని, అదట్టుకుని సాము సెయ్యడం మొద లెట్టేను. అలాగ సాము సేసుకోని మావోల సుట్టు తిరుగుతున్నాను. మావోలమీద ఈగ వోలనిచ్చే నేటి! 'సుక్కమారనీ' అన్నాను. సేసుకోనే రెయ్యిలు టేసినుకాడ కెల్లి పోయేం. అస్టైముకే రెయ్యిలుబండి టేసి నులో లడీగుంది. దాంట్లో దూరేసేం.

న: జపానో లెలిపోయారా?

వీ: అలా ఎల్తారూ? రెయ్యిలుబండిమీద పడ్డారు. కిటికీలోంచే బండి కదిలీదాకా అలాగ సాము తిప్పుకోనే వున్నాను. బండి కదిలింది. నావోలి గుండి కదిలించా నను కోండి.

నూ: అమ్మ - ఇక్కడ నా గుండికా యాగిపోయింది.

సి: నిజమే మా గుండి ఆగిపోయింది.

వీ: సీ, ఏం పిరికోళ్లరా మీరు. యీ సంగతి మాకమండరంతోటి మావోళ్ళు సెప్పారు.

నూ: కమండలం అంటే యేటి.

వీ: నీకు రూల్సు తెల్దు, నువ్వూరుకో, మా పెద్దగొరని అలాగ పిలుత్తారు. మాక మండరం నన్ను కౌగలించేసుకుని నా గుండి కాయమీద ఈ మెడలీసు తగిలించేసీను. అప్పుడ్నుంచి నా పేరు సెపితేసాలు, జఫా నోలికి అడులు.

న: పోనియితే బావా పేరు తెచ్చుకు న్నావు. మరి నే నెల్తాను. సాలా పనుంది.

వీ: మరి యీ రెండు మెడలీసులు ఎంగులో ఇచ్చారో అడగవేటిరా?

సి: రేపు సెపుదువుగాని లెద్దు. తిరగ వలసిన యిళ్ళు చాలా వున్నాయి.

వీ: అయితే యెల్లండీ నాకేం.

[మర్నాడు. వీరయ్య గృహం]

అప్పన్న: ఏటీరయ్యా. కళ్లు నెత్తిమీది కొచ్చేయేటి. మా కుర్రోడిని ఉత్తిపున్నేనికి కొట్టేవట. ఆడు ఏటిసేసేడని, దవడ్డోసి పోయినట్టు కొట్టేశావు?

వీ: కొడతానా. దుమ్ము లిరగబోడిసే త్తానా? అలాగ కాలవగట్టంట ఎల్తుంటేని, పిచ్చోడెనకాల పడినట్టు కేక లేసుకొని ఏలా కోలం సేత్తే రెండేసేను, తప్పా.

అప్పన్న: తప్పా, తప్పన్నరా, ఉండు మునిసీబుతో సెప్పేం సేత్తానో సూడు.

వీ: సెప్పుకో. మునిసిబు కాకపోతే కర నంతో సెప్పు నన్నేం చేత్తారాలు. మిల్టీ్రి. మిల్టీ్రివోల్ని ఎవరూ ఏవన్నానికి రూల్సు లేదు. ఏటనుకుంటున్నావో?

అ: అలాగే సూత్తా గా.

[సిద్ధాంతి, నర్సయ్య ప్రవేశం]

సి: ఏమిటప్పన్న. తాచుతొక్కిన తోక లాగ మహాకోపంతో పోతున్నాడు.

వీ: ఏటో మునిసీబుతో సెప్పి నాపీక తీయించేత్తాడట. మిల్టీ్రి, మిల్టీ్రివోల్ని ముట్టుకోడానికి రూల్సులేదు. ఏటనుకుం టున్నాడో యేంటో.

వీరుడు, ధీరుడు, విక్రమార్కుడు

న: పోనీయి కాని బావా, అక్కడి యిసేషనాలు సెపుదూ.

వీ: రెండో మెడలీసు ఎందుకిచ్చారంటేని, మా కు కాంపుల్లోకి పెతిరోజు దొంగలు పడీవోరు. ఆల్ని పట్టుకోడానికి ఎవరి వోసిం అయింది కాదు. ఎలాగైతేం అందరూవొచ్చి బాబు మీరు సెయ్యి సేసుకుంటేనేగాని యీల్లేదని నన్ను బతుమిలాడారు. ఒక మకాంలో ఆయేల దొంగలు పడతారని ఇనపరమేసను వొచ్చేసింది. నాతోటి గునపల్లాటి చిప్పాయిల్ని తీసుకెల్లేను. నడిరాత్రయింది. అప్పటికప్పుడే దొంగలులోపలున్నారు. ఆల్ని సూసి నాతో కూడా వొచ్చిన చిప్పాయిలు ఉడాయించేశారు.

సి: అయితే నువ్వొంటిగాడివయిపోయావన్న మాట.

వీ: ఏంసెయ్యను, అందాక దొమ్మి యెనక్కి తిరిగి రానా. సరేఅని గుండె నిబ్బరం సేసుకొని లోపలికి దూరేను, ముందు వొచ్చేవోడిని పట్టుకొని ఆడినోరు నొక్కేసి రెండు కవుకుపోట్లు పొడిసేను. ఆడు బూమికి బలా దూరైపోయాడు. తీరా సూత్తే ఆడికాడ మాటేమీ లేదు. సీ, అని అక్కడ నుయ్యుంటేని, అందులోకాడ్ని యిసిరేసి కూంత లెక్కెట్టేటప్పటికి ఇంకోడు మూటట్టుకొని పారిపోతున్నాడు. సిన్న కర్రపుల్ల ఆడికాళ్లకి అలాగ అడ్డంగా ఇసిరేను. టపీమని బోర్లపడ్డాడు. ఒక్క ఊపుని ఆడిమీద పడి గుర్రమెక్కి కూసున్నాను. ఇంకేటి సేత్తాడు! యీలోపుని బల్ళుని తెల్లారిపోయింది. అప్పుడొచ్చారండీ మానోళ్లు.

నూ: మాతోరగా వొచ్చారులే.

వీ: దొంగోణ్ణి ఆల్ల కప్పసెప్పి వొంటిమీద రెండు నీలు సుక్కలేసుకొని వొద్దామని యెల్లేను. ఆటూ ఏటి సేసేరనుకున్నారు?

న: ఏటిసేసేరు?

వీ: దొంగోణ్ణి ఆల్లే పట్టుకున్నామని కమండరంతోటి సెపుతున్నారు. ఆ దొంగోడు నేను రాటంసూసి, ఈలు కాదు బాబూ. ఆ వొచ్చి మారాజు నన్నొట్టుకున్నావోడు' అనీతలికి మా కమండరం ఆలమీద అగ్గిబుగ్గయిపోయి ఆల్ని కయిదకట్టేసి నాకు రెండో యీ మెడలీసిచ్చేశాను.

[పోలిగాడి ప్రవేశం]

పోలిగాడు: బాబూ ఈరయ్యగోరూ. అప్పన్నగారి బుల్లోడ్ని మీరు కొట్టినారట. మునిసీబుగారు తమర్ని వరిజంటుగా రమ్మంతున్నారు.

వీ: నేను రానని సెప్పు, మిల్టీ్రి, మిల్టీ్రి, ఏటనుకుంటున్నారో, యేటో, మీకు రూల్సు తెల్దు. యెల్లూ ఇంకా కదలవేం—

పో: అయిబాబు, ఎల్తానండీ? అంత కోపమేంటండీ

నూ: ఎల్లకూడదటండి. ఎల్లపోతే ఏంతగాదొత్తాదో.

వీ నీకు రూల్సు తెలీదు. నువ్వూరుకో. యీమూడో మెడలీసు ఎలా గొచ్చిందో అడగరేటర్రా.

సి: అవును చెప్పు, వీరయ్యా.

వీ: మాకు ఏనుగులున్నాయి.

నూ: ఏనుగు లెందుకు?

వీ: నీకు రూల్సు తెలీదు, నువ్వూరుకో. అందులో వొక యేనుగు మా పొగరమోతుగా ఉండేది. దాన్ని లొంగదీయడానికి ఎవలి వోసిం కాకపోయింది. నీరుగానీ సూసిందంటే ఎనక్కి తిరిగి ఎలిపోయేది. ఆ యేనుగుని నువ్వు లొంగదియ్యాలని నా కప్పసెప్పేరు. అయేలతో నాపని ఆకరనుకున్నారుఅంతాను. ఎల్లేనండి. ఎనకాలనుంచి ఎక్కి కూసోని 'సెలో' అన్నాను. మారాజులాగ నడిసింది. సెడ్డపీడుగా పోతంది. మేపల్లే దారిలో ఏరొక టడ్డొచ్చింది. అది రెండు నిలువుల లోతుంది.

న: ఎనక్కి ఉడాయించింది కాబోసు.

వీ: ఉడాయింపబోతంది. ఊరుకున్నానేటి. సెవ్వు లొట్టుకొని తిప్పేసేను. ఇంకె

> సినిమాలో క్లైమాక్సు అందుకొంది. ప్రేక్షకులంతా ఊపిరి బిగబట్టి చూస్తుండగా తెర మీది కథానాయకుడు కథానాయకి చెంపమీద ఛెడీమని కొట్టాడు. నాయకి క్లోజప్పులో కన్నీళ్లు కారుస్తోంది.
>
> రూపాయి పద్నాలుగు అణాల క్లాసులో తల్లితండ్రులతో కలిసి సినిమా చూస్తోన్న కుర్రాడికి వెంటనే సందేహం వచ్చి, "అమ్మా! ఆ అమ్మాయి నీలాగా మళ్ళీ అతన్ని పట్టుకు కొట్టకుండా ఊరుకుంటుం దేం?" అని బిగ్గరగా అడిగాడు.

అంతలోతు ఏరెలాగ దాటవా అనుకుంటుంటేని, భూమ్మీద నడిసినట్టు నీటిమీద నడిసెల్లిపోయింది. అందరున్ను ఆహా ఆహా అని నాలిక కర్సుకున్నారు.

సి: ఏవిటి, విచిత్రం, ఏను గేమిటి, నీటిమీద నడ్పమేమిటి?

వీ: అబద్దా లనుకుంటున్నా రేటండి, పంతులారు. అయితే సెప్ప నెల్లండి.

న: అబ్బే, అబద్దాలని ఎందు కనుకుంటాం. సెపుదు.

వీ: ఏటి సెప్పను? అప్పుడిచ్చేరు ఈ మూడో మెడలీసులు.

సి: పోతే పోయిందిగాని మంచి పేరు సంపాయించుకున్నావోయి వీరయ్యా.

వీ: పోతే పోడమేటండి.

నూ: డబ్బు పోలేదా.


వీ: ఎక్కడికి పోయింది. నీ కెప్పుడూ డబ్బుగోలే. అబ్బ! ఈ పూరు నీలు పడ్డం లేదు తలనొప్పట్టుకుంది. ఇక్కడి డాకెటేరు నాతో బరమాలో పనిసేసినోడే. ఎల్తాంత్తాను.

[హాస్పటల్ — డాక్టర్]

డాక్టర్ : ఏమోయ్ వీరయ్యా. నువ్వే వూరొచ్చి ఇన్నాళ్లయింది. ఇప్పుడా రావటం నన్ను చూట్టానికి...అదేమిటి తగిలించుకున్నావు?

వీరయ్య: బాబు, మెడలీసులు, మీకు తెల్దనేముందండి.

డా: నీ కెవరిచ్చారు వీటిని?



వీ: ఎవరిత్తారండీ! నేనే ఎట్టేసుకున్నా నండి. యీలాకేటి తెలుత్తాదండి. ఇయ్యి నచ్చినోలియ్యాని.

డాక్టర్: అవునుగాని, ఏమిటి చెలాయిం చేస్తున్నావట? అప్పన్న కొడుకుని అన్యా యంగా కొట్టి, మునసబు కబురంపిస్తే రానన్నావట.

వీ: మనం అలాగ డబాయిత్తే నేగాని యీల్లేదు బాబు. అక్కడ చెవాలు మోసే వనుకుంటారు మీరుమాత్రం గుట్టు బయల్లే పెట్టకండి. మీరూ నాలోట్లో అనుకుం టారు.

డా: బాగా నేవుంది. మనిద్దరికిలం కెట్టేవా?

వీ: బాబు మీరు అలా గూరుకోండి యీలకి రూల్సు తెలీదండి. పోనీయి కొనండి, ఈపూరొచ్చిన కొణ్ణించి తలనో ప్పెట్టుకుందండి. కూంత మందిద్దురూ, నే సెలిపోతాను. అసలు గుట్టు గుప్పిడోడల కండి బాబు.

డా: మంచి వీరుడవేనోయి.

వీ: (నవ్వుతూ) బాబూ సెలవు. నే సెల్లొత్తానండి.

[వీరయ్య యిల్లు]

న: ఈరయ్య బావా మాజోరుగా ఎల్తె న్నావు.

వీ: ఉండళా, సూడూ నూకీ, ఏటి సేత్త న్నావేటి? పలక వేటి యీదిలో వోలికి పులి, యింటో పిల్లి అయిపోయింది నా బతుకు. ఊలకవు పలకవు.

నూ: ఏం. ఏంవొచ్చి పడిందేటి?

వీ: వొన్నం పెట్టే; పడుకుండిపోతాను, తల నొత్తంది.

నూ: నిన్ను సూత్తే నాతలా నొత్తంది.

వీ: నువ్వే యిద్దంలో కెళ్లేవు తల నొవ్వ

[భోంచేసి కూచుంటారు]

వీ: ఏటాగోల?

నూ: బాబో, దొంగల్లాగున్నారు.

వీ: నిజమే? దొంగలే అయుంటారు.

నూ: అవును, యిప్పుడెలాగ? అలా సూత్తాకేటి మతోయినోడిలాగ?

వీ: దొంగలే. (ధైర్యం తెచ్చుకుని) నే నాళ్ళసంగతి కనుక్కుంటాను గాని నువ్వు జడిసిపోకు.

నూ: ఇప్పుడెలాగ. నాకేటి పాలుపో వడం లేదు. లెగండీ.

వీ: లెగిసేం సెయ్యను. సేతులో కర్రా లేదు, కంచీ లేదు.

నూ: కర్రుందండి. అదేటి ఆమూలని సీపాటి కర్ర. లెగిసి ఏదో దారి సూడండి.

వీ: కర్రుందా? అయితే అదిలాగ అందుకో.

నూ: నే సెల్లను బాబు బయమేత్తంది.

వీ: నేనుండగా నీకు బయమెందుకు, ఎల్లు పరవాలేదు. అ. వుందుందు కర్రుండి ఏం పెయోజనమా అని ఆలోసిత్త న్నాను, దొంగలు రాళ్ళిసురుతున్నట్టు న్నారు రాల్లముందు కర్రేటి సేతాది. ఆల సంగతి రేపు కనుక్కుంటా లెగ్గు. నువ్వూరుకో.

నూ: రేపు కనుక్కుంటావా? రాత్రికి అట్టారుకుంటారా?

వీ: ఊరుకోక ఉరెట్టుకుంటారా? ఏం పట్టుకెల్తారు పట్టుకెల్లనియ్యి. నేను కను క్కుంటాను, ఆలసంగతి.

నూ: మంచి మొగోడివే నండీ. ఇలాగే నేటి యుద్దమాడినావు. అమ్మో దొంగలు, దొంగలు.

[ప్రక్కింటివారు "ఏరి, ఏరి."

నూ: అదుగో ఆగదిలో ఉన్నారు బాబు.

వీ: అవునండి. మీ రెల్లండి పరవాలేదు నేనున్నాను.

నూ: అమ్మ బాబో, ఇదేటి పందికొక్కు. దొంగలనుకున్నాను నేను.


వీ: నేను సెపితే యింటావా? నాకు తెల్సు. అది పందికొక్కని. ఎలాగా ఆడోల్లకి పిరికెక్కువ.

నూ: అవును లెండి. మంచం దిక్కుండా మాట్లాడతన్నారు.

ప్రక్కింటివారు: అలాగంటావేమిటి? వీరుడు, ధీరుడు, విక్రమార్కుడు.

వీ: సాల్లెండోయ్. నల్లిని నలిపేసినట్టు నలిపేత్తాను. అబ్బ! యీ మంచంనిండా నల్లులే.

[ఆలిండియా రేడియో ప్రసారితం.]



సీరియల్ 'శారద'


29

మరొక మూడు నెలలు జరిగిపోయాయి. చలి బాగా ముదిరిన జనవరి నెల తొలిరోజులు, అవి. భాస్కరం పొద్దున్నే లేచి కృష్ణలో స్నానానికి వెళ్తాడు. పద్మకూడా వెళ్తుంది. ఎంత చలి అయినా కృష్ణలో నీళ్ళు వెచ్చగావుంటాయి. అంతేగాదు, ఆ ప్రాతస్సంధ్యలో అక్కడి చక్కని దృశ్యం! కొండల మధ్యనించి వుదృతం తగ్గి నిదానంగా ప్రవహిస్తున్న గంభీరమైన నదీజలం పెద్ద పెద్ద రాళ్ళసందుల్నించీ, ఇసకమీదుగా, సిగ్గుపడుతూ, తలవంచుక నడుస్తున్న లేజవరాలులా వుంది కృష్ణ. భాస్కర్రావు తూర్పున ఉదయిస్తున్న సూర్యుని తొలికిరణాల సందర్శనం కాగానే స్నానం ముగించి ఇంటికి మళ్ళేవాడు. పద్మ నల్లంచు తెల్ల చీరెకచ్చలుపోసికట్టుకుని, తడిజుట్టు తుడిచి ముడేసుకుని అతని వెనకే వెళ్తుంది. ఆమెని చూస్తే, అన్నీ త్యజించిన యోగినిలాగా అగుపడుతుంది. ఆమె ఇలా పవిత్రంగా అగపడాలని ఎందుకు ప్రయత్నం చేస్తోందో ఆమెకి తెలుసు. యధార్థంగా ఆ చలిరోజుల్లో తెల్లారకట్టలేచి చన్నీళ్ళస్నానం చెయ్యటం ఆమె కిష్టం ఉండదు. అయితే ఆమె ఈ రెండు నెల్లనించీ చేస్తున్న పని ఫలితానికి వచ్చేసింది; అది ఆమె కింకా అనుమానమాత్రంగానే వున్నప్పటికీ, ఆ అనుమానం రూఢి ఐతే? ఒక శిశువును తనలో పెంచుతున్నదన్నమాట! దీనితో ఆమెమనస్సులో వేదనా, భయం ప్రారంభమైనాయి. ఆ వేదనకి మందేదయినా వేయకపోతే తన అంతరాత్మే తనకి శత్రు, అనుక్షణం మనస్సును కోసేస్తుంది. భరించలేనంత భయంకరంగా తయారౌతుందా వేదన. దానికి ఒక మందు అందరు ఎరిగినది వుంది. అది భక్తి! అందుకనే ఆమె ఉదయమే స్నానంచేసి వచ్చి ఏవో పూజలనీ, పునస్కారాలనీ మనస్సును కాసేపు మాయలో పెడ్తోంది. అట్లా ఎంతోసేపు వుండలేదు; ఇంకొకర్ని వంచించదటమైనంత తేలికగా, తన్ను తాను వంచించుకోటం సాధ్యంకాదు. ఒకవేళ కాసేపు అట్లా మోసం చేసుకున్నా, అది చాలా స్వల్పకాలం మాత్రమే.

పద్మ పదిగంటలదాకా ఈ పూజల్లో గడుపుతుంది. సాయంత్రానికి ఈ వేదనా, భయాలూ, భక్తీ సహజోద్రేకాల బలిమిలో మణిగిపోతాయి. మనస్సు మధుసాధనం ఇచ్చే దబ్బువేపు, శారీరక సుఖాలవైపూ మళ్ళిపోతుంది. ఆవేళకి ఆమె తన ఇంద్రియాలను నిగ్రహించుకోలేకుండా వుంది. ఆమె కిది తొలి అనుభవం. నిజానికామె ఈ యౌవనకాలాన్ని ఎంతో ఉత్సాహంతో ఆనందంతో స్వేచ్ఛగా పండగలాగా గడపవలసింది. సహజ వాంఛన్నీ ఆకలినీ తీర్చుకోడంలో కలిగే ఆనందాన్ని ప్రకృతి దత్తమైనదిగా గౌరవంతో, సమాజం శుభాశీస్సులతో అనుభవించవలసింది. కాని నేడామె ఆ ఆనందాన్ని రహస్యంగా దొంగలాగా జారిణిలా అనుభవించవలసివస్తోంది. కాని ఇందువల్ల తనమీద ఎవరికీ సానుభూతి కలగదనీ, ఈ రహస్యం తెలిస్తే ఈ వున్న కాస్త సానుభూతికూడా పోతుందనీ ఆవిడకి తెలుసు. ఆవిడలో ఈ రెండు నెలలుగా వుంటూ వచ్చిన ఆనందం మాయమై, రోజురోజుకీ దిగులు ఎక్కువౌతోంది. దీనికి తోడు ఒకనాడు వున్నట్టుండి మధుస్వాదనం మాయమైపోయాడు అక్కణ్ణించి. ఆమె ఆరోజు రాత్రల్లా వేదనపడింది. తనను తాను తిట్టుకుంది.

ఇదివరలో ఆకలితో అలమటించిన రోజుల్లో ఆమెకి ఆకలి బాధ వొక్కటే పీడించేది. ఇతరత్రా మనస్సంతో నిర్మలంగా వుండేది. అంతరాత్మ బాధ వుండేదికాదు. తన నీడ తానుచూసి వులికిపడే ఈ దౌర్భాగ్యస్థితి చాలా దారుణంగా వుందామెకి. తనను తాను పాపాత్మురాలని తిట్టుకోడంతో తీరే బాధగా దిది. కడుపులో శిశువుకి ఇవేమన్నా వినిపిస్తాయా? కాని తన శిశువును గురించి తల్చుకుంటే అప్పుడప్పుడు ఆనందంగాగూడా వుంటుంది. తను ఆ పసిపాపని కని...ఆ సెల్యులాయిడ్ బొమ్మలాంటి పాప నవ్వులో, ఏడ్పులో పాలుపంచుకుంటే ఎంత బావుంటుంది! ...బాగానే ఉంటుంది. కాని సాధ్యమా? సాధ్యం కాకపోయినా చేసేది ఏమిటి? నల్గురికీ తన ముద్దుపాపను చూపించి మురిసిపోటానికి లేదు...!

అటు పుట్టింటికీ ఇటు మెట్టినింటికీ కాకుండా పోయిందిది. ఎక్కడికిపోయినా దర్వాజాలు బంద్. ఎవరుచూసినా [illegible] ముడుచుకుని మెటికలు విరుస్తుంటారు. [illegible] చేస్తారు. తన కుట ఎవరూ [illegible]



దుర్గద్వారం (వరంగల్లు కోట)

—ఫొటో. జి. పి. యస్. హరి (వరంగల్)

ఇంకొకరే వుండి తాను పవిత్రంగా వుంటే, సానుభూతితో చూడగలిగేదేనా? ఆ ప్రశ్నకి సమాధానం లేదు.

కాలం మాత్రం పరిగెడుతోంది

రాత్రులకి రాత్రుళ్ళు పక్కమీద పడుకుని కుమిలి కుమిలి ఏడుస్తోంది పరిష్కార మార్గం తోచటంలేదు కలరా తగిలి గంటలో చచ్చినవాడిలాగా ఆ విశ్వ ఉన్నట్టుండి మాయమై పోయినవాడు ఉంటే ఏదైనా వుపాయం చెప్పేవాడేమో! వాడి కంత ధైర్యమే వుంటే ఇట్లా పారిపోతాడా తనను వొదిలిపెట్టి! ఇక తానే ఆలోచించుకోవాలి ఏదైనా వుపాయం వీళ్ళందరికీ తెలిసి వీళ్ళచేత నానామాటలు పడటంకన్న... అసలైన ఆమెకి ఏ ఆలోచనా తోచదు.

ముసలమ్మకి అనుమానం తగుల్తోంది రెండు మూడు నెలల నించీ అమ్మాయి ముఖంలో చేష్టలలో ఏదో తెలియని మార్పు కనపడుతోంది ఏదేనా జబ్బేమో నని [illegible] అంతకంటే ఏమనుకుంటుందామె! ఎంతో పవిత్రంగా నిర్మలంగా కనిపించే తన మనవరాలు, గర్భవతి అని మాత్రం అనుమానించలేదు కదా. ఒకనాడు పైకే అన్నది ఆమె "ఏమిటమ్మాయి నీకు ఒంటో ఏమయినా కులాసాగా లేదా" అని జాలిగా పద్మకి వళ్లు జలదరించింది నోట మాట పెగలక పోయింది కాసేపటిదాకా ఏదునిమి షాలు పూరింటి కప్పుతంక చూస్తో నుల్చుని, "అవును తొయ్యా, ఎప్పుడూ కడుపులో నెప్పి మంటా" అంది, అదేదో రోగలక్షణం అన్నట్టు తన అనుమానం స్థిరపడ్డందుకు ముసలమ్మ విచారిస్తూ, "భాస్కరాన్ని రానీ, ఏ డాక్టరుకన్నా చూపించి మందిప్పించమని చెబుతాను" అంది.

పద్మ ఒక్కసారి దీర్ఘనిశ్వాసం విడిచింది—అప్పటికి గండం గడిచిందిగదా అని కాని నిజంగానే భాస్కరం డాక్టర్ దగ్గరకి రమ్మంటే! డాక్టరు నిమిషంలో కనుక్కుంటాడు. ఏమిటి తరుణోపాయం! ఆ రాత్రి భాస్కరం ఇంటికి రాగానే ముసలమ్మ అతనికి చెప్పింది. భాస్కరం విని జాలిగా "ఇన్నాళ్లూ చెప్పావేం కొంచెం పిన్నీ! నాకు తెలిసిన డాక్టరొకాయన వున్నాడు. రేపొద్దున్నే ఆయనదగ్గిరకి తీసుకెళ్తాను మందిస్తాడు" అన్నాడు. అతనికి పిన్నిపట్ల గౌరవభావమేగాని మరొక ఆలోచనే రాదు. దురాలోచన అనేది అలవాటులేని విషయం అతనికి.

భాస్కరావు ఆవేళ గూడా ట్యూషన్ చెప్పటానికి వెళ్ళి

మంచి - చెడూ

పోయాడు. తెల్లారితే ఏకాదశి. పొద్దున్నెప్పుడు చెప్పివెళ్లా డతను, "పిన్ని రేవు కృష్ణకి నువ్వు రావు. ఒంట్లో బాగోలేదంటున్నావు" అని.

"ఎక్కడ. వెళ్తానయ్యా! ఏకాదశిపూటా మానటం ఏమిటి, ఇన్నాళ్ళూ చేసి!" అందామె.

"నీయిష్టం రోగం వచ్చినప్పుడుగూడా, ఈ ఆచారా లేమిటి పిన్నీ మరీనూ?" అంటూ వెళ్ళిపోయా డతను.

పద్మ రాత్రల్లా ఆలోచించింది. నిద్ర పట్టనేలేదు. కడుపులో తిప్పుతున్నట్టుండి రెండుమూడుసార్లు బైటికిపోయి డోక్కొని వచ్చింది. ఆమె భయం మరింత ఎక్కువైంది. తెల్లారితే ఇక పరువు దక్కదు. తనిప్పుడు అపాయకరమైన అంచుల్లో వుంది. ఈ సంగతి బైటబడితే ఇంకో ప్రమాదంగూడా వుందని స్ఫురించిందామెకి. భాస్కర్రావుకీ తనకీ సంబంధం కల్పించటం లోకులకు సులభం. గాలపీనుగ తోడులేకండా వెళ్లదన్నట్టు, ఏ పాపం ఎరగని అతనికికూడా ఈ పాపంలో పాలు పంచడం అన్యాయం. ఈపూట తెల్లారకముందే తను ఎక్కడికైనా విరగడైపోతే ఎవరికీ ఏచిక్కూ వుండదు. కాని, ఏ పరిచయమూలేని లోకంలోకి, ఎక్కడికెళ్ళినా ఒకటిగా నేవుంటే ఈ ప్రపంచంలోకి తను వొంటరిగా వెళ్లటం ఎట్లా? ఆమెకి ప్రపంచం అంతా వెలాసగాళ్ళతో, శత్రువులతో నిండివున్నట్టు కన్పిస్తోంది. కాని ఏంచెయ్యటం? ఎంత భయపడినా వెళ్ళక తప్పదేమో! ఆమె మనస్సు ఈ ఆలోచనలతో మరీ చితికినట్టుఅయి గందరగోళపడింది. తెల్లారకట్ల మూడుగంటలయింది. అప్పటి కామె బలవంతాన ఒకదృఢనిశ్చయానికివచ్చేసింది: మెల్లిగా లేచింది. లోపలికి వెళ్లి, తను ఖర్చుపెట్టుకోడానికి వీల్లేక మిగిలిపోయిన డబ్బు పన్నెండురూపాయలు చెంగున మూటగట్టుకుని ముసలమ్మని లేపింది. "రా వదినా, కృష్ణస్నానం చేసివద్దాం"—అంది.

ముసలమ్మ—"ఇవ్వాళ ముక్కోటి ఏకాదశి కదూ" అంటూ లేచింది. "నువ్వెందుకమ్మా, నుస్తీగావుండి?" అంది. పద్మ వినిపించుకోలేదు; ఇంకోపరిస్థితిలో అయితే, పొమ్మన్నా పోక పొయ్యేది. ఇప్పుడు రెండోచీరకూడా తీసుకుంది. ఇద్దరూ తడిక కట్టేసి బయల్దేరారు. కృష్ణదగ్గిర జనం కిటకిటలాడుతున్నారు. అంత చలిలోనూ జనం నీళ్ళల్లో గభీగభీ మునుగుతున్నారు. దొరికినవాళ్లకు బ్రాహ్మణులు పుణ్యాం ఇప్పిస్తున్నారు, మంత్రాలు చదివి. ముసలమ్మా పద్మ, ఇద్దరూ రేవుదగ్గిర స్నానానికి దిగారు; అక్కడా జనం క్రిక్కిరిసి వున్నారు. ఒక బ్రాహ్మణుడు కేయూరైనాడు బలవంతంగానైనా సరే, వొద్దు మొర్రో అన్నా సరే వొదలకండా, వాళ్లకి పుణ్యాం ఇప్పించేతీరతానని. ముసలమ్మ కేస దర్శించుకున్నది.

ముసలమ్మ మూడుసార్లు కృష్ణనీళ్ళలో మునిగి లేచింది. వొడ్డునే జనంమధ్య మెట్లమీద కూర్చున్నపద్మ కనపడలేదు ఆమెకి. ఎటుపోయిందో నని కాసేపు అటూ ఇటూ చూసింది స్నానాలు చేసేవాళ్లు చేస్తున్నారు; వెళ్లేవాళ్లు వెళ్తున్నారు. కొందరుచిన్న చిన్న దీపాలు మంగళకరంగా వెలిగించి పూజలు చేస్తున్నారు. ఎక్కడచూసినా వందలాది జనం. నడిచేమార్గం ఇరువేపులా ముష్టివాళ్లు కాకిగోలగా అరుస్తున్నారు. ధర్మచింతన గలవాళ్లు కొన్ని, బియ్యం వేస్తున్నారు. ముసలమ్మ "పద్మా! పద్మా!" అని తెగ అరిచింది. తూర్పున తెల్లారుతోంది. జనం కిటకిటలాడుతున్నారు.

ముసలమ్మ శాయశక్తులా ఏడుగంటలదాకా వెతికింది. పద్మ జాడ కనపడనేలేదు. జనంలో మారుపడి ఇంటికిగాని, వెళ్ళిందేమో అనుకుంటూ మనస్సు సమాధానపర్చుకుందామె. ఇంటికి వెళ్ళిచూస్తే తడిక కట్టేసివుంది. పద్మ అక్కడా లేదు. ముసలమ్మ గుండెలు ఝల్లుమన్నాయి. భాస్కర్రావుకి చెబుదామని ఆమె గుడ్డలకొట్టుదగ్గిరికి పరిగెత్తింది.

భాస్కర్రావు కంగారైపోయాడు. ముసలమ్మని ఇంటికివెళ్లమనిచెప్పి తానొక్కడే బయల్దేరి కృష్ణరేవంతా గాలించాడు. జనం ఇప్పుడంతగాలేరు. రకరకాలవాళ్లు అంతరంగాలు ఎలా వున్నప్పటికీ. పరిశుద్ధంగా స్నానంచేసి వెళ్ళిపోతున్నారు, అతని ఆదుర్దాయేగాని పిన్ని కనపడనేలేదు. ఏమై వుంటుంది? ఎక్కడికి పోయివుంటుంది? ఆమెకి లోకం తెలియదే! ఎక్కడ దారితెలియక బాధపడుతోందో! ఒకవేళ స్నానంచేస్తూ నీళ్లలో పడిపోయిందా! ఇంతమంది జనం వున్నారుగా!...ఒకవేళ గుళ్ళో కెళ్ళిందేమో, పర్వదినమని? అతను కనకదుర్గగుడి, శివాలయంవీధిలో కొత్త శివాలయం, ఎదురుగావున్న వైష్ణవాలయం అన్నీ వెతికాడు. నిష్ప్రయోజనమైంది. పుసూరుమని కొట్లోకి వచ్చాడు తిరిగి.

సుందరంగారన్నాడు, "పెద్దామెకదా! దారి తప్పినా నోరు లేదూ? అడిగి కనుక్కొని, ఇల్లు చేరుకుంటుందిలే. దిగులుపడకు"

'అంతే' అనుకున్నాడు భాస్కర్రావు. [ఇంకా వుంది

మడి బట్ట

భాగవతుల రామారావు

పిండి విసురుతున్న చెల్లాయ్యమ్మ "నే నెవర్ని?" అని ప్రశ్నించుకుంది.

పదిహేనేళ్లుంటాయి - చెల్లాయ్యమ్మకి కాదు - చెల్లాయ్యమ్మ ప్రశ్నకి. పదిహేనేళ్లాయి ప్రయత్నిస్తున్నాది - తనకి కలిగిన సందేహానికి సమాధానం చెప్పుకుందామనీ. దశాసరి తిరగలి దిమ్మలు తిరుగుతూ తిరుగుతూ ఈ దీర్ఘకాలంలో సగానికి సగం అరిగిపోయేయి. కాని చెల్లాయ్యమ్మ బుర్రలో గిరగిరా తిరుగుతున్న ప్రశ్న, 'నే నెవర్ని?' అన్న ప్రశ్నకి తను 'ఫలానా' అని జవాబు చెప్పుకోలేకపోతున్నది.

"నే నెవర్ని?" - కళ్లు మెయ్యా దుఃఖం వచ్చింది చెల్లాయ్యమ్మకి.

కన్నెపొర చెరగకపోయినా కన్నెపిల్ల మాత్రం కాదు చెల్లాయ్యమ్మ.

మరి వివాహితా? - కాదంటే ధర్మశాస్త్రాలు కర్రుచ్చుకుంటాయి గనక 'ఔ' ననాలి. కాని మొగుడుతో ఒక్క 'నిద్ర'న్నా చెయ్యని తను ఫలానా మొగుడుకి పెళ్లాన్నని ఎలా సమాధానపరుచుకోగల్దు?

వితంతువా? 'ఔ' నడానికి వీల్లేకుండా మెళ్ళో రొమ్ములమీద తళతళా మెరుస్తూ తాళిబొట్టు వేళ్ళాడుతున్నాది.

మరి తానెవరు? - పదిహేనేళ్ల కిందట ఒకనాడు పిండి విసురుతుంటే చెల్లాయ్యమ్మకి తట్టిందీ ప్రశ్న. అప్పటికి కొద్ది నెలల క్రితంనుంచీ 'ఆలోచించుకోవడం' నేర్చుకున్న చెల్లాయ్యమ్మ ఆలోచనలు కొనకి నాలుగక్షరాల ప్రశ్నగా రూపొందేయి. అక్షరాలు నాలుగే అయినా చిన్న ప్రశ్న కాదు - చాలా చిక్కు ప్రశ్న.

ఈ ప్రశ్న పెద్దదై పదిహేనేళ్లదయింది; చెల్లాయ్యమ్మ యౌవ్వనంలోంచి కౌమారంలో అడుగుపెట్టింది.

ఏళ్లముందు కాలం పరిగెత్తిపోతున్నాది-కళ్ల నెయ్యా చెల్లాయ్యమ్మకి దుఃఖం పొర్లుకొస్తున్నది.

'ఫలానా' అని సంఘం తనకో ముద్ర వెయ్యకపోవడానికి తను చేసిన అపరాధం ఏమిటి? నలుగురూ పుట్టినట్టే తనూ ఓ అమ్మకి పుట్టింది. నలుగుర్లాగే తనూ పెరిగింది. అందరాడపిల్లల్లాగే తనూ పెళ్ళాడింది. ఐతే ఇక్కడే లోకరివాజు తనపట్ల ఎదురుతిరిగిందని తెలుసుకోలేకపోతున్నది చెల్లాయ్యమ్మ.

కొందరికి పాపభీతిలావు. అలాంటివాళ్లు 'ఫలానా పని చెయ్యడం మహాపాపం' అని నమ్మితే ఇహ అపని - అది తమ జీవితాల్ని చక్కబెట్టేదైనా సరే - ఛస్తే చెయ్యపూనుకోరు. కావలిస్తే తర్వాత జీవితాంతమూ 'పాపభీతితో చేజిక్కిన అవకాశాన్ని జారవిడుచుకున్నామే!' అని లోలోపల కుళ్లిపోతుంటారు. వీళ్ళ ధార్మికత్వం నిజానికి పచ్చి పిరికితనం.

చెల్లాయ్యమ్మ అచ్చంగా ఇలాంటి పిరికిగుండెల ధార్మికుల జాబితాలోకి చేరిందే. ఏళ్లతరబడి కళ్లు కాయలు కాచి [illegible]లాగ కాచుక్కూచుంటే కొసకి రాక రాక వచ్చిన అవకాశాన్ని చేజేతులా ఒదులుకుంది.

చెల్లాయ్యమ్మ కిప్పుడు వయస్సు దరిదాపు మూడుపదులు నిన్నో మొన్నో దాటబడుంటాయి. అయినా అరుగూ తరుగూ ఎరగని 'పరువం' చెల్లాయ్యమ్మ విగ్రహానికి మెరుగులు దిద్దింది.

చెల్లాయ్యమ్మకి పదోయేట - ఇరవయ్యేళ్లకిందట - సలక్షణంగా, సంప్రదాయానుసారం పెళ్ళయింది. అంతకుముందు జ్ఞానం వచ్చిం తర్వాత ఒకటి రెండు పెళ్ళిళ్లు కళ్ళారా చూసిందేమో, తనకి పెళ్లనగానే 'బలే! బలే!' అనుకుంది చెల్లాయ్యమ్మ. పక్కింటి చిట్టిపిల్లతో "ఒసేవ్! నాకు పెళ్ళట, ఊరూరు!" అని చెప్పి దాన్ని ఊరించింది కూడా. పెళ్ళంటే ఎంత సరదాగా ఉంటుంది! బేండుమేళం... కొత్త బట్టలు... పిండివంటలు.. పల్లకీలో అంచక్కా కూచుని హాయిగా బేండుమేళంతో ఊరేగుతుంటే ఎంత సరదాగా ఉంటుంది!?

పెళ్ళికొడుక్కి మహా ఉంటే పన్నెండేళ్లుండొచ్చు. చాలా సందడిగానే జరిగింది పెళ్ళి. ఒక్కగానొక్క కూతురు పెళ్ళి. కళ్ళారా చూసుకుందికి ఆయనకి ప్రాప్తం లేకపోయిందని అమ్మమాత్రం నాన్నని తల్చుకుని కాసేపు కన్నీరు పెట్టుకుంది.

ఊరేగింపునాటి రాత్రి బలే గమ్మత్తు జరిగింది. పదోగంట దాటేసరికి నిద్దర కాచుకోలేకపోయింది చెల్లాయ్యమ్మ. నిద్దర్లో జోగిపోయి పెళ్లికొడుకుమీద పడ్డాది. అప్పటికే ఎంతసేపట్నుంచో కూచునే కునికేస్తున్న పెళ్లికొడుకు కంటున్న కల చెదిరిపోగా చిరాకెత్తి, మీదపడ్డ పెళ్లికూతుర్ని మెడపట్టుకు ఒక్కతోపు తోసేడు వెనక్కి. అతోపుకి చెల్లాయ్యమ్మ తల పల్లకీ గోడకి తపీమని గుద్దుకుని బొణిపి కట్టింది. నిద్రమత్తు ఒదిలిపోయి, తగిలిన దెబ్బకి అగ్గిరుద్రురాలయింది చెల్లాయ్యమ్మ. నిద్దర్లో కొత్తమీద ఒరిగినంత మాత్రాన్న గోడకేసి బుర్ర కొడతాడా అన్న ఉక్రోషంతో తను పెళ్ళికొడుకు తొడమీద కసిదీరా 'సొంటిపిక్క'లాగింది. "అమ్మోయ్! నన్ను గిల్లేస్తున్నాదర్రోయ్!" అని బొబ్బలెత్తేడు పెళ్ళికొడుకు. పల్లకీ నిలబెట్టి పెద్దలు ఇద్దరి ఫిర్యాదులూ విని, సంగతి సందర్భాలు తెలుసుకున్నాక 'ఫకాల్న' కడుపులు చెక్కలయ్యేట్టు నవ్వుకున్నారు. చెరో లడ్డుండా ఇచ్చి, ఇదర్నీ బుజ్జగించి సవారీ కదిలించేరు. ఊరేగింపు సాగిపోతుంటే 'తెలిసిందా నా తడాఖా?' అన్నట్టు చూసిందోమారు పుర్రాడివేపు. గోళ్లనాటి మండుతున్నాదేమో ఆ అబ్బాయి పాపం తొడ తడుముకుంటున్నాడు. పాకాలి

★ మడిబట్ట ★

క్రింద రూపాయి కాసంత నల్లని పుట్టు మచ్చుంది.

పెళ్ళయిపోయింది.

పెళ్ళయేక ప్రతిబంధకాలు లావయేయి చెల్లాయ్యమ్మకి. అమ్మ ఎక్కడికీ మునపట్లా తిరగనిచ్చేది కాదు. ఎటూ తిరక్కుండా, చిట్టిపిల్లతో ఏటొడ్డున పిచికగూళ్లు కట్టుగోకుండా, కరణంగారి రాముంగాడితోనూ, ఎదురింటివాళ్ల రత్తితోనూ పెండిలో కోతికొమ్మచ్చు లాడుకోకుండా 'ఎందుకొచ్చిన పెళ్ళి!' అని విసుక్కునేది చెల్లాయ్యమ్మ. తోట్లంటా, దొడ్లంటా ఇష్టం వచ్చినట్టు తిరిగితే మొగుడికి కోపం వస్తుందట! తనలా తిరిగితే మొగుడుకేం? ఆ మగ్రాణ్ని తనేం తిరగొద్దందా? వాళ్ళూళ్లో ఆ అబ్బాయి తిరగడం మానేసేడేమిటి? అమ్మ కేమీ తెలీదూ!

ఇంటి కూచమ్మ విపోవలిసొచ్చినందుకు పెళ్ళానికి చాలా ఇబ్బందిగా ఉందని చెల్లాయ్యమ్మ మొగుడికి తెలిసుంటుంది. తన మూలంగా పెళ్ళానికి లేనిపోని ఇబ్బందులూ, ఇరకట్లూ ఎందుకని కాబోసు ఆ మగ్రాడు తను అడ్డు తప్పుకున్నాడు. ఇంట్లోంచి రెండొందల రూపాయిలు సంగ్రహించి చక్కా ఎక్కడికో ఉడాయించేసేడో మంచిరోజున.

అమ్మ లబోదిబోమని గుండెలు బాదుకుంది కబురు తెలియగానే. చెల్లాయ్యమ్మకీ కళ్లమొయ్యా దుఃఖం వచ్చింది.- మొగుడు పరారయ్యేడని కాదు - అమ్మ ఏడుస్తున్నాదని.

ఏళ్ళు గడిచిపోతున్నాయి. పారిపోయిన చెల్లాయ్యమ్మ మొగుడు తిరిగిరాలేదు. ఎక్కడున్నదీ ఆ చూకీ దొరకలేదు.

చెల్లాయ్యమ్మ పెద్దమనిషయిన్నాడు అమ్మ ఎంతో ఏడిచింది. ఈ శోకం తర్వాత తనకే 'ఆలోచించుకోవడం' తెలిసింది గనక, తన జీవితానికి ఎంత పెద్దదెబ్బ తగిలిందో అర్థం చేసుకుంది చెల్లాయ్యమ్మ.

తన నూరేళ్ళ కాపరానికి నీళ్లువోసేడు మగ్రమొగుడు. ఏ తప్పూ చెయ్యని తన కెందుకీ దండన? పెళ్ళిలో తెలిసో తెలీకో మొగుణ్ని గిల్లింది. అందుకనా తనకీ శిక్ష?

కళ్లముందు కాలం జరిగిపోతున్నాది. ఏళ్లు వెనక్కి పడుతున్న కొద్దీ క్రమేపీ మొగుడి మొహం మరుపుకొస్తున్నాది చెల్లాయ్యమ్మకి. ఎన్నేళ్లకిందటో చూసిన మొహం, ఎన్నాళ్ళని జ్ఞాపకం ఉంటుంది? మొగుడంటే చెల్లాయ్యమ్మకిప్పుడు జ్ఞాపకం వచ్చేది, అతని మోకాలిమీది పుట్టుమచ్చ.

ఈ శేతిన కొన్ని నెల్లతర్వాత ఒక రోజున పిండి విసురుతుంటే చెల్లాయ్యమ్మకి తట్టింది 'నే నెవర్ని?' అన్న ప్రశ్న. ఆ నాటినుంచీ అను నిత్యం ఈ ప్రశ్న వేధిస్తానేవుంది చెల్లాయ్యమ్మని. చచ్చేదాకా బ్రతకవలిసిన అమ్మాయి పదిహేనోఏట కళ్లు విప్పి భవిష్యత్తు చూసుకుంటే కళ్ళకి అమాంతంగా ఓ పెద్ద ఎడారి కనిపించినప్పుడు, ఆ అమ్మాయి పరిస్థితి ఎలా ఉంటుంది? కాలికింది భూమి కంపిస్తుందా? హృదయంలో బడబాగ్ని భగభగమంటుందా? బుర్రలో విటంబాంబులు పేలుతాయా? ఏమో! ఏమైనా కావొచ్చు. మనిషి మప్పలా కూలిపోవచ్చు. 'నే నెవర్ని?' అని ప్రశ్నించుకోవచ్చు. చెల్లాయ్యమ్మ అచ్చంగా అదేపని చేసింది. ఆమె వేసుకున్న ప్రశ్నకి జవాబు దొరకదు - ఆమె భవిష్యత్తు ఎడారి అయింది గనక.

పదహారు, పదిహేడు, ఇరవై, ఇరవై నాలుగు...తీయని కోరికలు ఊటలూరే వయస్సు దాటిపోతున్నాది వృధాగా.

ఆ వేళ రోజూలాగే తెల్లారింది - బరువుగా, బాధగా. నిద్దర బద్దకం తీరక పక్కమీద ఇటూ అటూ దొర్లుతున్నాది చెల్లాయ్యమ్మ. అమ్మ వీధిగడపలో ముగ్గు పెడుతున్నాది. అదే సమయంలో వీధివాకిట్లో రెండెడ్లబండీ ఆగింది. బండీలోంచి హాఠాత్తుగా దిగబడ్డ వియ్యపురాల్ని, వియ్యంకుణ్ని, మరో ముప్ఫయ్యేళ్ల యువకుణ్ని చూసి అమ్మ తెల్లబోయింది. వియ్యపురాలు దిగుతూనే "కోడలేదీ? అబ్బాయొచ్చేడు!" అంది - "పోగొట్టుకున్న పెన్నిధిని పట్టుకొచ్చేంమండీ!" అన్నట్టు సంతోషాన్ని తొణికిస్తూ.

"ఆఁ!, అల్లుడొచ్చేడా?" అమ్మకి ఆనందంలో గుండెలాగిపోయింటాయ్. ఎంతకమ్మని వార్త!

"మీ అత్తగార్రా అబ్బాయ్. కాళ్లకి మొక్కు. అలా చూస్తావేం?" అందత్తగారు, ఆ పాతికేళ్ల యువకుణ్ని ముందుకు తోస్తూ. అతగాడు అమ్మపాదాల్ని కళ్లకద్దుకుని 'దీర్ఘాయురస్తు' అని అమ్మ దీవెనలందుకున్నాడు. ఈ తతంగం అంతా అప్పుడే చెల్లాయ్యమ్మ కిటికీ రెక్కలు ఓరగా వేసుంచి చూస్తున్నాది.

తన మొగుడొచ్చేడు!

ఒక్కమాటు భయం, సంతోషం, కలవరా, సిగ్గూ పుట్టుకొచ్చేయి. తట్టుకోలేని భావోద్రేకంలో కొట్టుకుపోయింది.

ఒళ్లల్లా కళ్ళు చేసుకుని ఇన్నేళ్లతర్వాత ఊడిపడ్డ—తప్పు! తప్పు! కటాక్షించిన - మొగుణ్ణి తలుపువారగా, ఓరగా చూచింది. అంచక్కా, అచ్చంగా దొర్లమనిషిలా ఉన్నాడు. (అలా కనిపించేడు చెల్లాయ్యమ్మ కళ్లకి!) తెల్లని మొహం—నల్లద్దాల కళ్లజోడూ. ఎటు చూస్తున్నదీ తెలీకుండా ఎటో చూస్తున్నాడు. ఎందుకోసం? ఎవరి కోసం? తన తెలివి మండిపట్టుంది. తన కోసం కాపోతే ఇంకెవరికోసం? అబ్బ!

ఎంత మంచివారూ! చెల్లాయ్యమ్మకి తెలీకుండానే బహువచన ప్రయోగం వచ్చేసింది! ఇంచక్కటి మొగుణ్ణి గిల్లింది. ఛీ! ఎలా చేతులొచ్చాయో! అందుకనే బుద్ధొచ్చేలాగ మాబాగా విడిపించేరు. పెళ్ళిలో నలుగుర్లోనూ పెళ్ళాం గిల్లితే ఊరుకుంటారా?... కాని పెళ్ళినాటి ఆ పెళ్ళికొడుకు కుర్రాడు — దుమ్మర్రగుండులా మొహం వాడూనూ!—మంచివాడు కాడు. ఈయనే ఐతే గిల్లుతుందేవిటి? ఈయనెంత రీవిగా, ఎంత నాజూగ్గా ఉన్నారు!

గుండెలకి చేతులు అదుముకుంది.

అమ్మ అల్లుణ్ని సాదరంగా చూసి "ఎంతలా మారిపోయావోయ్? పోల్తే పట్టలేక పోయాను!" అంది సంబరపడుతూ. ఇరుగమ్మ, పొరుగమ్మల్ని పిల్చి అల్లుణ్ని చూపించిందమ్మ.

కాలం కలిసొస్తే మోడు చిగురిస్తుంది!

కళ్ళముందు కూతురూ అల్లుడూ కాపరం చెయ్యడం చూసి ఆనందిద్దామన్న అమ్మ ముచ్చట నెరవేరే తరుణం ఇప్పటికొచ్చింది. శుభముహూర్తం చూసి ఇద్దర్నీ గదిలోకి పంపించేరు— పెళ్ళయిన పద్దెనిమిదేళ్ళకి మొగుడూ పెళ్ళాం మొదటిసారి ఎదురెదురుగా, ఏకాంతంగా!

సొంటిపిక్కలాగిన మొగుడిదగ్గిర తనకంత సిగ్గెందుకనో? ఆయనే చెయ్యిపట్టుకు మంచంమీద కూచోబెట్టుకున్నారు. తనకి ఒళ్ళంతా అదోలా ఐపోయింది. మిఠాయుండతీసి తన నోట్లో కుక్కారు.

'ఇలలోన లేదంచు తలపోయనేల?' అనుకుని స్వర్గానికి నిచ్చెన వేస్తున్న మొగుడు—పాన్పుమీంచి వెల్లకిలా కింద పడ్డాడు—తను అన్నిన తోపుకి.

ఒక్క అదటున తలుపు తీయించుకు బయటికొచ్చి, "అతన్నా మొగుడు కాడు!" అంటూ అమ్మని కౌగలించుకుని బావురుమంది చెల్లాయ్యమ్మ.

అమ్మ కొరడుబారిపోయింది. అత్తమామలు కలో కల్లో తెలీని మగతలోపడి ఒళ్ళు గిల్లుకున్నారు.

అమ్మలక్కలు నలుగురూ తలోవిధంగా గుసగుసలు మొదలెట్టేరు:

"కుర్రాణ్ని చూడగానే నా కనుమానం వేసిందిన్మండీ అయినా నాకెందుకు— అని ఊరుకున్నాను."

"ఎవడో వచ్చి నాటకం ఆడుతున్నాడని నేను మొదటే పసిగట్టేను. కాని వాళ్ళూ వాళ్ళూ ఇష్టపడ్డప్పుడు మధ్య కాండూరి లక్ష్మింపతిలా నేను కాదనడం దేనికని నోరు మూసు గూరుకున్నాను. చెప్పకేం!"

"ఏ పద్దెనిమిదేళ్ళ కిందటో పారిపోయిన గుంటకక్కగట్టు ఇవాళొచ్చేదేవిటి? అంచేత అబద్ధంవాఁ శుబద్ధంవాఁ పిల్లకాపరం నిలబెడదామని ఉభయులూ లాలోచీ పడుంటారు. సమయానికి గుంటపాప కథ అడ్డం తిప్పింది."

"గడుసుది సమయానికి కొనుకుంది కాని ...అవ్వ!"—

మామగారు ఆయన్ని బయటికి తీసు

★ మడిబట్ట ★

కొచ్చి "ఏమిట్రా అబ్బాయ్? నువ్వు దాని మొగుడువి కాదంటోందేమిటి?" అనడిగేరు. ఎదురుప్రశ్న - 'నేను నీ నాన్నని కాదూ?' అనడగలేదు నయం.

"మీరుకూడా అనేయండి - నేను మీ అబ్బాయిని కానని. ఒచ్చిందారి నే చక్కా పోతాను" కస్సుమన్నాడతగాడు.

మామగారు వెనక్కి తగ్గేరు.

చెల్లాయ్యమ్మ వేపు తిరిగి "వీడు నీ మొగుడు కాడని నువ్వెలా చెప్పగలవ్?" అని ప్రశ్నించేరు. అతని ప్రశ్నలో 'ఇతగాడు మా కొడుకని మేం నమ్మినప్పుడు, నీ మొగుడని నువ్వు నమ్మలేవూ?' అన్న ధోరణి ధ్వనించింది.

చెల్లాయ్యమ్మకి ఒళ్లుమండింది - "నేను నా మొగుడెవరో పోల్చుకోలేను కాబట్టి, ఎవర్నో తీసుకొచ్చి నా మొగుడంటారన్న మాట?" ఎదురు ప్రశ్న వేసింది.

"బాగుందమ్మాయ్. మహ బాగుంది! మా అబ్బాయిని మాకు తెలీదూ?"

"నా మొగుణ్ని నాకేనా తెలీదు?"

"నీకేం తెలుసూ? నాటికి నేడు చూసేవు!" తెలివిగా ప్రశ్నించేడాయన.

"నాడు చూసిన ఆనమాళ్లు నేడు లేవు కాబట్టేనూ!"

"ఆనమాళ్లా! అనమాళ్లేమిటీ? లేకపోవడం ఏమిటీ?" ప్రశ్నిస్తున్నది చెల్లాయ్యమ్మనే అయినా ప్రశ్నార్థకంగా కొడుకు వేపు చూసేడాయన.

"పెళ్ళినాడు చూశాను. కాలిమీద పుట్టుమచ్చుండాలి..."

చుట్టూ మూగిన చిన్నా పెద్దా మొహా మొహాలు చూసుకున్నారు.

తర్వాత చాలాసేపు తర్జన భర్జన జరిగింది. చివరికి రాత్రికి రాత్రే బండెక్కి తిరుగుమొహం పట్టేరు అత్తమామలు 'కొడుకు'ని వెంటబెట్టుకుని.

మామగారు మాత్రం రాయబారాలు సలుపుతూనే ఉన్నారు. కోడల్ని కాపరానికి పంపించమని. ఒకటి రెండుమార్లు 'ఆయన' చేతకూడా రాయించేరు ఉత్తరాలు. కాని చెల్లాయ్యమ్మ ససేమిరా 'ఆయన' తన మొగుడు కాడనేసింది.

ఊళ్లో మాత్రం చెల్లాయ్యమ్మ నిప్పుతునక లాంటి మనిషని యోగ్యతాపత్రం సంపాదించుకుంది.

చూస్తుండగానే కాలం గడిచిపోతున్నాది. ఒచ్చిన మొగుణ్ని చెల్లాయమ్మ తగిలేసింది. రాని మొగుడుకోసం వస్తాడని ఎదురుచూస్తున్నాది. ఈడు ముదురుతున్న చెల్లాయ్యమ్మ ఇల్లాలూ కాదు, కన్యా కాదు. రెంటికీ చెడింది. 'ఎక్కడవేసిన గొంగళీ అక్కడే' అన్నట్టు మళ్ళీ కథ మొదటికొచ్చింది— 'నేనెవర్ని?' అని పిండి విసురుతూ ప్రశ్నించుకున్న చెల్లాయ్యమ్మ తను 'ఫలానా' అని సమాధానం చెప్పుకోలేకపోతున్నాది.

'నిప్పుతునక' అని తన నిగ్రహశక్తిని మెచ్చుకున్న వాళ్లే రానురాను రంగు ఫిరాయించేరు. 'మొగుణ్ని ఒదిలించుకుందికి ఈ ఎత్తు వేసింది. చాటుమాటున ఎవణ్నో పెట్టుకు కులుకుతున్నాది!' అని గుసగుసలాడుకోవడం మొదలెట్టేరు ఊళ్లోవాళ్లంతా. ఈ అపనింద చెవినిపడ్డాక చెల్లాయ్యమ్మ మనసు ఉసూరుమంది. 'నిజాయితీకున్న విలువ ఇంతేనా?' అని విస్తుపోయింది.

తన పెళ్ళాం కాపరానికి రావంటున్నాదని 'ఆయన' కోర్టులో కేసెందుకు పెట్టకూడదూ? న్యాయస్థానమే 'ఆయన' తన మొగుడు కాడని తీర్పు చెబితే తనకీ అపనింద ఉండదు. ఒకవేళ కోర్టువారే 'ఆయన' తన మొగుడే అని తీర్పు చెప్పేరా, మరీ మంచిదీ. న్యాయసమ్మతంగా తన కాపరం నిలబడుతుంది. ఇంతకీ వాళ్లు కోర్టుకి ఎక్కరెందు చేత?


ముప్ఫయ్యోపడిలో పడిన చెల్లాయ్యమ్మ ఎదురుచూస్తున్న మొగుడు రాలేదు. ఏలుకుంటానన్న మొగుణ్ని కాదంటున్నాది. ఇంకొన్నేళ్లుపోతే మొగుడొచ్చినా ఒకటే, రాకపోయినా ఒకటే. 'ఈడు' లేనప్పుడు 'వాడు' ఉండి ఏంలాభం? మొగుడు పరాయి ఇరవైయ్యేళ్ళు కావొస్తున్నాది. ఒచ్చిన 'ఆయన' తన మొగుడు కానప్పుడు ఇంతవరకూ రాని మొగుడు ఇహ ఒస్తాడని మాత్రం నమ్మకం ఏమిటి?

ప్రపంచం పోకడ చాలామట్టుకు అర్థం చేసుకున్న చెల్లాయ్యమ్మ ఒకొక్క అప్పుడు జీవితంలో గొప్ప తెలివితక్కువపని చేసినట్టు బాధపడుతుంది. చిక్కిన 'అవకాశాన్ని' జారవిడుచుకోవడంలో తను నిజంగా తెలివితక్కువగానే ప్రవర్తించుంటుంది. అత్యాచారాన్ని ప్రతిఘటించినందువల్ల బావుకున్నది ఏమీ లేకపోయింది సరికదా పైపెచ్చు తనకే ఆ అత్యాచారాన్ని అంటగడుతున్నాది లోకం!

తన కర్తవ్యం ఏమిటి? బాల్యంలో పెళ్లయి కుర్రమొగుడు ఎటో పారిపోతే, పారిపోయిన మొగుడుకోసం జన్మాంతమూ ఇలా పడి ఏడవ్వలసిందేనా? ఎంతకాలమని ఇలాగ మడికట్టుకూర్చోవడం? కాచుక్కూర్చున్నా లోకం దృష్టిలో తను కట్టుకున్నది మడిబట్ట కాదు. అందరూ 'ఆయనే' తన మొగుడనీ, తనే 'ఆయన్ని' ఒదిలేసిందనీ ఆడిపోసుకుంటున్నారు!

తనమట్టుకు తనకి—'ఆయన' తన మొగుడు కచ్చితంగా కాడని నిర్ధారణ ఏమిటి? ఒక్క పుట్టుమచ్చ! ఇరవైయ్యేళ్లకిందట తను పరాగ్గా చూసింది పుట్టుమచ్చో, కాదో? ఒకవేళ కారణాంతరాలవల్ల ఈ దీర్ఘకాలంలో ఆ మచ్చ చెరిగిపోయుండకూడదూ? కొంపతీసి, తను అగ్నిసాక్షిగా పెళ్ళాడిన మొగుణ్ణే కాదంటున్నాదేమో!?...

పిండి విసురుతూ "నేనెవర్ని?" అని ప్రశ్నించుకున్న చెల్లాయమ్మ "నేను 'ఆయన'కి పెళ్ళాన్ని" అని ఇవాళ సమాధానం చెప్పుకుంది. ★



సాహిత్యవీధిలో ఓ సాయంకాలం

సాహిత్యం సామాన్యంకాదు; సాంబశివంమాత్రం సామాన్యుడే - ఆమాటకొస్తే అతిసామాన్యుడూ బహుసామాన్యుడూను!

అసలతడు కల్లోనైనా అనుకోని దుస్సంఘటన అది...అదే, సామాన్యుడు సాంబశివం సాహిత్యవీధిలో పడ్డం.

అనగా అనగా - అనుకోకుండా సాహితీ రథసారథులు సగంమందికి పైగా సమావేశమైనసభలోకి సాంబశివం ప్రవేశించి సావధానచిత్తుడై ఓ సాయంకాలం వృథా చేసుకున్నాడు. ఆ సంఘటనద్వారా తాను సాహిత్యవీధిలోకి వెళ్ళినట్టు అనుకున్న సాంబశివం, ఆవీధిలోనుండి వీలయినంత వేగిరంగా వెనక్కిమళ్లి "మళ్లీ అటువేపు పోకుండా కాపాడు దేవుడా!" అని ప్రార్థించుకున్నాడు; ఆంజనేయదండకాన్ని ఆరుసార్లు వల్లించుకున్నాడుకూడా.

సాంబశివం మిత్రుడు 'సుర' (సుందరం కలంపేరు) ఒకరోజు సాంబశివం యింటికి వచ్చాడు. అప్పుడే గడియారం ఆరుకొడుతూ వుంది. గుమాస్తా సాంబశివం, మానవుడు సాంబశివంగా మారుతుండే వేళ. అతడిలో అంతవరకూ వున్న యాంత్రికశక్తి పోయి మానవశక్తి ప్రవేశించే సుముహూర్తం.

"ఏమోయ్ సాంబం! ఇవాళ ఎక్కడికి వెళ్తున్నావ్?"

"ఎక్కడికీ వెళ్లనోయ్! ఇంట్లోనే వుంటా."

"అయితే నాతో బాటురా. ఆ ప్రక్కవీధిలో 'రమామహల్లో' మహాకవి - గారి జయంతి జరుగుతోంది. ప్రఖ్యాత రచయితలూ రచయిత్రులూ వస్తారు. కమ్మని కావ్యరసం పోస్తారు చెవుల్లో. పోదాం పద!"

ఈ - యితలూ - యిత్రులూ - వీళ్ళ పేర్లని సాంబశివం పత్రికల్లో చూచేవాడే కాని ఎప్పుడూ కళ్ళారా చూడలేదు వారిని. ఈ పెద్దవాళ్ళ అర్థరహితం ఆడంబరం అని తిడుతుండే గేయాల పుస్తకం ఒకటి సాంబశివం చదవడం తటస్థించింది. వాటిలో నాయకుడు తనే ననుకుని ఒకటో రెండో గీతాల్ని ఎలాగో బట్టీ పట్టేశాడు. ఆఫీసరు ఫైళ్లను ఇంటికి తీసుకువెళ్లమన్నప్పుడూ, ఆదివారం పూట ఆఫీసుకు రమ్మన్నప్పుడూ—సాంబశివం ఆ గేయాలని పదుయానికో రాగంతో రోజుకో రీతిగా పాడుకునేవాడు. ఇవి తప్పించి పత్రికలు చదవడం తప్ప సాహిత్యంతో ఎలాటి సంబంధమూ లేనివాడు సాంబశివం. ఇలాటివాడు ఆరోజు సాయంత్రం దురదృష్టవశాత్తు హోంవర్క్ ఫైళ్ళేమీ లేనందున 'సుర'తో 'రమా మహల్' చేరాడు.

"రమా మహల్" 'సినీ రమా'లా కనుపించింది సాంబానికి. గుమ్మంలో చెప్పులూ, గుమ్మానికి ఎదురుగా హాల్లో మూడు కుర్చీలూ, కుర్చీలకూ చెప్పులకూ మధ్య చాపలూ - చాపలమీద చిందరవందరగా ఓ పది క్రాపు తలలూ, కుడివేపు ఓ ప్రక్కగా ఓ అరడజను కనకాంబరం, మల్లె, మొదలయిన పూలఅంగళ్లూ...ఇదీ 'లాంగ్ షాట్'లో ఓపెనింగ్ సీన్. సాంబం సుందరం వెళ్ళి ఎడమప్రక్కగా

వాకాటి పాండురంగరావు

ఆసీనులయారు. ఉన్న వారందరూ ఇద్దరూ ముగ్గురూగా గుమికూడి సాహిత్యాన్ని గురించి కాబోలు సిగరెట్టుపొగ వుంగరాల క్రింద మాటాడుకుంటున్నారు. ఇదేదో ఇవాళ పూర్తిగా స్టడీ చేసెయ్యాలని అశోకుడినాటి రాతిశాసనం చేతికందినట్లు నాలుగు కళ్ళూ ఎనిమిది చెవులూగా వున్నాడు సాంబశివం.

"సంగీతానికి సరిగమ పదనిస లెటువంటివో సాహిత్యానికి భాష అటువంటిది" - అన్నది సాంబశివంయొక్క గుమాస్తా బుర్రలో గూడుకట్టుకున్న బుల్లి నిర్వచనం. దాని నిజానిజాలు ఇవాళ తేలిపోతాయి కదా అన్న ఆతురతతో వున్నాడు సాంబం.

"ఓహో 'సుర'గారా! ధన్యోస్మి!... మీరు మొన్న 'దేవి'లో వ్రాశారే 'వైతాళికుడు'..అది మరీ అంత 'మెటాఫిసికల్'గా వుందేమండీ?" అని సుందరాన్ని ఆ ప్రక్కన వున్న పొడుగు మొహం ఆయన అడగడం సాంబశివం విన్నాడు.

"అబ్బే! ఏదో రాశాను...హిహిహి- అంతే! నాకూడా తెలీదు ఎప్పుడు ఎందుకు ఆవిధంగా రాస్తానో.. హీహీ..." అన్నాడు సుందరం. "విడిచాడు" అని సాంబం మస్తిష్కంలో మౌనవ్యాఖ్యానం.

జనం పోగవుతున్నారు. అయినా— ఆడా మొగా కలిపి యాభైమందికన్నా ఎక్కువలేరు. సాహిత్యానికి సమ్మర్దం సరిపడదేమో అనుకున్నాడు సాంబం. ఆ జనంలో నెరిసిపోయిన వెంట్రుకలూ- రంగు పూసిన మీసాలూ గల ఒక యాభైఏళ్ళాయనను చూపించి సుందరం "ఆయనే రామనాథంగారు. 'సరళి' పత్రికా సంపాదకుడు; ఇవాళ సభకి అధ్యక్షుడు" అన్నాడు సాంబంతో. రామనాథం గారిని లోకమంతా ఎరుగును; సాంబశివమూ లోకంలో ఒకడేగా.

ఇంతలోనే 'కళుక్' మన్న నవ్వుశబ్దం- దేవాలయ గర్భగృహద్వారం మీది చిరుఘంటలా—వినిపించింది.

సాంబశివం కండ్లు కుడివైపుకు తిరిగాయి. కాస్త పెద్దగావున్న తెల్లటిపళ్ళవరుసా—నవ్వకుండావుంటేబాగుండునని పించే నోరూ—ఎడమబుగ్గమీద చిన్నమచ్చా—వెడల్పయిన నుదురూ—సముద్రపు నురుగులాటి చీరా...వీటితాలూకు యువతి కనపడింది. అందంగా లేకపోయినా ఆకర్షణ వున్న మూర్తి ఆవిడది.


"ఆవిడ ఎవరూ?"— సుందరాన్ని సాంబం అడిగాడు.

అదివరకే అటు తిరిగివున్న సుందరం, "ఆవిడా?...ఆవిడ పేరే 'సుకుమారి;' 'నాయిక' పత్రికాసంపాదకుడి కుడిభుజం" అని సంగ్రహంగా పరిచయం చేశాడు

"మరి—ఆ సంపాదకుడి ఎడమభుజం మగవా ఆడదా?" అన్న ప్రశ్న బయలుదేరినప్పటికీ, అణిచి పెట్టేశాడు సాంబశివం.

ఇంతవరకూ క్రమంగా హెచ్చుతూండిన శబ్దం కాస్త తగ్గుముఖం పట్టింది. ఎదురుగానున్న మూడు కుర్చీలలో మధ్యది శ్రీ రామనాథంగారిచే అలంకరింపబడింది. ఎవరో ఒక తెల్లఖద్దరులాల్చీ ఆయన... స్త్రీలవేపుతిరిగి, పదిమంది ప్రమదలచే పరివేష్టిత అయిన 'సుకుమారి' వైపుచూచి "సుకుమారిగారూ! రండి!" అంటూ రామనాథంగారి కుడివైపుకుర్చీ చూపించారు.

"అబ్బే...హుహుహు—" అని తెచ్చిపెట్టుకున్న సిగ్గుతో, 'మరాళనృత్యం' చేసిన సోవియట్ 'ప్రైమా బాలెరినా'లా దేహాన్ని—సగమంతే సగానికి కుదించేసు



గాజుల బత్తుడు

—ఫోటో : లక్ష్మణ్, వరంగల్లు.

★ సాహిత్య వీధిలో ఓసాయంకాలం ★

కుని కుర్చీలో కూలబడింది సుకుమారి కూర్చున్న స్థలంనుండి కుర్చీకి వున్న దూరం నడవడంలో సుకుమారి దేహం వంగిన వంకరలు. "మనం వాట్లసభకి వచ్చామా?" అన్న సంకేతాన్ని కల్గించేయి సాంబశివానికి.

అప్పుడే ఓ కట్టప్రకాలూ కాగితాలూ చేత్తో పట్టుకుని ప్రవేశించాడు ఒకాయన. సైగలా పొడుగ్గోటూ బిగుతైన పైజమా వేసుకున్నాడు. ఆయన్ని ఖాళీగా వున్న ఎడమవైపు కుర్చీలో కూర్చోబెట్టి— ఇందాక సుకుమారిని ఆహ్వానించిన ఖద్దరు లాల్చీ మనిషి "మహాజనులారా!" అన్నాడు. "ఓహో ఈయనే సభానిర్వాహకుడు కాబోలు" అని ఆ మహాజనులలో ఒక అణువుగావున్న సాంబశివం అనుకున్నాడు.

"మహాజనులారా! ఇవాళ ఎంతో సుదినం. మహాకవి-గారి జయంతి జరుపుతున్నాం. ఆయన రచనలను రసించిన సహృదయులు అందరూ ఆయన జ్ఞాపకార్థం ఓ సమితిగా ఏర్పడి ఆయన ఆదర్శాలను ప్రచారం చేయడానికి పూనుకోవాలి. అందుకే ఈ సభ ఏర్పాటు చేశాం. ఎన్నో పనులున్నప్పటికీ ఈ సభకి విచ్చేసిన—జగమెరిగిన బ్రాహ్మణులు శ్రీరామనాథంగారిని అధ్యక్షులుగా ఉండమని ప్రార్థిస్తున్నా.....మంచిభాషా ప్రవేశమూ, సంస్కారహృదయమూ గల శ్రీమతి సుకుమారిగారు, 'మహాకవి గారు చిత్రించిన స్త్రీపాత్రలను' గురించి ఉపన్యసిస్తారు. అటుతర్వాత సాహిత్యంలో సాటిలేని కృషి సలిపిన శ్రీ బృందావన్ గారు (సై్నహాకోటాయన) కవిగారి-ధ్యేయాల్ని గురించి ప్రసంగిస్తారు" అని కార్యనిర్వాహకుడుగారు ఊరుకున్నారు.

రామనాథంగారు లేచి నిలబడ్డారు. ఆగ్నేయదిశకు ఓసారి చూశారు; సాంబశివం కూడా అటు చూశాడు. ఏమీ కనుపించలేదు ఒక్క సాలెగూడు తప్ప! సాహిత్య సమావేశానికీ సాలెగూడుకీ అర్థం లేదా లేదని మొండికేసింది సాంబం మెదడు. అప్పుడే నిద్రనుంచి లేచివచ్చిన ధోరణిలో సాగింది అధ్యక్షోపన్యాసం.

". . బహుశా 1911లో కాబోలు— నేను, మహాకవిగారిని కాదుకానీ—ఆయన పుత్రుడుగారిని కలుసుకోవటంతటస్థించింది. ఆరోజు బెంగుళూరులో దిగాము. మహాకవి గేహం బెంగుళూరికి షుమారు పాతికమైళ్ళ దూరంలో వుంది. అక్కడికు బస్సుమీద వెళ్లాం, అసలే అది బెంగుళూరు, అందులోనూ డిసెంబరుమాసం కావటం మూలాన్ని అనుకుంటాను, మరితెత చలివేసింది. మేమందరమూ మాంచి ఉలెన్ స్వెటర్లు వేసుకుని బస్సులో బయలుదేరాం . . ."

మహాకవి జయంతి సందర్భంలో అధ్యక్షోపన్యాసంలో స్వీయచరిత్ర ఉండాలి కాబోలు అనుకున్నాడు సామాన్యుడు

అధ్యక్షులు ఇంటో వారితో కబుర్లు చెప్పు కుంటున్నాం అనుకున్నారు కాబోలు!

"......అలావెళ్లి మేం ఆపుణ్యస్థలం చేరాం...చుట్టూవున్న దృశ్యం మనోహరంగా వుంది...పచ్చనిగడ్డీ చక్కటిచెట్లూ వాటిలో ఎక్కువభాగం ఆపిలుచెట్లని నా జ్ఞాపకం...అవి చూడడానికి చాలబాగున్నాయి. వాటిమధ్య ముద్దులొలికే చిన్న గృహంలో...మహాకవిగారి ప్రపంచఖ్యాతి నందిన 'నమోవాకు' మొదలయిన పుస్తకాలు చూచాం...ఆరోజు సాయంత్రం...మహాకవి పుత్రులుగారు కమ్మని తుష్వాహాశీతో భోజనం పెట్టించారు..." సాంబశివం గట్టిగా ఏదో అరుదామని అనుకున్నాడు కానీ, సాహిత్యప్రభావం-ఒక్క ఊపిరితప్ప మరేమీ అడ్డం లేదు.

"...ఆయన మహాకవి; నిజంగానే మహాకవి; అందులో సందేహమేమిలేదు. ఆయన ఒక్క కథలే గాదు, నవలలు రాశాడు; నవలలే కాదు, నాటకాలని సృష్టించాడు, గేయాల్ని కురిపించాడు. ఆయన జాతీయ ముని; అంతర్జాతీయ సాహితీ ఋషి. ఆయన రచనలకు భాషాబంధాలు లేవు. మన మందరమూ ..." అధ్యక్షోపన్యాసం అనర్గళంగా సాగిపోతూ వుంది. సాంబశివం తానున్న చోటూ, వింటున్న మాటా మరచిపోవడానికి నాందిగా పది హేడుపాతికలు ఎంతా అని లెక్క కడుతున్నాడు మనసులో. .

"...వాతర్వాత ఇద్దరు మాట్లాడవలసి వున్నది. నేనే రమారమి గంట తీసుకున్నాను; మీకూ బస్సులకు వేళవుతూ వుంది. ఇంకా కొన్ని విషయా లున్నాయి. వాటిని నేను చెప్పడం మొదలెడితే..."

"- మేం రేపొద్దున బస్సెక్కాల్సిందే" అని సాంబశివం గొణిగిన వాక్యం అధ్యక్షోపన్యాసానంతర ప్రోతల ఘనతర కరతాళధ్వనులలో లీనమయిపోయింది.

అధ్యక్షులు కూర్చున్నారు; శ్రీ మతి సుకుమారి నిలబడింది.

ఆమెపాదంనుంచీ నడుమువరకూ లంబ రేఖ అనీ, నడుముపైభాగపు కోణం 67°లో లేక 68° లో వుంటుందనీ సాంబశివం తన మనస్సులో నేత్రాటాక్షరుకు శాస్త్రముప్పు వదిలించాడు.

"...హూ...హు...మహాకవిగారి స్త్రీ పాత్రలున్నాయి చూశారూ...అవి ఖటావ్ వాయిల్స్ లాగ...ఫిన్లేముల్లులాగ ... సున్నితంగా లాలిత్యంగా వుంటాయి. అలాటి పాత్రలను ఆయన ఒక్కడే సృష్టించ గలిగాడు. ఆ పాత్రలను ఒక్కసారి చదివితే మళ్ళీ మర్చిపోలేము. అగాధమయిన స్త్రీ హృదయాన్ని అర్థం చేసుకోడానికి



"నీలు తేబోతుంటె,
నీతోడ ఓలమ్మీ—
నా వెనక ఎవరో
నడిసి నట్టుంటాది!"
—ఫోటో. ఎ. అర్ బోనెపల్లి (రేపల్లె)

యత్నించి ఆయన చాలవరకు కృతకృత్యుడయాడు. ఉదాహరణకి ఆయన రచించిన "సంఘర్షణ" లోని ఊర్మిళ భారతనారీత్వాన్ని ఎత్తిచూపే పాత్ర - 'మనోరమ' లోని మనోరమ మన ఎదని కదిలించివేసుంది ... 'భగ్నవీణ' లోని శశికళా సురేఖలు మన హృదయాన్ని ఆపేస్తారు. "సుడిగుండం" లోని సుమతి స్త్రీలోని మాతృత్వాన్ని వెలుగులోకి తీసుకొస్తుంది... "అభాగ్యుడు" కథలోని గీత స్త్రీస్వభావం లోని వైవిధ్యాన్ని చూపకుండానే చూపుతుంది...'సమరసరిహారం'లోని..." సుకు

సాహిత్యవీధిలో ఓ సాయంకాలం

మారిగారి ఈ పట్టీ వింటున్న సాంబానికి ఒకటో తారీఖురాత్రి జ్ఞాపక మొచ్చింది. ఆరోజు అతనికి జీతం వచ్చేవుంటుందని తెలిసిన అతనిభార్య రాధ రాత్రి పడక గదిలో "ఒక్క శేరు కందిపప్పు...అర్ధవీశె చింతపండు...రెండున్నరపలాలు జీడిపప్పు ...అణా ఏలకులు..." అంటూ ఆ నెల రోజులకీ కావలసిన వస్తుసామగ్రిలిస్టు ఇస్తూ వుంటుంది.

సుకుమారి స్వరం సన్నగిల్లుతూ వుండడం ముగింపుకు సమీపమని తోచిన సాంబానికి బతుకుదామనే ఆశా, ఉత్సాహమూ కొంత వచ్చినవి.

"...కాబట్టి ఆలాటి పాత్రలు మనదైనందినజీవితంలో చూడగలమా, చూస్తే ధన్యులం అన్నటువంటిపాత్రలను సృష్టించిన ఆయన మనందరికీ చిరస్మరణీయుడు"—అని సుకుమారి ముగించడం చేతులు ఎర్రబడేవరకూ శ్రోతలు (సుకుమారి ప్రసంగించినంతసేపూ వీరిలో కొందరు ఉత్త "ప్రేక్షకులు"గానే ఉండకపోలేదు) చప్పట్లు కొట్టడమూ, సాంబం మొహంలో కొత్తకళ ప్రవేశించడమూ వెన్వెంటనే జరిగాయి.

ఆ తర్వాత నెహ్రూచొక్కా కాలర్ సర్దుకుంటూ ప్రారంభించారు— మహాకవి గీతాలమీద దాడి.

"......ఆయన ప్రతి గీతంలో ఒక [illegible]ం...ప్రతీపాదంలో ఒక పవిత్రతా [illegible]న్నాయి......ప్రశాంత తేజం, వినూత్న భావం వెల్లివిరియడం ఆయన ఒక్కరిగీతాల సొత్తు...ఆయన తర్వాత ఇంతవరకూ అట్టి రచనలు సలిపినవారెవరూ లేరు......అట్టి ఆయన గీతాలను, అర్థం పర్థంలేకుండా నేడు అనేకులు పాడి ఖూనీచేస్తున్నారు... ప్రతీ రెండోవాడూ మహాకవి గీతాలను పాడేవాడే...."

అయితే ప్రతీ మొదటివాడూ ఆ పాడే రెండోవాణ్ణిమాసి కడుపుమంటబడి సాహితీ సభలో అక్కసు కక్కేవాడన్నమాట అనుకున్నాడు సాంబశివం.

"......ఇదిగో...ఇది ఆయనగీతాల్లోకెల్లా ఉత్తమమయినదీ భావపుష్టిగలదీను— ఇది ప్రపంచంలోని అనేకభాషల్లోకి అనువదింపబడింది...ఐన్‌స్టీన్ మొదలు, బడి అయ్యవారిదాక ఈ పాటవిని తలలూపని వారులేరు... దానినే ఇప్పుడు పాడుతున్నా..."అని నెమ్మదిగా మొదలుపెట్టి క్రమకల్గించి... హెచ్చుస్థాయిలో ముగించాడు. శ్రోతలు 'హాయ్‌హాయ్' అన్నారు.

"బాగా నేపాడేడే!" అని విస్తుపోయాడు సాంబంకూడా.

ఈహడావిడిలో...గీతం పాడుతూపాడుతూ బృందావన్ సుకుమారివంక చూడడం, సుకుమారిఏదో చెప్పకుండాచెప్పడం చూచిన సాంబశివం ప్రక్కనే వున్న సుందరాన్ని గిల్లేడు. "ప్చ్! ఇంతేనటోయ్" అన్నట్టు చూసి వూరుకున్నాడు 'సుర'!

"...మహాకవిగారి ఒక్కొక్క గీతమూ మనసాహితీ క్షేత్రంలో ఒక్కొక్కమైలు రాయి...కవిత్వమంటే ఆయనదే... కవి అంటే ఆయనే...నేడు అనేకులు రాస్తున్నట్టుఅర్థమూ ఆశయమూ లేని కవితకాదు ఆయనది. ఆయన కలంనుండివచ్చిన ప్రతీ గీతం కలకాలం మన్నుతుంది. తప్పకుండా మన్నుతుంది; అందుకు సందేహంలేదు."

మూర్‌మార్కెట్టులో ఫౌంటెన్ పెన్ వ్యాపారి ఇస్తున్న 'గ్యారంటీ'లాగుంది— అని ఏడవలేక నవ్వాడు సాంబశివం.

"...కానీ ఈనాటి కవుల గేయాలూ గీతాలూ ఉన్నాయి చూశేరూ, అవి ఉత్తపిడుగులూ మెరుపులూ మాత్రమే! అవి ఇవాళ ఉంటాయి. రేపటికి కనుపించవు. కాలపుకొలతలో నిలబడగల విలువలు వాటికి లేవు;..." అని బట్టతల బృందావన్‌గారంటుంటే-వయస్సుమళ్ళిన, ఎముకలు కుళ్ళిన...!"అని సాంబశివం "బ్రెయిన్‌లో బ్రెన్‌గన్" కాల్పులు కాల్చింది. సాంబశివంతలకుచేతులొచ్చాయి.

ఇంతలో చప్పట్లూ.ఖద్దరాయన "..మహామహా పండితులూ కవులూ, విచ్చేసినందుకు సంతసం...మీకందరికీ నా వందనం" అని అనడమూ విన్న సాంబం "మహాప్రసాదమ"ని లేచాడు. చేతివాచీ తొమ్మిదిన్నర చూపించింది. "చక్రపాణి సినిమా చూసినా మూడుగంటలు వృథా పోకపోను" అనుకున్నాడు.

"నీవు బయటవుండు. నేను వారితో మాటాడివస్తాను." అని సాంబశివంతో చెప్పి సుందరం ఆ 'వారి'వైపు నడిచాడు.

కొత్త సాహిత్యపువాసన లేని గాలి పీలుద్దామని బయటకొచ్చి నుంచున్నాడు సాంబశివం.

తాను ఇక్కడకొచ్చి విన్నదేవిటా అని నెమరు వేసుకున్నాడు సాంబశివం. ఒకటి- "బహుశా, సుమారు, రమారమి, కాబోలు సందేహ సూచకమైన పదాలతో నిండిన అధ్యక్షుని స్వీయచరిత్ర.

రెండు—తనభార్య లిస్టుకన్న కొంత మెరుగనిపించే శ్రీమతి సుకుమారి 'పాత్ర'ల లిస్టు.

మూడు—మహాకవి గీతాల మన్నికకు 'గ్యారంటీ' ఇస్తూ వాటిని ప్రతీ 'రెండో' వాడూ పాడేస్తున్నాడో అని వాపోతూ, బృందావన్‌గారు ఒక్కరాగంతో పాడిన ఒక్కగీతం - ఒకమైలు రాయి - ఇవీ తాను విన్నవి - అని తేల్చుకున్నాడు సాంబశివం. వీటన్నిటి వెనుకా—ఏనాడో చచ్చిపోయి కూడా, ఈనాడు ఇంతమంది సాహిత్య సభలో కుర్చీలలో కూర్చుని "కూల్ డ్రింక్"లు త్రాగడానికి కారణభూతుడైన మహానుభావుడు ... ఆ మహాకవీంద్రుడు లీలగా కనుపించాడు సాంబశివానికి.

"రావోయ్ పోదాం! అందరూ వెళ్ళిపోయారు" సుందరం పిలిచాడు. వాళ్ళిద్దరూ నడుస్తున్నారు.

వీధిలో బొత్తిగా జనసమ్మర్దం లేదు. ఫుట్‌పాత్ మీద పడుకున్నవారి మూలుగులూ, గుర్రు—ఎక్కడనుండో వినపడుతున్న కుక్కల అరుపులూ...ఇవే శబ్దాలు. వీధి లాంతరుయొక్క ఇరవైఐదు కాండిల్స్ బల్బు, ఎన్. జి. ఓ. జీతంలా చాలీచాలని కాంతి నిస్తోంది.

"ఎలా వుందోయ్ 'జయంతీ'? 'గ్రాండ్'గా లేదూ?" అన్నాడు సుందరం.

'ఆ' అన్నాడు సాంబశివం—"సార్ ! ఓరం" అన్న కేకవిని పక్కకి తప్పుకుంటూ. రిక్షా దాటింది. సభలో ఉపన్యసించిన వారి సంస్కారాన్నీ పాండిత్యాన్నీ సుందరం ఎకరువు పెడుతున్నాడు.

"అబ్బ! మీమీద నాకు ఎంతకోపం వచ్చిందనుకున్నారూ?"—ముందు పోతూన్న రిక్షాలో స్త్రీకంఠం. సాంబశివం తటాలున తలెత్తి రిక్షావంక చూచాడు.

"ఎందుకూ?" లాలనగా పురుషకంఠం— రిక్షాలోనుండే.

రిక్షావాడుపరుగెత్తడం మొదలుపెట్టాడు.

"నాకు ఇష్టంలేని ఆ గీతాన్నే ఎందుకు పాడేరూ?"...దూర దూరంగా వెళ్ళిపోతూన్న స్త్రీ కంఠం.

సాంబశివం 'షాక్' తిన్నవాడిలా ఆగిపోయాడు. ★

కీలు బొమ్మలు

ఆఫీసులో అడుగు పెట్టగానే "అయ్యగారు రమ్మంటున్నారండీ" అన్నాడు సిద్దడు.

ఇంకా తొమ్మిది గంటలు కూడా కాలేదు. అప్పుడే అయ్యగారు ఆఫీసుకు రావడమూ, రాగానే నాకోసం ఖబురు పంపించడమూ కొంచెం ఆశ్చర్యంగానే ఉన్నది.

మళ్ళీ యేదో విపరీతం రానే వచ్చిందనుకొంటూనే నెమ్మదిగా ప్రొప్రయిటరు గదిలోకి వెళ్ళాను. సాధారణంగా మనం ఒకరికోసం ఖబురు పెట్టినప్పుడు వాళ్ళు ఎప్పుడు వస్తారా అని ఎదురుచూస్తూంటాం. మా ప్రొప్రయిటరుకు అటువంటి అలవాటేమీ లేదు. కనుక నేను వెళ్ళి అయిదునిమిషాలసేపు నుంచున్నా నేను వచ్చినట్లు తనకు తెలియనట్లు ఆ ఫైలూ, ఈ ఫైలూ తిరగవేశాడు కొంచెం కోపం వస్తే మాత్రం చేసేదేముంది? కష్టం కలిగితే మాత్రం తప్పేదేమిటి?

'ఏలూరునుంచి ఎప్పుడొచ్చారు?' అన్నాడు కూచోమనకుండగానే కొంచెం సేపయాక.

"పొద్దున మెయిలుకు వచ్చాను." అన్నాను.

"కూచోండి. ఏలూరు బ్రాంచి సంగతి ఏమీ బాగాలేదు."

"అవును బాగాలేదు. వాళ్ళుమాత్రం ఏం చేస్తారూ? జిల్లాబోర్డు ప్రెసిడెంటుకు మన పొడగిట్టటంలేదు."

"ఏం? ఎందుకని? మనం ఆయన నేమి చేశాం?"

"ఏమో తెలియదు."

"లెక్కలన్నీ సరిగ్గా ఆడిట్ చేశారా? మూర్తి యేమన్నాడు? ఈయేడు టరన్ ఓవర్ పెరక్కపోతే సంక్రాంతికి బోనసులు ఉండవని చెప్పారా? ఇంక్రిమెంట్లు ఆపాల్సొస్తుందని చెప్పారా? అవన్నీ నేను వ్రాశాననుకోండి అయినా ఇన్స్పెక్షనుకు వెళ్లినప్పుడు మీరుకూడా కొంచెం అదిలిస్తూ ఉండాలి సరే... రేపటినుంచీ అకౌంట్సు సెక్షన్‌కూడా మీరే చూడండి. 'ఇవాళ సుబ్బారావుగారిదగ్గర ఛార్జి తీసుకోండి. టైపిస్టువచ్చినతరువాత ఆర్డర్లు పంపిస్తాను." అని నేను చెప్పేదానికోసం ఎదురుచూడకుండానే అనేశాడు

సుబ్బారావంటే ప్రొప్రయిటరుగారిమరదలు కొడుకు. వాడంటే ప్రొప్రయిటరుకు చాలా యిష్టమని వదంతి. సుబ్బారావువల్లనే ఆనర్స్ పరీక్షలవగానే నాకు ఈ ఉద్యోగం దొరికింది కనుక సుబ్బారావు భవిష్యత్తేమిటో తెలుసుకోకుండా ఛార్జి తీసుకుంటానని అనడానికి బాధ కలిగింది.

"మరి నాఛార్జి ఎవరికి ఇవ్వమంటారు" అన్నాను.

"ఇవాళ్ల ఇరవయ్యోతారీకుగదా? ఇన్స్పెక్షన్ రిపోర్టులన్నీ నాలుగైదు రోజులలో తయారుచేసి ఇవ్వండి. ఈలోగా ఆ సెక్షన్ కూడా మీరే చూడండి తరువాత వేరే యేర్పాటు నేను చేసుకుంటాను." అన్నాడు ప్రొప్రయిటరు. అని ఇక నువ్వు వెళ్ళవచ్చునన్నట్లు చూచాడు.

ప్రొప్రయిటరుగదిలోనుంచి నా టేబుల్ దగ్గరకు వెళ్ళేటప్పటికి సుబ్బారావువచ్చాడు.


వి. యస్. అవధాని

నేరుగావెళ్లి తన టేబుల్ దగ్గర కూచుని పని ప్రారంభించాడు. సుబ్బారావువంక చూచాను వాడు నిన్న వచ్చిన టరన్ ఓవర్ షీట్లు సరిచూస్తున్నాడు. అవన్నీ నేను సరిచూచి సంతకం చెయ్యాలి. తరువాత వాటిని టైప్ చేయించాలి. ఆ తరువాత వాటిమీద ప్రొప్రయిటరుసంతకం పెట్టాలి. ఆతరువాత వాటిని సుబ్బారావు టేబిల్‌లోకి ఎక్కించాలి. ఇదంతా సింగిల్ ఎంట్రీ సిస్టమ్............

సుబ్బారావుదగ్గరికి వెళ్ళి ఈ విషయం చెపుదామనుకొన్నాను. అప్పటికే గుమాస్తాలందరూ వచ్చారు. టైపు మెషన్లు టకటకా మోగుతున్నవి. ఆఫీసు అనే యంత్రం నెమ్మదిగా కదిలింది. పదకొండు గంటలకు టపా వస్తుంది. టపా వస్తే ఇంటిదగర ఎవరో చచ్చారని కబురు వచ్చినా ఆఫీసులో నుంచి కదిలే వీలుండదు. అంత వేగంగా సడీశబ్దం లేకుండా ఆఫీసు అనే యంత్రం పోతూంటుంది. కనుక కొంచెం కాఫీ తాగివద్దామని ఆఫీసుకు ఎదురుగా వున్న హోటలుకు వెళ్ళాను.

కాఫీ తాగుతున్నానే గాని మనసు అక్కడలేదు. ఆరేండ్లనుండి ఇన్స్పెక్షన్ సెక్షన్‌లో ఉన్నాను. రెండుసార్లు బొంబాయికూడా వెళ్ళి సరుకు ఓడలకు ఎక్కించి వచ్చాను ఎప్పుడూ పనివిషయంలో అశ్రద్ధచెయ్యలేదు. నేను కాక ఇంకా యేడుగురు ఇన్స్పెక్టర్లున్నారు. మొత్తం 32 బ్రాంచీలలో నా పాలిట ఆరు బ్రాంచీలున్నవి. ప్రతినెలలోనూ మొదటి మూడువారాలు ఈ బ్రాంచీల లెక్కలు తనిఖీ చెయ్యడంతోనే సరిపోతుంది. స్టాక్ ఎంత నిలవఉన్నది? రోజూ వారీ అమ్మకం ఎంత? రొఖ్ఖపు బేరం ఎంత? అరువుబేరం ఎంత? ఇతర కంపెనీలకు సప్లయి ఎంత? ఇవన్నీ నేను తనిఖీ చెయ్యవలసిన విషయాలలో కొన్ని. నాకంట భార్యాపిల్లలు లేరు. కాని ప్రతి బ్రాంచి మేనేజరుకూ లోకమిచ్చిన భార్య ఒకర్తె, కొందరు పిల్లలూ ఉంటారు. వాళ్ళజీతాలు చాలా తక్కువగా ఉంటవి. కనుక లెక్కలలో కనిపించేదానికీ, రొఖ్ఖం నిలవ బాంకిలో ఉన్నదానికీ కొంచెం తేడా వుంటుంది

మామూలుఖాతాలో గాక అనామతుఖాతా అని ఒకటి ప్రతిబ్రాంచిలోనూ ఉంటుంది. దాని అంతు కనుక్కొనటం నాకు కొదుగదా ఇండియా అకౌంటెంట్ జనరలుకు కూడా తెలుసునో లేదో ఏమయినా నన్ను ఈ సెక్షన్‌నుంచి మార్చడానికి కారణం ఏమిటి? ఆలోచిస్తూ కూచున్నాను. కాఫీ



★ కీలు బొమ్మలు ★

చప్పగా చల్లారిపోయింది. మళ్ళీ కాఫీ తెమ్మన్నాను. సర్వర్ కాఫీ తెచ్చేలోగా సుబ్బారావు వచ్చాడు.

"రారా ఇట్లా కూచో" అన్నాను.

"విశేషాలేమిటి?" అన్నాడు వాడు కూర్చుంటూ.

"బాయ్ మరో కాఫీ" అన్నాను.

"ఏమిట్రా ... ఏమిటి సంగతులు. ఏం అంతదిగాలుగా ఉన్నావేం? ఇంటిదగ్గర ఎవరికన్నా జబ్బుగా ఉన్నదా? సెలవడిగితే ఇవ్వనన్నాడా మనబాస్" అన్నాడు సుబ్బారావు ఆప్యాయంగా.

అంతచనువుగా, ఆప్యాయంగా మాట్లాడు తున్నవాడికి ఈ విషయం ఎట్లా చెప్పను? ఏమని చెప్పను? చెప్పకపోయినా ఇంకా కొంచెం సేపటికి తెలుస్తుంది. నేను ప్రొప్రయిటరుగదిలో నుంచి రావడం సుబ్బారావు చూచాడు. నేను ఈ సంగతి ముందర చెప్పకపోతే ఆ తరువాత అది తెలిసినప్పుడు నేనే వాడిమీద ఏవో నేరాలు చెప్పి ఆ పోస్టులో నన్ను వెయ్యమని అడిగానని వాడు అనుకోవచ్చు...

"ఏమిట్రా దేభ్యం? అట్లా చూస్తావేం. ముందు కాఫీ తాగు" అన్నాడు సుబ్బారావు.

"సుబ్బారావ్...ఒక్క సంగతి. మీ సెక్షన్‌లో గుమాస్తాలు ఎంతమంది?" అన్నాను.

"ఆ ప్రస్తుతం అయిదుగురూ. ఏమిటీ సంగతి?"

"ఏం చెప్పమంటావ్? ఇవాళ పొద్దునే ఏలూరునుంచి వచ్చాను. గదికివెళ్ళి స్నానం చేసి కాఫీకూడా తాగకుండా ఆఫీసుకు పడివచ్చాను. ప్రొప్రయిటరు అప్పటికే నాకోసం కబురు పెట్టాడు."

"పెడితేయేం? ఏం కొంపమునిగింది? శ్రీవారి కటాక్షవీక్షణాలలో ఉన్నావు. అదృష్టవంతుడివి. ఆయనకి పెండ్లికావలసిన కూతురొకతె ఉన్నదిలే."

"వేళాకోళానికి ఇది సమయం కాదురా భాయీ! ఆయనకు నన్ను ఇంట్రడ్యూస్ చేసిందినువ్వు. నీవల్లనే నాకీ ఉద్యోగం వచ్చింది. నీకు నేను చాలా ఋణపడి ఉన్నాను. ఇప్పుడు నీ పోస్టులో నన్ను వేస్తానంటున్నాడు."

సుబ్బారావు ఢిగ్గరగా నవ్వాడు.

నాకేమీ అర్థం కాలేదు.

"ఎందుకు అట్లా నవ్వుతావ్"

"అవును నిజమే నవ్వాల్సింది కాదు. నీ అమాయకత్వంచూచి ఏడవాల్సింది" అన్నాడు సుబ్బారావు.

"అదేమిట్రా అట్లా అంటావూ? ఒక చెంప కొంప లంటుకొని పోతుంటే. ఉద్యోగం ఊడితే గంపెడంత సంసారాన్ని ఎట్లా ఈదుస్తావు?" అన్నాను.

"నామీద జాలిపడమాక. నీ సంగతి నువ్వు చూచుకో. ఆరేండ్లుగా ఉద్యోగం ఏడుస్తున్నా ప్రొప్రయిటర్ సంగతి నీకేమీ అర్థం కాలేదు. పద...టపా వచ్చినట్లుంది." అన్నాడు సుబ్బారావు.

2

సుబ్బారావు చెప్పింది నిజమే అయింది. సుబ్బారావును మా కంపెనీనుంచి తీసి వేశారు. కాని, వాడిపోస్టులో నన్ను వెయ్యలేదు. అంతవరదాకా వాడికి అసిస్టెంటుగా ఉన్న శర్మను సుబ్బారావు పోస్టులో వేశారు. శర్మకు అదివరకు నూట ముప్ఫయి ఇచ్చేవాళ్లు. ఇప్పుడు ఒక్కసారిగా రెండువందలకు పెరిగింది వాడి జీతం. ముష్టిజీతంసంగతి ఎవడికి కావాలి గాని ప్రొప్రయిటరుసంగతే నాకు అంతు పట్టకుండా ఉన్నది.

పనిమాలా పిలిచి సుబ్బారావు ఛార్జీ తీసుకోమని చెప్పమని నేను ప్రొప్రయిటరు మీదపడి ఏడ్చానా? అయినా సుబ్బారావు చేసిన తప్పేమిటి? ఈయేడుకింద బోడంత లాభంలేనిమాట నిజమే. అయితే దానికి సుబ్బారావు బాధ్యుడా? కాడే. అడ్వర్‌టైజ్ మెంట్ సెక్షన్ వేరేఉన్నదాయె సేల్సు సెక్షన్ వేరేఉన్నదాయె. ఇవన్నీ కాక సేల్సు ఎట్లా ఎక్కువ చెయ్యాలో చెప్పడానికి సలహాదార్ల శాఖ ఉన్నదాయె. వాటన్నింటిని వదిలిపెట్టి అకౌంటెంట్‌ను ఎందుకు తీసివేసినట్లు? అందులోనూ సుబ్బారావు ప్రొప్రయిటరుకు పరాయివాడు కాడే. పైగా సుబ్బరావు అదివరకు మద్రాసులో ఏవో కంపెనీలో పని చేస్తావుంటే ప్రొప్రయిటరు వాణ్ణి బ్రతిమాలుకుని తెచ్చుకున్నాడే? వాణ్ణి ఎందుకు తీసి వేసినట్లూ! గుడ్డిలో మెల్ల అన్నట్లు సుబ్బారావుకు మూడు నెలల జీతం, రెండు నెలల లీవు జీతం, ఒకనెల బోనసు ఇచ్చారు. అంత వరకు నయమేలే అనుకున్నాను. ఇంత డబ్బు ఎదురిచ్చి సుబ్బారావును ప్రొప్రయిటరు ఎందుకు వదులుకున్నాడు?

మరో రెండుసెలలు గడిచినవి. సుబ్బారావు సీట్ లో పనిచేస్తున్న శర్మవల్ల, ఆఫీసులో చాలా మార్పులు వచ్చిన వనుకుంటు న్నారు. నామటుకు నేను నెలకు ఇరవై అయిదు రోజులు ఊళ్ళమీద పడి తిరిగే వాణ్ణి కనుక ఆ మార్పులు నాదాకా రాలేదేమో?

ఒకరోజు నేను కాకినాడ బ్రాంచిలో పని పూర్తి చేసుకొని వచ్చే సరికి నా సెక్షన్‌నుంచి ఇద్దరు గుమాస్తాలనూ ముగ్గురు ఇనస్పెక్టర్లనూ తీసివేసినట్లు ఒక సర్క్యులరు నా టేబిల్‌మీద ఉన్నది. సంతకం ప్రొప్రయిటరుది కాదు. ప్రొప్రయిటరు కలకత్తా వెళ్లాడు. వెళితే జనరల్ మేనేజరు సర్క్యులరు పంపించాలి. అంతే కాని శర్మ ఎవరూ ఆతరు పంపించడానికి?

సినిమాస్కోపు సినిమా నడుస్తోంది. ముందుసీటులో ఒకాయన హేట్ పెట్టుకొని కూర్చున్నాడు. వెనకవున్న సీటులోని పెద్దమనిషి ఆ హేట్ అడ్డం తప్పించుకు సినిమా చూడటానికి యింటర్‌వల్ దాకా నానా అవస్థలూ పడ్డాడు.

ఇంటర్‌వల్ లో లైట్లు వెలిగాక ముందుసీటులో వున్న మనిషి భుజంతట్టి, "మీరా హేట్ ఎంతకు కొన్నారండీ" అని అడిగాడు.

"ఏం ?"

"ఏమీ లేదు. చాలా బాగుంది."

"మూడున్నర యిచ్చి కొన్నాను."

"మరోలా అనుకోకపోతే యీ మూడున్నరా తీసుకొని, నాకా హేట్ యిచ్చెయ్యండి." అని పర్సుతీసి డబ్బు లెక్కపెట్టి ఆయన చేతులోపెట్టి, హేట్ తీసుకొని తన వొళ్లో పెట్టుకు కూర్చున్నాడు. లైట్లు ఆరిపోయి, మళ్లీ ఆట హాయిగా మొదలైంది.

మళ్ళీ ఒకసారి ఆ సర్క్యులరు అటునుంచి ఇటూ ఇటునుంచి అటూ చదివాను. ఆర్. వి. ఎస్. శర్మ ఫర్ ప్రొప్రయిటరు అని ఉన్నది. అప్పుడు అర్థమయిందను కొన్నాను శర్మ అనే ఈ కొత్త అకౌంటెంట్ ప్రొప్రయిటరుకు చాలాదగ్గరవా డయినాడనీ, అతనికి కష్టం కలిగించితే ఇక ఉద్యోగంకూడా ఖాళీ అవుతుందనీ... అయితే వచ్చిన చిక్కేమిటంటే ఏడు గురం ఇన్‌స్పెక్టర్లం ఉన్నప్పుడే ముప్పయి రెండు బ్రాంచీల పనీ చూచే టప్పటికి తలప్రాణం తోకకు వస్తున్నదే. ఇప్పుడు ఈ పనంతా అయిదుగురు ఇన్‌స్పెక్టర్లవల్ల అవుతుందా? ఏ బ్రాంచి లెక్కలవన్నా సేల్సుగాక్సు డిపార్టుమెంటులో, ఇన్‌కంటాక్సు డిపార్టుమెంటులో పట్టుకొంటే ఇన్‌స్పెక్టర్లే ఆ ఆఫీసులో హాజరు కావాలి. కాకపోతే బ్రాంచి మేనేజరు వెంటఉంటాడు. కావలసిన వివరాలు చెప్తాడు. వాళ్ళది అదో రకం తరహా!

మా సెక్షన్ అటెండరును తీసివేశారు. ఇదివరకు ఇద్దరూ బాయ్‌స్ ఉండేవాళ్ళు. ఒకణ్ణి తీసివేశారు. ఇదంతా యేమిటని ఆలోచిస్తూ కూర్చున్నాను. అంతలో శర్మ వచ్చాడు. రావడం రావడం హుటాహుటీగా నా దగ్గరికే వచ్చాడు.

"మాదూ గిరీ...మీ సెక్షన్‌లో..."

★ కీలుబొమ్మలు ★

"అవును. చాలామందిని తీసివేశారు. ఇప్పుడే సర్క్యులరు చూచాను."

"ఏంచేద్దాం చెప్పు మరి. రోజులు అట్లా ఉన్నాయ్. మనమందరం కష్టపడి పనిచేసి కంపెనీ పేరు నిలబెట్టాలి"

"అవును. కష్టపడి పనిచెయ్యాల్సిందే. ఇప్పుడెవరు కష్టపడి పనిచెయ్యడంలేదో చెబితే."

"అబ్బెబ్బే... చెయ్యడం లేదని కాదు. అటెండెరు లేడనుకో. ఏంచేస్తాం? మన ఇంట్లో అయితే మనమే ఏ ఫైలు ఎక్కడున్నదో చూచి తెచ్చుకుంటామా లేదా? కాఫీ కావాలనుకో? భార్య ఇంట్లో లేదనుకో ఏంచేస్తాం. మనమే కాచుకుంటామా లేదా? అట్లాగే ఆఫీసు పనికూడా మనమే సర్దుకుపోవాలి" అన్నాడు శర్మ. అని గబగబా తన సీట్ లోకి వెళ్ళిపోయినాడు. వెళ్లగానే ఒక కుర్రవాడు ఫాన్ వేశాడు. మరొకడు చేతిలోనుంచి బాగ్ తీసుకొని టేబుల్ మీద పెట్టాడు. అదంతా చూస్తున్న నేను నిర్ఘాంతపోయినాను.

శర్మ చెప్పింది నిజమే. రోజులు బాగా లేవు. డబ్బుకు చాలా ఇబ్బందిగా ఉన్నది. కనుక పొదుపు అవసరమే.

నాకంటే సంసారం గింసారం లేదు కనుక ఇబ్బంది అంటే యేమిటో స్వయంగా తెలియటంలేదు కాని ఆఫీసులో అరవైరెబ్బయి సంపాదించేవాళ్లు పెద్దపెద్ద సంసారాలతో ఎంత ఇబ్బంది పడుతున్నదీ వింటున్నాను. టైపిస్టులలో ఒకళ్లు మూడు నెలల కిందట పాతికరూపాయలు తీసుకున్నారు. తిరిగి ఇవ్వలేదు. అసిస్టెంట్ కేషియర్ రామయ్య కిందటి నెలలో యాభైరూపాయలు తీసుకున్నాడు. వాడి సంసారాన్ని చూచినతరువాత డబ్బు ఇవ్వమని అడగ బుద్ధి పుట్టలేదు. మామూలు సంసారాల సంగతే ఇలాఉన్నప్పుడు పెద్దపెద్ద కంపెనీల ఇబ్బందులు ఇంకా ఎక్కువగాఉండవా? అందులోనూ ఒకటికాదు రెండు - కాదు. ముప్ఫయిరెండు బ్రాంచీలనూ సర్దుకురావాలి. ఈయేడు మా కంపెనీ కొత్తగా రెండు వ్యాపారాలు కూడా ప్రారంభించింది. అంటే స్వయంగా ప్రారంభించలేదు. ఏవో రెండుకంపెనీలు దివాలా తీసేస్థితిలో వుంటే వాటిని మా ప్రొప్రయిటరు కొన్నాడు.

నాకు పట్టుకున్న బాధ యేమిటంటే ఇంతమందిని ఉద్యోగంలోనుంచి తీసివెయ్యకపోతే ఆ కొత్తవాటిలో మా కంపెనీలో పని తక్కువగాఉన్నవాళ్లను నియమించరాదా అని. అదల్లా ఉండగా మా కంపెనీలో వాళ్లకు పనితక్కువగాఉన్నదా అంటే అదీ కనిపించదు. జనరల్ మేనేజరు కాక అయిదుగురు సెక్షన్ మేనేజర్లున్నారు. ముగ్గురు కాషియర్లున్నారు. నలభై అయిదుగురు గుమాస్తాలున్నారు. వాళ్లలో ఏ ఒక్కడూ రాత్రి ఎనిమిదిగంటలవరకూ ఇంటిముఖం చూడడు. రాత్రి పొద్దుపోయేదాకా పనితో సతమతమవుతునే ఉంటారు. పైగా కొందరు తాలూకాఫీసుగుమాస్తాలాగా ఈ ఖాతా పుస్తకాలనూ, ఫైళ్ళనూ ఇంటికి తీసుకువెళతారు. పని తక్కువలేదు. ఉన్నవాళ్లందరికీ పూర్తిగా పని ఉన్నది. మరి ఈవిధంగా క్రమంగా ఉద్యోగులను ఎందుకు తీసివేస్తున్నట్లు? డబ్బు లేదా? ఇదివరకంతటి లాభాలు లేకపోవచ్చు. ఇదివరకు సంవత్సరానికి నాలుగు లక్షల లాభంవస్తే ఇప్పుడు రెండు లక్షలు వస్తున్నది. అంతేగాని అసలు లాభమే రాకపోవడం లేదు. మరి వాళ్ళందరినీ ఎందుకు తీసివేసినట్లు?

3

మరో ఆరునెలలు గడిచినవి. ఆ వేళ గుంటూరు బ్రాంచి ఇన్‌స్పెక్షన్‌కు వెళదామని స్టేషనుకువెళ్ళి టికెట్ కోసమని బుక్కింగ్ కిటికీవద్ద నుంచున్నాను. "హల్లో గిరీ" అంటూ ఎవరో వెనకనించి భుజంమీద చెయ్యివేశారు. వెనక్కు తిరిగి చూచి సూట్ బూటూలో వున్న సుబ్బారావును మొదట గుర్తుపట్టలేకపోయాను.

"ఏరా... ఎట్లాఉన్నావ్" అన్నాడు సుబ్బారావు.

"ఏదో నీ దయవల్ల బాగానే ఉన్నా. ఎందాకా? ఇప్పుడెక్కడ ఉంటున్నావు?" అన్నాను.

"ముందు గుంటూరుకు రెండు ఇంటర్ తీసుకో. తరువాత రైల్లో మాట్లాడుకుందాం" అన్నాడు సుబ్బారావు."

టికెట్లు తీసుకున్నాను. ఇద్దరమూపోయి ఇంటరుక్లాసులో కూచున్నాము. రైలు కదులుతోంది.

"ఏరా బ్రదర్ అసలు సంగతి చెప్పు. ఇప్పుడు ఏ కంపెనీలో ఉంటున్నావ్? రోజూ కల్సుకుందామని అనుకుంటా. కాని, ఏంచెయ్యను చెప్పు. ఒకటే గొడవగా ఉంది."

సుబ్బారావు నవ్వాడు. మళ్లీ అదే నవ్వు. వెకిలినవ్వు. ఉద్యోగం పోతుందని చెప్పినప్పుడు ఎట్లా నవ్వాడో ఇవాళకూడా అట్లాగే నవ్వాడు. ఏమీ తెలియక వాడి ముఖంలోకి చూచాను.

"అయితే ప్రొప్రయిటరు కలకత్తానుంచి వచ్చాడా? కలకత్తాలో తాతావాళ్ళ బ్రాంచి లీస్‌కు తీసుకుంటాడుటగా"

"ఏమో తెలియదే? మరి నువ్వు ఏ కంపెనీలో ఉంటున్నావ్?"

చెప్పాడు. ఆశ్చర్యపోయాను. అది మా ప్రొప్రయిటరు ఇటీవల కొన్న కంపెనీలలో ఒకటి!!!

ఇదంతా ఏమిటన్నాను. సుబ్బారావు చెపుతున్నాడు:

"“గిరీ...ఇది లోకం. ఈ లోకం సంగతి నీకు బొత్తిగా తెలియదు. ఇది ప్రపంచం కాదు. మాలోకం. ఆ రెండు కంపెనీలనూ కొనడానికే నన్ను మన కంపెనీలో నుంచి తీసివేశారు. అవి దివాలా తియ్యడానికి మన కంపెనీయే కారణం. దానికి చాలా గ్రంథం ఉన్నదిలే. అయితే ఈ యేడు చాలా లాస్ వచ్చిందటగా.”

“ఎవరు చెప్పారు?” అన్నాను. “మా హెడ్ అకౌంటెంట్ శర్మ.” అన్నాడు.

“ఆయన ఇంకా నిన్ను కలుస్తున్నాడా?”

“కలవక ఏడుస్తాడా యేం? ఆయన అంటావేమిటి? వాడు స్కూల్ ఫైనల్ కూడా సరిగ్గా పాస్ కాలేదు.”

“పాస్ కాకపోతే యేం? ఇప్పుడు మా కంపెనీకి శర్మ సూపర్ మేనేజర్. ఆమాట అతని హోదా చెప్పడానికి చాలదేమో?”

“ఏం? అంత దూరం వచ్చిందా?”

“ఇన్ని తెలుసుకొన్నవాడివి అదికూడా తెలుసుకోలేదా మరి.”

“ఏంచేశాడూ?”

“ఏం చెయ్యటయేమిటి? మొత్తం కంపెనీమీద ఓవంద మందిని ఉద్యోగాలలో నుంచి తీసివేశాడు.”

“వాడు తీసివెయ్యడం ఏమిటి?”

“మరి ఏమనుకొంటున్నావ్” అని కాగితాలు చూపించాను.

సుబ్బారావు నవ్వాడు. నవ్వి సగం కాలిన సిగరెట్ కిటికీలోనుంచి పారేసి నెమ్మదిగా ఇలా అన్నాడు.

“లెక్కల ఆనర్సులో ఫస్టుక్లాస్ వచ్చిన నువ్వు ఇంతడన్ను వనుకోలేదు. నీకు వ్యాపార మర్మం తెలియలేదు.’ వ్యాపార మర్మమంటే మాలోక మర్మమన్నమాట. శర్మ చూడు. ఎంత తెలివిగా వడుస్తున్నాడో.”

“ఏమిటా తెలివి” అన్నాను.

“ఏమిటా ప్రొప్రయిటరు ఆరునెలలు ఊళ్లో లేకపోయేటప్పటికి ఆఫీసునంతా మార్చివేశాడు. రిట్రెంచిచేసి ఖర్చు తగ్గించాడు. మేనేజర్లనందర్నీ హడలగొట్టాడు. అవకాశం వచ్చినా అటువంటి పని నువ్వు చెయ్యలేవు.”

“అవును. చెయ్యలేను. ఇటువంటిపని చెయ్యలేను. లాస్ వచ్చింది. వచ్చింది అని గోలపెట్టేవాడేకాని నష్టం ఎందుకు వస్తున్నదో కనుక్కొన్న నాథుడు లేడు. నష్టం వచ్చిందనే నెపంతో ఉద్యోగులను తీసివెయ్యటం తెలివిగల పనేనా?”

“నష్టం ఎందుకు వస్తున్నదంటావ్?”

“నీకు తెలియకనే అడుగుతున్నానా?”

“అయినా చెప్పుదూ చూద్దాం.”

“సగం బ్రాంచీ మేనేజరలో దాదాపు అందరూ ఇండ్లు కట్టుకొన్నారు తెలుసా?” అన్నాను వళ్ళుమండి.

“ఏం కట్టుకుంటే” అన్నాడు సుబ్బారావు తాపీగా.

“ఏ బ్రాంచిలో వచ్చిన డబ్బు ఆ బ్రాంచి మేనేజరు వాడుకుంటే ఇక కంపెనీకి లాభం ఏం వస్తుంది?”

“లాభం అంటే యేమిటి?” అన్నాడు సుబ్బారావు నవ్వుతూ.

“అదీ నువ్వే చెప్పు” అన్నాను.

“మన బ్రాంచీల మేనేజర్లందరూ మన ప్రొప్రయిటరుకు కావలసినవాళ్ళే. వాళ్ళు ఇండ్లు వాకిళ్ళు కట్టుకొన్నా లాభం రావాలని మన ప్రొప్రయిటరు అభిప్రాయం.”

“మరి ఎందుకు రావడంలేదు?”

“ఏం రాకపోతే?”

“మరి రాలేదని ఉన్నవాళ్ళని తీసివెయ్యడం దేనికి”?

“ఏం తీసివేస్తే?” “వాళ్ళందర్నీ పోషిస్తానని ప్రొప్రయిటరు హామీ ఇచ్చాడా?” అన్నాడు సుబ్బారావు!

ఈ సుబ్బారావు ఉద్యోగం పోతుందని నేను బాధపడ్డానట!!


సంభాషణ అక్కడ ఆగిపోయింది. నేను సుబ్బారావునుగురించి ఆలోచిస్తున్నాను. సుబ్బారావు సిగరెట్ వెంట సిగరెట్ తగలేస్తున్నాడు. నేను నాలుగైదుసార్లు పొడుం పీల్చాను.........

4

ఇంకో నాలుగునెలలు గడిచినవి. బెజవాడ బ్రాంచిపని పూర్తిచేసుకుని ఆవేళనే ఆఫసులోకి దిగాను. గుమాస్తాలందరూ హడావుడిగా ఉన్నారు. ఏమిటని అడిగితే శర్మను డిస్మిస్ చేశారన్నారు. శర్మకు బదులువాడి కింద పనిచేస్తున్న రంగయ్యను ఆపని చూడమన్నారు. జీతంమాత్రం పెంచలేదు. పెంచమని వాడు అడగలేదు. వాళ్లు పెంచుతామనలేదు. మనంమాత్రం మామూలుగానే బండిని లాక్కొస్తున్నాం! ★



"చెప్పకు చెప్పకు చామంతీ!   "



★ ఫొటో : బి. రవీంద్రనాథ్, (గుంటూరు).

వనితాలోకం

సౌందర్యం, వ్యక్తిత్వం

కొమ్మూరి ఉషారాణి

దూరాన వెడుతున్న ఆ అమ్మాయి వంక మళ్లీ చూడాలనిపించలేదు. రెండు జడలూ, పెదిమలకి రంగూ, పెన్సిలుతో సరిదిద్దిన కనుబొమ్మలూ, జార్జెట్టు చీరా, మోచేతుల వరకూ ఎత్తిటి ఛోళీ. అంత అలంకరించుకున్నా ఆమెలో ఏదో ఆకర్షణ లోపించింది. సాక్షాత్తూ అప్సరసలా కాకపోయినా, ముఖం కొంత బాగానేవుంది. కానీ అటువంటి వ్యక్తినే చాలాసార్లు చూశాననిపించింది. అలాటి దుస్తులూ అలంకరణతో వుండే స్త్రీలు రోజూ నాకెదురవుతూనే వున్నారనిపించింది.

"స్త్రీకి ప్రకృతి యిచ్చిన మొదటి బహుమానం సౌందర్యం" అన్నాడు మేర్. ఓ చక్కటి పువ్వులోగానీ, వినీలాకాశంలోగానీ, ఏ కొండలోగానీ, ఓ వ్యక్తి ముఖంలోగానీ సౌందర్యమనేది వుంటే చూచే అవకాశం పోగొట్టుకో వద్దన్నాడు ఎమర్సన్. మనం అందంగా వుండాలని ఆశించడంలోనూ, అందుకు కొంత ప్రయత్నించటంలోనూ తప్పులేదు. శుభ్రమయిన బట్టలు కట్టుకు బయటికి వస్తే నలుగురూ మనల్ని చూసి మూర్ఛలు పోనక్కరలేదు; మనతో మాట్లాడవలసివచ్చినా, దారిలో ఎదురుపడినా 'ఈ మనిషి నాకెందుకు తటస్థపడిందా' అన్నట్లు ముఖం చిట్లించుకోకుండా వుంటే చాలు. సహజంగా ఉండే సౌందర్యానికి కొత్త మెరుగులుదిద్ది, దానిని వృద్ధి చేసుకోవటానికి ప్రయత్నించాలిగాని, వున్న ముఖాన్ని మరి కొంత వికృతంగా చేసుకోకూడదు. దురదృష్టవశాత్తూ ఈ తరహాకి చెందిన స్త్రీలు మనకి తరుచూ కనపడుతూ వుంటారు. చేతకానితనంవల్లా, అమాయకత్వంవల్లా అందవికారంగా తయారయ్యే స్త్రీలకంటె, తాము చాలా అందంగా వున్నామని మురిసిపోతూ వికృతంగా అలంకరించుకునే స్త్రీలని చూస్తే జాలి వేస్తుంది.

ఈనాటి యువతులు చాలామంది నవీన పద్ధతుల ప్రకారం వస్త్రాలు ధరించటంలోనూ, అలంకరించుకోవటంలోనూ ఒకరినొకరు గుడ్డిగా అనుకరిస్తున్నారు. ఇలాటి అనుకరణవల్ల వారి విశిష్ట లక్షణాలు చెరిగిపోవటమే గాకుండా, ఒక వ్యక్తికీ మరొక వ్యక్తికీ భేదం కనుపించకుండా పోతోంది. ఏవిధమయిన అలంకరణలైనా తమ రూపానికీ ముఖానికీ అతుకుతాయా లేదా అని కొంత ఆలోచించి మరీ అలంకరించుకోవటం మంచిది. అలాగాక ఎవరో సినిమాతార వేసుకుంది గదా అని వయసు ముదిరినా పావడా ఓణీలూ, పాశ్చాత్య సినిమాలో తారకి బాగుండగా లేనిది నాకెందుకు బాగుండదనుకుంటూ జుట్టు కత్తిరింపులూ మొదలు పెడితే, ఉన్న అందం అంతరించిపోవటం మాట అటుంచి, చుట్టూ వున్నవాళ్లకి వెగటూ నవ్వూ పుట్టటం జరుగుతూంటుంది.

ఇటువంటి అనుకరణలకి ముఖ్యకారణం, ఎంతసేపూ ఎదుటివారి దుస్తులనూ, తలకట్టునూ, నగలనూ అనుకరించి వారిలాగానో లేక వారికంటె అందంగానో కనిపించాలనే తాపత్రయం. అంతేగానీ ఒక స్త్రీ ముఖంలో వుండే ఆకర్షణ ఏమిటో తెలుసుకుని, ఆకర్షణీయమైన అందాన్ని పెంపొందించుకోవాలనే ప్రయత్నం కనపడదు.

కనుముక్కుతీరు ఎంత బాగున్నా, సాధారణంగా అనారోగ్యంతో బాధపడే స్త్రీలు అంత ఆకర్షణీయంగా ఉండరు. ఒకమ్మాయి మొన్ననే బొంబాయి వెళ్ళివచ్చింది. సన్నగా, నల్లగా, పొట్టిగా

వుంటుంది. పొట్టి జడ. కొత్త గట్టిగా భుజంమీద తట్టితే కింద పడిపోతుందేమో నని భయమేస్తుంది. బొంబాయినుంచి వచ్చినప్పటినుంచి ఆమె తరహాయే మారిపో యింది. నుదుటి దగ్గిరా, చెంపలదగ్గిరా జుట్టు ముక్క ముక్కలుగా కత్తిరించిపారేసింది. పలుచని జార్జెటు చీరా, వీపునిండా అద్దాలు కుట్టిన రవికా, రింగుతీసి చుట్టిన ముడీ, చెవులకి వెడల్పాటి కమ్మలూ, మెళ్ళో నాలుగువరసల తెల్ల ముత్యాల దండా వేసుకు తిరుగుతుంటే, అందరూ ఆమెకేసి చూచే వారే. తను చాలా అందంగా అలంకరించు కున్నానని అతిగర్వంగా తిరుగుతుంది. ఆవిధమయిన అలంకరణ ఆరూపానికి అతక లేదని ధైర్యంచేసి చెబితే, ఈర్ష్య పడు తున్నారని అనుమానిస్తుందేగాని, అర్థం చేసుకోవటానికి ప్రయత్నించదు.

అంతో ఇంతో అందంగా వుండేవాళ్లూ లేనివాళ్లూగూడా అలంకరించుకునే బయ టకి వస్తారు. కానీ ఈ అలంకరణవిష యంలో కొత్త శృతిమించి రాగాన పడి, కేవలం నలుగురిమధ్యా ప్రత్యేకంగా కనిపించాలని తాపత్రయపడే స్త్రీల కష్టాలు మా స్తేమటుకు నిజంగా జాలి కలుగుతుంది. ఆ ఉద్దేశంతో అలంకరించుకునేవారు అసా ధారణమైన పద్ధతులు అవలంబిస్తున్నారు. ఓ పాశ్చాత్య సినిమాలో ఒకతార హేటు మీద అట్టతో చేసిన రెండస్తులమేడా, దానిమీద ఆకులూ, పువ్వులూ పెట్టుకుని వస్తుంది. గుండ్రంగా రుబ్బురోలుపత్రాల్లా వుండే స్త్రీలు పెద్దపెద్ద ఆకులూ పువ్వులూ గల డిజైనుల చీరలు కట్టుకుంటేమటుకు, దణ్ణెంమీద ఆరవేసినట్టుంటుంది. మరీ సన్నటి వాళ్లు కట్టుకుంటే మడతపెట్టినట్టుంటుంది. అలా అలంకరించుకునే స్త్రీలనిమనం పది మందిమధ్యలో విడిగా చూసేమాట నిజమే. కానీ వారు మనల్ని ఏవిధంగానూ రంజింప చేయలేరు. సౌందర్యంఅనేది కేవలం ఆకర్షణ మీద ఆధారపడదనిపిస్తుంది. ఆనిముషంలో మనల్ని విచిత్రంగా ఆకర్షించినా వారిని మనం మరుక్షణంలో మరిచిపోతాం.

సాధారణంగా ప్రతి యువతీ తాను కొంత అందంగా వున్నాననీ వుండాలనీ అనుకుంటుంది. అందం ఆకర్షణా కొంత లోపించినా, తెలివితేటలూ ప్రజ్ఞాగల స్త్రీలు ఎక్కువగా ఆకర్షిస్తారనే మాట మనం కాదనలేం. ప్రతి స్త్రీకి తాను అందంగా వుండాలనే కోరిక కలగటం, అలంకరించు కోవటంమటుకు సహజం. పూర్వం కవులు వర్ణించినట్లు సాక్షాత్తూ మన కళ్లు కలువరేకు ల్లాగానూ, చేతులు తామరతూళ్ళలాగానూ వుండాలని ఆశించకపోయినా, ప్రతి స్త్రీ నలుగురికీ ఆకర్షణీయంగా కనపడాలని ప్రయత్నిస్తుంది. నీవు తెలివయినదాని వనటంకంటే, అందమయినదానివంటే ఎక్కువ మురిసిపోయే స్త్రీలూ వున్నారు.

ఆడదానికి అందమనేదే లేకపోతే ఈ ప్రపంచంలో సగం ఆకర్షణ అంత రించిపోతుందన్నాడు ఓ భావకవి ఓ సంద ర్భంలో. నిజం చెప్పాలంటే పురుషుల కంటె మనమే అద్దంముందు ఎక్కువసేపు గడుపుతాం. ఎక్కడికయినా బయలుదేర వలసివస్తే "ఉండండి! యిప్పుడే వస్తా" నంటూ లోపలికివెళ్ళి కొస్త పౌడరు ముఖాన పులుముకుని, చీర మార్చుకుంటేనే గానీ తృప్తిపడలేము. ఈ విషయంలో మొగవాళ్ళని మనం ఎంతో మెచ్చుకు తీరాలి. ఎలా వున్నవారు అలాగ చెప్పులు తొడుక్కుని బయటకు అడుగు పెడతారు. కానీ ఈ రోజుల్లో పురుషులుకూడా ఆవారా బుష్‌కోట్లూ, క్రేపు సిల్కు జుబ్బాలు వేసుకుంటున్నారు. ఆడవాళ్ళ జాకెట్టుగుడ్డలని షర్టులుగా జుబ్బాలుగా కుట్టించుకోవటం మొదలుపెడుతున్నారు. ఈ రకంగా పోటీలుపడితే, భవిష్యత్తులో కవులూ, రచయితలూ స్త్రీల సౌందర్యాన్ని వర్ణించటం మానివేసి, పురుషుల అలం కరణలకి ఎక్కువ ప్రాముఖ్యం యిస్తా రేమో అని కొందరి విచారం. కొందరు పురుషులు కళ్లకి కాటుకా, పెదిమలకి కొద్దిగా రంగూ పూసుకోవటం గూడా చూశారుట. నాకు తెలిసినంత మటుకు ఈవిధంగా స్త్రీలతో పోటీపడ టానికి ఆశేముంది. పురుషులు ఉపక్రమించ

★ సౌందర్యం, వ్యక్తిత్వం ★

లేదు గనుక, అంత ప్రమాదమైన పరిస్థితులు ఏర్పడవని తోస్తుంది.

ఒకరకమయిన దుస్తులూ, అలంకరణలూ కొందరికి బాగుంటాయి మరి కొందరికి అసహ్యంగా వుంటాయి. నల్లగావున్న కొంత మంది స్త్రీలు నల్లచీర కట్టుకుంటే కళగా వుంటారు. నగలూ నాజూకులూ వున్న అందానికి కొంత మెరుగులు దిద్దుతాయి గాని, వికృతంగా చెయ్యవు. ఈ మధ్య మోచేతులదాకా రవికలు వేసుకోవటం ఒక ఫాషనయిపోయింది. ఈ రకం ఫాషన్లు కొంత బొద్దుగా, ఎఱ్ఱగా వుండే స్త్రీలకి ఎక్కువ బాగుంటాయనిపిస్తుంది కాని ప్రతి వాళ్ళూ ఈ ఫాషన్లను అన్ని రంగుల్లోనూ వేసుకుని వాటిదుంప తెంపేస్తున్నారు. వీరి మాట అటుంచి, జుట్టు కత్తిరింపుతో, పెదములకి రంగుపూసుకుని కాళ్ళకి మట్టెలు పెట్టుకునేవాళ్ళూ; చేతినిండా గాజులు వేసుకుని వాటిమధ్య చేతిగడియారం కోసం వెదకటం [illegible] స్త్రీలూ [illegible] ఎదురవుతూ వుంటారు. ఇటు పూర్తి ఆధునికంగానూ గాక, అటు పూర్తిగా ప్రాచీనంగానూ గాక మధ్యరకంగా అలంకరించుకునే ఈరకం స్త్రీలని ఏమనాలో తెలియటం లేదు. ఎందుకయినా మంచిదని రెండుపద్ధతులనీ అవలంబిస్తున్నారనిపిస్తుంది.

ఇక అలంకరణ విషయంలో పురుషుల సలహా అడుగుతూంటారు కొందరు స్త్రీలు. ఏదో అలంకరించుకుంటే చూచి ఆనందించగలరు గానీ, ఆ విషయాల్లో పురుషుల అభిరుచి చాలా అన్యాయంగా [illegible] కొందరు. ఒక చిత్రకారుడు [illegible] భార్య [illegible] ఒక సిల్కుచీర తెచ్చారు. ఇంకేముంది! చిలుకరంగు పచ్చని పేరుమీద [illegible] పువ్వులతో, [illegible] గేదెలూ గూడా [illegible] భయంకరంగా వున్నాయి [illegible]. ఆ చీర [illegible] అంతా కాదు. [illegible] విశ్రాంతి ఇచ్చింది [illegible] చేరినా ఆ చీర [illegible] భర్త. పాపం! [illegible] మనసుపడి తీసుకుంటే [illegible] గటం సహజమే! [illegible] అందంగా వుం[illegible] ప్రాయం మనకెందుకు? అయినా నీకు తెలీదు, అది కట్టుకుంటే అందంగా వుంటావని బతిమాలుతాడట. కాని చిత్రకారుడుగదా, ఆయన అటువంటి చీర ఏరి తేవటం విచారించవలసిన విషయమే.

మాడినాగానీ సంభాషించినాగానీ కనిపించని ఆకర్షణ ఏదో బాగా పరిచయమయిన తిరువాత కనిపిస్తుంది. అలాగే దూరాన్నించి చూచి చాలా అందంగా వున్నారనుకుని దగ్గరకు వెళ్ళినతరువాత నిరుత్సాహం పడిపోతుంటారు కొందరు. ఒకసారి నలుగురు పురుషులు వర్సింగు హోముకి వెళ్లారుట. డాక్టరుగారు ఎవరితోనో మాట్లాడుతున్నారు. సంభాషణలమధ్య నవ్వు వినపడుతోంది. ఎవరిదో స్త్రీ కంఠం చాలా బాగుందిట. ఆమె పాదాలు మటుకు పక్క గదిలో కూర్చున్న వీరికి కనబడ్డాయి సిల్కుచీర కుచ్చెళ్లు అందంగా పారాడుతున్నా ఆ పాదాలు ఎవరో శిల్పి చెక్కినట్టున్నాయి. అంత అందమయిన పాదాలూ, పాదాలకు ఎఱ్ఱని ముఖమల్ చెప్పులూ, గులాబీరంగు చీరా పెక్కికలర్ సినిమాలా గున్నందువల్ల అన్నైపునుండి దృష్టి మరల్పకుండా, పనులు మరిచిపోయి నలుగురూ అలాగే కూర్చుండిపోయారు. పాదాలే అంత అందంగా వున్నాయి, యిక ముఖం ఎంత అందంగా వుంటుందో అని ఊహించుకుంటూ, అరగంటపైగా ఆమెతో సంభాషిస్తున్నందుకు డాక్టరుమీద ఈర్ష్య పడ్డారుటకూడా. 'వెళ్లొస్తా'నంటూ ఆమె బయటకిరాగానే ఒక్కసారి నలుగురూ తలలెత్తి కుతూహలంవైపు చూశారు. అబ్బ! ఏమని వర్ణించగలరు! లావుపాటి శరీరం, కళ్ళకి దళసరి అద్దాలూ, ఎత్తుపళ్ళూ, తలమీద చిన్నముడీ, పాతికసంవత్సరములు పయిబడ్డ ఆమెనుచూసి స్నేహితులు నలుగురూ నిర్ఘాంతపోయారుట.

సౌందర్యమనేది ఒక్క రూపంమీదే ఆధారపడుతుందనుకోవటం పొరబాటు ఆకర్షణకీ సౌందర్యానికీ ఎంతో తేడా వుంది కొందరు వ్యక్తులు నవ్వితే ఎంతో హాయిగా వుంటుంది. కొందరు మాట్లాడుతుంటే అపకుండా అలాగే మాట్లాడుతే బాగుండునని పిస్తుంది. నడిచే తీరులోనూ, మాట్లాడే విధానంలోనూ, నడతలోనూ కొన్ని ప్రత్యేక లక్షణాలతో ఆకర్షిస్తారు కొందరు. కొస్తంత కులాసాగా ఖబుర్లు చెప్పేవారు, నవ్వుతూవుండే స్వభావం గలవారు మనల్ని ఎక్కువగా ఆకర్షిస్తారు. జీవితంమీద రోత గలిగినట్టు, అతివిచారంగానో లేక విసుగ్గానో ముఖం పెట్టేవాళ్లని చూస్తే, మనకి కొంత జబ్బు చెయ్యకపోయినా, వారితో ఎక్కువసేపు భరించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఎన్ని మానసిక ఆందోళనలున్నా, వాటిని తమవెం[illegible]

వ్యక్తుల్ని చూస్తేమటుకు, మనకూ జీవితం విచారంతో నిండినట్లు అనిపిస్తుంది. ప్రశాంతంగావుండే ముఖాలు మనలో కొంత సుఖానుభూతిని కలిగిస్తాయి.

ఈ సందర్భంలో ఒకావిడ నాకెప్పుడూ జ్ఞాపకంవస్తుంది. మనిషి బొత్తిగా అందవికారమయినది కాకపోయినా, అందవికారంగానే అలంకరించుకుంటుంది. ఆమె ఎక్కడికి వెళ్ళినా చుట్టూ ఓ పెద్దగుంపు చేరతారు ఆమె మాట్లాడుతుంటే అక్కడ నుంచి కదల బుద్ధిపుట్టదు. విచారంగా వున్నవాళ్ళని గూడా క్షణంలో నవ్వించే, ఆకర్షించే ఏదో ప్రత్యేకశక్తివుంది ఆమెలో. ఇటువంటి స్త్రీలలో మనం అంత సులభంగా మరిచిపోలేని ఆకర్షణ ఏదో వుంటుంది.

సామాన్యంగావుండే కొందరు స్త్రీలు తాము అందంగా లేమని అనుకుంటూ వుంటారు వ్యక్తియొక్క రూపురేఖలను వ్యక్తియొక్క గుణగణాలనుండి వేరుపరచలేక ఈ విధంగా పొరబడుతూంటారు. ఆకర్షణయొక్క విలువ ఒక్క చక్కదనంలోనే లేదు. ఒక వ్యక్తి మాటలూ చేతలూ, అలంకరించుకొనే విధానం మనల్ని ఎక్కువ రంజింపజేస్తాయి. ఫలానా ఆమె అనగానే, ఓహో ఆవిడా అని చటుక్కున స్ఫురణకువచ్చే విశిష్టమైన వ్యక్తిత్వం పూర్తిగా సౌందర్యంలోనే ఉండదు. అందుకనే సౌందర్యవతులయిన అనేక మంది యువతులు మనల్ని ఎక్కువ రంజింపజేయలేకపోతున్నారు వారిని మనం ఎక్కువగా గుర్తుంచుకోలేకుండా వున్నాం.

వ్యక్తిత్వం వ్యక్తిలోని కొన్ని విశిష్టమైన లక్షణాలమీద ఆధారపడివుంటుంది. వ్యక్తియొక్క ప్రత్యేకత, ఆ వ్యక్తియొక్క వేషభాషల తీరులోనుండే తొంగి చూస్తూ వుంటుంది ప్రతి వ్యక్తికీ కొన్ని ప్రత్యేక ధాయలంటూ వుంటాయి వాటిని మంచి అభిరుచులతోనూ, సంస్కారంతోనూ పెంపొందించి, అవి ప్రత్యేక స్వభావసిద్ధంగా చేసుకోవటానికి ప్రయత్నించాలి. ఈ సందర్భంలో వ్యక్తిత్వమూ, సౌందర్యమూ గల శ్రీమతి విజయలక్ష్మి పండిట్ వంటి స్త్రీనే గాక, సరోజనీ నాయుడు వంటి స్త్రీని జ్ఞప్తికి తెచ్చుకుంటే, వ్యక్తిలోని సౌందర్యం రూపంమీద మాత్రమే ఎలా ఆధారపడి ఉండదో అర్థమవుతుంది. ప్రతి వ్యక్తియొక్క సంస్కారాన్ని వారి వేషభాషలు కొంతవరకూ తెలుపుతాయి. వేషంమాట ఏమయినా చక్కగా సంభాషించే నేర్పు స్త్రీలలో చాలామటుకు ఆకర్షణని తేగలదని

స్త్రీలు-ఉద్యోగాలు

డా॥ వారణాసి యశోదాదేవి,

యం. ఏ.; డి. లిట్

మద్రాసు

విద్య, వృత్తి, వుద్యోగము - యివి పూర్వకాలమునుంచి పురుషుని సొమ్ము; అవి వారికి సహజము. స్వతః పురుషుడు బలశాలి యగుటచే కష్టమైన పనులు నిర్వహిస్తూ వచ్చాడు. సంసారభారము వాని బాధ్యత. కాబట్టి వృత్తి లేక విద్య, తర్వాత వుద్యోగము పురుషుని జీవితములో ముఖ్య సోపానము. "వుద్యోగము పురుష లక్షణము" అన్నారు పెద్దలు. బయట పనులు చక్కగ చక్కపరుచుకొనక, గృహకృత్యములలో అనావశ్యముగ కల్పించుకొను పురుషులను నీరసముతో "ఆడంగి లేకి అబ్బన్న" అంటారు. అంతేకాక "స్త్రీ తిరిగి చెడితే, పురుషుడు తిరుగక చెడు" నన్నది లోకవాడుక. ఎంత ప్రయత్నించినా స్త్రీతో సమానముగ పురుషుడు గృహకృత్యములు నిర్వహింప నసమర్థుడు. కాబట్టే "ఆడదాని చేతిలో అర్థము, మగవాని చేతిలో బిడ్డలు బ్రతుకరు" అన్న సామెత వచ్చియుండును.

స్త్రీ సహజముగ కోమలి; అబల; ముగ్ధ. కళలు ఆమె సొమ్ము. పసితనమునుండి బాలురు తండ్రిని అనుసరింతురు; తండ్రి వారి దైవము, ఆదర్శము. బాలికలు తల్లి చేయు పనుల జేయజూతురు; తల్లి మాతృదేవత; గృహిణి. యిల్లు చక్క బెట్టుకొనుట స్త్రీ ముఖ్య కార్యము. పురుషులకువలె బయటకు పంపి ధనము వెచ్చించి స్త్రీలకు విద్య నేర్పించుట సామాన్య కుటుంబములలో చాల తక్కువ. "ఎందుకమ్మా! ఆడపిల్లల చదువు: వుద్యోగాలు చేస్తారా! వూళ్లేలుతారా!" అంటారు. స్త్రీలు చపలచిత్తలు. కనపడ్డ వస్తువల్లా కొనెదరను భావముతో వారికి సాధారణముగ డబ్బు పెత్తనము అప్పజెప్పుటకు యిష్టపడరు పురుషులు. స్త్రీలు పదిమందిలో తిరిగితే గౌరవ మర్యాదలకు భంగమను భావము సాధారణముగ కలదు. వీటన్నిటినిబట్టి స్త్రీలకు వుద్యోగములు అనవసరమని మన పూర్వీకుల అభిప్రాయము.

కాని యే కాలములోను మన దేశములో విద్యావతులు, కవయిత్రులు, వీరవనితలు, వకవులున్నారు. కాని సామాన్య జనులలో స్త్రీ విద్య తక్కువ. ఇప్పటికీ మన దేశంలో అక్షరాస్యులైన స్త్రీలు 100 కి 9 పైగా లేరు. ఇటీవలి లెక్కలను బట్టి చూస్తే ప్రవేశ పరీక్షలో మద్రాసు రాష్ట్రములో నుత్తీర్ణులైన స్త్రీలు 14000 కి పట్టభద్రులు నాల్గు వేలు మాత్రమే. విద్యావతియైన ప్రతి స్త్రీ వుద్యోగము చేయవలెనని కాదు. విద్య స్త్రీకి ఆభరణము; ఆయుధము. అవసరమైతే వుపయోగించుకొనవచ్చును. అన్ని సౌకర్యములుగల స్త్రీ సరదాకి వుద్యోగము చేయవచ్చును. తల్లిదండ్రుల చాటు బాలికలు విద్యానంతరము తమ అభిరుచులకు తగిన ఉద్యోగములు చేయవచ్చును.

కాని వివాహానంతరము, సంసారముల చక్కబెట్టుకొనుచు ఉద్యోగములు చేయుట స్త్రీలకు సులభసాధ్యము గాదు. అత్తవారింటివారిని, బంధుమిత్రులను తృప్తిపర్చి బయటకువెళ్ళి ఉద్యోగము నిర్వహించుకొనుట అందరకు వీలుపడదు. కాకపోతే ఒంటరి, చిన్న సంసారములలో దంపతులు యింటిపనులు సమర్థించుకొని, వుద్యోగములు చేసి, తిరిగి గృహకృత్యములు ఐకమత్యముతో, సామరస్యముతో సమర్థించుకొనుట గలదు. మళ్లా పిల్లలతో ఉద్యోగాలు నిల్పుకొనుట కష్టసాధ్యమే.

తమతమ సౌకర్యములనుబట్టి స్త్రీలు అనేక విద్యావ్యాసంగములలో పాల్గొనవచ్చును. ప్రస్తుతం అన్ని విధములైన ఉద్యోగములలోను స్త్రీలు పురుషులతో సమానముగ పనిచేస్తున్నారు; మెప్పులు, ప్రజాదరణ పొందుచున్నారు. ★

యస్. యస్. ప్రసూన

వుయ్యూరు

స్త్రీలు వుద్యోగాలు చెయ్యవచ్చునా కూడదా అనే ప్రశ్నకు జవాబు చెప్పటం కష్టమే. అసలు ఈ సమస్యను చాలా విశాల దృక్పథంతో ఆలోచించాలి. ముందు పురుషుల దృక్పథంలో మార్పు రావాలి. పురుషుడు తనెంత నాగరికుడనని బడాయి చెప్పుకున్నా అవన్నీ పైపైగాని, ఇంట్లో భార్యదగ్గరికి వచ్చేసరికి రాతియుగపు భావాలతోనే ప్రవర్తిస్తాడు. చదువుకున్న స్త్రీలని చేసుకున్నవారిలో, భార్యల్ని తమతోబాటు గౌరవిస్తూ, వాళ్ళకీ ఒక వ్యక్తిత్వమంటూ వుంటుందని తెలుసుకునేవాళ్లు ఎంతమంది వున్నారు? ఈ ఇరవయ్యో శతాబ్దిలో కూడా స్కూలుఫైనల్ పాసైన అమ్మాయి వున్నదంటే, 'ఎందుకమ్మా ఈ చదువులు, మొగుణ్ణి మొట్టికాయలుకొట్టి వీధులంబడి తిరగటానికేనా' అని అడిగేవాళ్ళు వున్నారంటే, నిజంగా మనం ఒక్క అడుగయినా ముందుకు పురోగమించామా, అనిపిస్తుంది.

ఉద్యోగంచేసే స్త్రీలకి అహంకారం ఎక్కువ అవుతుంది అనే ఆరోపణకూడా వున్నది. కానీ నిజమాలోచిస్తే, ఇటువంటి భావం వాళ్ళకి కలగటానికి వాళ్ళు పెరిగే వాతావరణమే ముమ్మాటికీ కారణం. ఎందుకంటే, "మేము మగవాళ్ళం కాబట్టి ఎంతో బాధ్యతలతో కూడిన ఉద్యోగాలు చేస్తున్నాం. మీరు ఆడవాళ్ళు, అబలలు. మీరు ఎందుకూ పనికిరారు ఒక్క వంటకి తప్ప" అని మాటిమాటికీ మగవాళ్లు వాళ్ళని కించపరుస్తూ వుంటారు కనక, అమాయకులైతే నిజమే కాబోలు అనుకుంటారు. కాస్త తెలివిగలవాళ్లయితే, "మీ గొప్ప ఏమిటి? ఆమాత్రం మేమూ చెయ్యగలం. ఏదీ ఒక్కసారి అవకాశమివ్వండి మేమెల్లా నిర్వహిస్తామో" అని సవాలు చేస్తారు.

అటువంటివాళ్లే కనక ఉద్యోగం చెయ్యటంతటస్థిస్తే, "మేమూ మగవాళ్ళతోపాటు ఉద్యోగం చేస్తున్నాం. మాతక్కువేమిటి" అని అదోవిధమైన గర్వం కలుగుతుంది. కానీ, స్త్రీలు ఉద్యోగాలు చెయ్యడం అలవాటైనప్పుడు ఇల్లాటి భావానికి చోటెక్కడుంటుంది?

సాధారణంగా మధ్యతరగతి కుటుంబాలలో వ్యక్తుల సంఖ్య ఎక్కువగా వుంటుంది. మరి పదిమందివున్న సంసారంలో సంపాదించేవాడు ఒక్కడే అయితే ఆ సంసారంపరిస్థితి ఎంత శోచనీయంగా వుంటుందో వూహించుకోవాల్సిందే. అందుకని భార్యకూడా వుద్యోగం చేసి కాస్త సంపాదిస్తే వేన్నీళ్లకి చన్నీళ్లు తోడయినట్టుగా కాస్త తెరిపిగా ఉంటుంది.

తరవాత - ఉద్యోగం చెయ్యాలి అనుకునేసరికి ఎన్నో సమస్యలు వస్తాయి. వాటన్నిటినీ తెలివిగా పరిష్కరించుకోవాలి. బంధువులు ఏమనుకుంటారో అనే భయం పెట్టుకోకూడదు. ఎవరయినా, ఏమయినా అపవాదు వేద్దామని ప్రయత్నించేవాళ్ళ మాటలను తట్టుకుని, నిభాయించుకునే మనస్తత్వం అలవర్చుకోవటం ఎంతయినా శ్రేయస్కరం. పెద్దవాళ్లు ఎవరూ లేక, పిల్లల సంరక్షణ ఆయాలమీద వదలటం ఇష్టంలేనివారు ఏమి చెయ్యాలి అని అడగవచ్చు. అటువంటివారు ప్రత్యేకం ఉద్యోగమే చేసి భర్తకి సాయపడకపోయినా, ఇంట్లోవుండే ఆర్థికంగా కలిసివచ్చేపనులు చేసుకోవటం మంచిది. మనకు కావలసిన కోరలు మనమే

★ స్త్రీలు - ఉద్యోగాలు ★

మనదొడ్లో పండించుకోవచ్చు; ఇల్లాంటివి మాకు తెలియవా అనవచ్చు. కానీ, నిజం చెప్తే తోటిసోదరీమణులకి కోపం వస్తుంది గానీ, మనమధ్యతరగతి స్త్రీలు రోజంతా ఎంత సోమరితనంగా గడుపుతారు! ఎంతో అమూల్యమయిన కాలాన్ని అర్థంలేని బాతాఖానీలతోనూ, ఎత్తిపొడుపులు, తగవులు అనవసరమయిన పన్లతోనూ వృధాచేసేకంటే అవసరమయిన పన్లకి ఉపయోగించుకోటం తప్పా? అమధ్య మా బంధువుల్లో ఒకరు ఇల్లా అన్నారు "ఎవరింటిపనులు వారు ఏల చేసుకోరాదూ. ఆడాళ్లు పూనుకుంటే అదృష్టమేల రాదూ" అని. మరి ఇందులో కొంతయినా నిజం లేదంటారా? దొడ్లో పాదులు పెంచడంవల్ల ఆర్థికంగా కలిసి రావటమే గాక, తాజాకూరలు తినటంవల్ల, అవి పండించటానికి మనం పడే శ్రమవలన మనకి ఎంతో ఆరోగ్యం చేకూరుతుంది.

తరవాత రోజుకి అధమం రెండుగంట లయినా నూలు వడకటం నేర్చుకుంటే ఎంతో ప్రయోజనం వుంటుంది దీన్ని గురించి విపులీకరించవలసిన పని లేదు, అందరికీ తెలుసు. పోతే మనవి, మనపిల్లలవి బటలు మనమే కుట్టుమిషన్ కొనుక్కొని కుట్టుకోవటం నేర్చుకోవాలి. దీనివలన డబ్బు, బట్టా కలిసిరావటమే గాక, ఎంతో మానసికమయిన సంతృప్తి కలుగుతుంది. ఇంకా ఓపికకలవారు ఏవైనా చేతిపన్లు నేర్చుకుని చేసుకోవచ్చు.

ఏది ఎల్లావున్నా సంసారానికి స్త్రీ పురుషులిద్దరూ ధనార్జనలో సమంగా పాటు పడాలి ఇద్దరు కష్టపడుతున్నప్పుడు ఇందులో ఎవరు గొప్ప అనే ప్రశ్నే వుదయించదు. ఒకరిని ఒకరు గౌరవించుకుంటూ సంసారాన్ని స్వర్గతుల్యం చేసుకోవాలి. ప్రతి సమస్యనీ ధైర్యంగా పరిష్కరించుకునే ఆత్మబలాన్ని చేకూర్చుకుని కాలంతో పాటు మనమూ మారుతూ పురోగమించాలి. లేక ఈ బుర్రన్నీ కౌగిత్రాలలోను, ఊపన్యాసాలలోనూ వుండి, చేతలుమాత్రం రెండు మూడు శతాబ్దాల వెనుకటివాళ్ళని అనుసరిస్తూ, బూజుపట్టిన భావాలతో మగ్గిపోయి నన్నాళ్ళూ మనజాతికి భవిష్యత్తే లేదు.

సుసర్ల సరస్వతి కటక్

ఈ శీర్షికతో క్రిందటి ఆంధ్ర వారపత్రికలో ఉషారాణిగారు రాసిన వ్యాసం చదివేను. కేవలం సమస్యలను యథాతథంగా

ష్కారమార్గాన్ని ఏ ఒక్కరి విమర్శకు గురి కాకుండా వ్రాయడముమాత్రము కొంచెము కష్టసాధ్యమే. అయితే, కొంత విశాల దృష్టితో చూస్తే అటువంటి సమస్యలకు పరిష్కారమార్గము లుండకపోవు.

సంసారము నిరాటంకముగా సాగించు కొంటూ, ఉద్యోగాలుచేసి ఆర్థికసమస్యలను సులువుగా పరిష్కరించుకొనుచున్న కొంతమంది ఆదర్శమహిళలు లేకపోలేరు. కానీ ఇందుకు పురుషుల సహకారము అత్యవసరము. పెండ్లి అయేవరకు ఎవరి ఇష్టానుసారమువారు చదువుకోనూవచ్చు; ఉద్యోగము చేయనూవచ్చు కానీ వివాహానంతరము భార్య ఉద్యోగం చెయ్యడాన్ని సహించే పురుషులసంఖ్య మాత్రము ఈనాటికి మన దేశములో అత్యల్పమనే చెప్పాలి. సాధారణంగా పెండ్లికిముందు విద్యావతి, ఆదర్శవంతురాలయిన భార్యకావాలని కబుర్లుచెప్పేమగవాళ్లు ఆ శుభముహూర్తము కాస్తా తీరిపోయేక ఆవిద్య, ఆ ఆదర్శము - అంతా తమ లొంగుబాటులోనే, నాల్గుగోడల మధ్యనే ఉండాలి గానీ, అది దాటితే, తమ ఆధిక్యతకేదో భంగం కలిగినట్లు మధనపడ్తారు. ఉద్యోగం మాట అటుంచి, తాను రాత్రి పదిగంటల వరకు క్లబ్బులు పేకాటలు, స్నేహితులతో గడిపి ఇంటకి వస్తున్నా, భార్య ఏదో ఒక రోజు ఎక్కడికైనా వెళ్ళి ఒక స్నేహితురాలితో ఒక గంట గడిపివస్తే, పైకి ఏమీ అనలేక, లోపల ఇముడ్చుకోలేక, కోరచూపులతోనే మింగివేసే పురుషులెందరు లేరు? అటువంటి భర్త మనోభీష్టానికి వ్యతిరేకంగా ఏపని చెయ్యడానికీ మన సాంప్రదాయము ఒప్పుదుకదా? అందువల్లనే ఈ విషయంలో పురుషుల సహకారం అవసరమని పేర్కొన్నాను.

సాధారణంగా, మధ్యతరగతి కుటుంబాలలో ఒక్క పురుషుని రాబడిలో కాలక్షేపము చెయ్యడం ఈ కాలంలో చాల కష్టంగానే ఉంది అటువంటప్పుడు, విద్యావతియైన స్త్రీ పురుషునితోబాటు ఆర్థిక సముపార్జనకు సహాయకారి కావడం ఎంత మాత్రము అనుచితముకాదు. అటువంటి పరిస్థితులలో మగవాడు తన భార్యను ఉద్యోగము చేయుటకు ఉత్సాహపరచడం సమంజసంగా ఉంటుంది. డబ్బుచాలక ప్రతీ నెల, వారిని వీరిని అప్పులకు చెయ్యి చాచి, చేసిన అప్పులు తీర్చలేక సతమత

కన్న, ఇటువంటి వారి జీవనము పదివుగా ఆనందదాయకంగా ఉంటుంది. ఉద్యోగంచేసినంతమాత్రాన భార్య తనకు అణకువగా ఉండదని, సత్ప్రవర్తనను తప్పుతుందని అపోహాలు కలిగించుకోనేకంటే, సుశీలఅయిన స్త్రీ ఉద్యోగం చేసినా, ఊళ్లేలినా, తనశీలాన్ని, తనభర్తయందు గౌరవాన్ని ఏనాడూ విడనాడదనే సత్యాన్ని గ్రహించి, తనతోటి మనిషిగా భావించి పురుషులు ఈ సమస్యను ఎదుర్కొన్ననాడే మధ్యతరగతి కుటుంబాలు చక్కబడతాయి.

ఇక స్త్రీ పురుషులిరువురూ, ఉద్యోగంచేస్తే సంసారం సాగించేదెవరని ప్రశ్న. కానీ ఏ ఉద్యోగ సద్యోగములు లేకనే, పిల్లల్ని, సంసారాన్ని, ఎక్కడి కక్కడ వొదిలేసి, పొరుగింటి పెత్తనాలకు, సినీమాలకు గంటలతరబడి తిరిగే కొందరు ఆడవాళ్లకు కలిగే అవకాశము, కుటుంబ శ్రేయస్సుకొరకు పాటుపడే ఇల్లాలికి ఎందుకు దొరకదు. అది అంత కష్టసాధ్యమైన సమస్యకాదు.

మావూరిలోనే నాకు తెల్సిన ఒకచిన్న కుటుంబమున్నది ఆయన యం. ఏ. పాసై ఆడిటరుగా ఉద్యోగంచేస్తున్నారు ఆమెను బి యే చదువుతుండగా వివాహము చేసుకున్నారు. బి యే పాసై ఆమె కాపరానికి వచ్చింది కానీ ఆయనకు తనభార్య తనవలె యం. ఏ చదవవలెనని, ఉద్యోగము చేయవలెననికోరిక. ఆమెకు అంతగా ఇష్టము లేకున్నా, ఆమెను ప్రోత్సాహపరచి - కాలేజీలో ప్రవేశపెట్టి యం. ఏ. చదివించేడు. ఆయన ఆసక్తికితోడు, ఆమె కూడా సంసారానికి ఎట్టిలోటుపాట్లు రానీయకుండానే ఎంతో కష్టపడి చదివి, ఫస్టుక్లాసులో యం. ఏ. పాసైంది. చదువైనతరువాత, ఆయనే ఆమెకు బగులు దరఖాస్తులు పంపేవాడు. ఆఖరుకు ఆమెకు ఉన్న ఊళ్లోనే 'లెక్చరర్' ఉద్యోగం దొరికింది. ఇప్పుడు వారికి ఆరుమాసముల బిడ్డ. ఉదయము లేచి బిడ్డ సంరక్షణ చూచుకొని వంటచేసి భర్త తనూ భోంచేసి, ఇంట్లోనే ఉంటున్న నౌఖరీమనిషికి బిడ్డను అప్పచెప్పి, పదిన్నరకు కాలేజీకి వెళ్లి సాయింత్రం నాలుగున్నరకు తిరిగి వస్తుంది. మరల గృహకృత్యములన్నీ స్వయముగా తానే నిర్వహించుకుంటుంది వారిని చూచి అందరూ ఎంతో ముచ్చటపడతారు పసిబిడ్డ సంరక్షణలో ఎలాటిలోటూ రావటం లేదు. తెలివి ఉపాయం తెలిసినవారికి ఇటువంటి సమస్యలు అడ్డురావు. ఇటు

చదువుకు సార్థకం

బి. ప్రేమలీల, బి.యస్‌సి.బి.యిడి.,
పెద్దాపురం

చదువుకొన్న యువతులు తమ చదువులను ఎలా సార్థకంచేసుకోగలరు? తమకూ, తమసంఘానికి - తమదేశానికి తమ చదువులనెలా వినియోగపరచగలరు? ఒకవిధంగా విద్యావంతురాలైన యువతి యొక్క విద్యా వికాసాలు సమాజాభ్యుదయానికి పునాదులనవచ్చు.

విద్యాలయాలలో విద్యపూర్తిఅయిన తరువాత ఆమె చేయవలసిన ముఖ్యమైనపని ఆత్మపరిశీలన. ఆమె తన భావిజీవితాన్ని చాలవరకు తీర్చి దిద్దుకోగలదు. ప్రతి యువతీ తనలోని ప్రతిభను, శక్తుల్ని - హద్దుల్ని - దృష్టిలో ఉంచుకున్నట్లయితే జీవితంలో తనకు నిర్దేశింపబడినకర్తవ్యాన్ని తేలిగ్గా నిర్వహించగలుగుతుంది. వ్యక్తిత్వమనేది అమూల్యమైన భూషణం. చదువుకొన్న ప్రతియువతీ నిరీక్షణతో ముందుకు పురోగమిస్తూ - అమూల్యమైన ఈ వరాన్ని పొందడానికి ప్రయత్నం చేయాలి.

సంఘంలో తానూ ఒకవ్యక్తిగా విద్యావతి అయిన యువతి ఏంచేయగలదు? ఆమె తన సంసారంలో కుమార్తెగా, భార్యగా, తల్లిగా తన బాధ్యతలను నెరవేర్చడంలో విజ్ఞానవికాసాలనువినియోగించుకోగలగాలి. హైస్కూళ్లలోనూ, కాలేజీలలోనూ చదువుకొంటున్న బాలికలు ఇంటిపనులు చేయడమనేది అవమానకరమైన విషయంగా భావించడం విచారించవలసిన సంగతి. మన ఇంటి పరిశుభ్రతనుగూర్చి, సదుపాయంగా గృహావసరాలను నెరవేర్చడంగురించి శ్రద్ధవహించడంలోగాని, మన ఇంటి పనులు మనం చేసుకోవడంలోగాని సిగ్గుపడవలసిన పనిలేదు. విద్యావతులైన స్త్రీలందరూ *Dignity of Labour* (పరిశ్రమలోగూడా పరువున్నదని) జ్ఞప్తిలో ఉంచుకోవాలి. చదువుకొన్నంతమాత్రాన ఆమె అప్పుడే ఆకాశంనుండి దిగివచ్చిన మిలమిలలాడే గంధర్వాంగన కాదు; అనుక్షణమూ ఇంటి పనుల్లో మునిగితేలే యంత్రమూ కాదు. భర్తకు ఆమె అన్నివిధాలా తోడునీడ. ఆభరణాలమీదా - విలువగల దుస్తులమీదా అలంకారాలమీదా వెర్రిమోజు పనికిరాదు. అలంకారంయొక్క అసలైన విలువతెలియనివారే అర్థంలేని మోజులకుపోయి, తీరనికోరికలతో జీవితాన్ని దుఃఖభాజనం చేసుకొంటారు. ఆడంబరంలేని జీవితం ఎంత సుఖప్రదమో జీవితంలో విలువ తెలిసినవారికే తెలుసు. స్త్రీ జీవితంలో మాతృస్థానం మహోన్నతమయినది. పిల్లలుపసితనాన్నుండి మంచి శిక్షణలో పెరగాలంటే తల్లులు విజ్ఞానవతులు ఆరోగ్యవతులై ఉండాలి.

ఇంక సంఘాభ్యుదయానికి చదువుకొన్న యువతి ఏంచేయగలదు? 1951 డిసెంబరు ఆంధ్రవిశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ఆరోగ్యశాఖామంత్రిణి అమృతకౌర్ పట్టభద్రులైన విద్యార్థినులను ఇలా హెచ్చరించారు. "విద్యా సంపూర్తి చేసిన ప్రతీ యువతీ కొంతకాలం ఏదైనా వివాహంసంగతి ఆలోచించాలి." ఇది నిజంగా ప్రతి యువతీ శ్రద్ధగా ఆలోచించవలసిన విషయం. డబ్బు సంపాదించవలసిన అవసరం ఉన్నా లేకపోయినా, చదువుకున్న ప్రతీ యువతీ తన కాళ్ళమీద తను నిలువబడగలిగే అంతస్తుకు రావాలి. ఈనాడు ఉపాధ్యాయినులకు, నర్సులకు - డాక్టర్లకు - దేశంలో ఎంతేనా అవసరముంది. 'స్వార్థానికి మించిన సేవ'—ఈ వాక్యాన్ని మనం గుర్తుంచుకున్నట్లయితే దేశాభ్యుదయానికిమనం ఎంతైనా తోడ్పడగలం. స్త్రీత్యాగానికీ, ప్రేమకీ నిదర్శనం. మానవ హృదయాలకు ఆమె ఆర్ద్రత, సౌమ్యము చేకూర్చి పెట్టగలదు.

ఈనాడు వనితలకు ఎన్నో సమస్యలున్నాయి. వీని పరిష్కారానికి క్రమాభ్యుదయానికి స్త్రీలు తమ వ్యక్తిత్వాలను కాపాడుకొని సమాజంలో వ్యక్తి వికాసానికి తోడ్పడాలి. ఉత్తమ పౌరులుగా స్త్రీలు దేశంకోసం పాటుపడాలి. ఈ విషయాలను రాబోయే కాలానికి ఆదర్శ వనితలుగా తయారయ్యే మన బాలికలకు పసితనాన్నుండి నేర్పుదాం. ఈ నిరీక్షణ- ఈ ఆత్మ పరిశీలన, ఈ త్యాగసంపత్తి రాబోయే వాళ్ల జీవితాల్లో ప్రతిఫలించేలా ఈనాడు మనం కృషిచేయాలి. ఒక్కక్షణం చదువుకొన్న ప్రతి యువతీ ఆలోచించాలి— "నేనూ - నా విద్య - దేశానికి ఎట్లా సహాయపడతాం," అని. ★

స్త్రీ పురుషులిరువురూ సర్కారు ఉద్యోగాల్లో ఉన్నపుడుకాని, మరియే యితర కంపెనీలలో ఉన్నసుసరే, ఇరువురను ఒకేచోట ఉంచుట, స్త్రీ గర్భవతియైనపుడు ప్రసవమునకు ముందు ప్రసవానంతరము విశ్రాంతికి తగినంతసెలవు ఇచ్చుట, స్త్రీలకు అనుకూలమైన ఉద్యోగములు, ప్రత్యేకముగా స్త్రీలకే విడిచిపెట్టుట లేక, కొన్ని స్థానములు ప్రత్యేకించుట ఇటువంటి సౌకర్యములు కొన్ని పని మన ప్రభుత్వం చేకూర్చడం కష్టంకాదు.

అనూరాధ,
ఆముదాలవలస.

క్రొత్తగా ప్రారంభించిన 'వనితాలోకం' అనే శీర్షికక్రింద అతిముఖ్యమైన విషయమునకు (స్త్రీలు - ఉద్యోగాలు) ప్రాధాన్యమివ్వడం గర్హనీయమైన విషయము. నేటి సాంఘిక జీవితములో నిరుద్యోగసమస్య అతివిషమంగా ఉన్నదను విషయం ఎల్లరకు విశదమే. ఇటువంటి క్లిష్టపరిస్థితులలో అధికసంఖ్యాకులగు స్త్రీలు, ముఖ్యముగా, ఉద్యోగములు చేయుచున్న భర్తల పోషణక్రింద నున్నవారు, పదవుల కొగబ్రాకుట నిరుద్యోగసమస్య మరింతవిషమించుటకు హేతువు కాగలదని వేరే చెప్పనవసరము లేదు. ప్రతీ భారతస్త్రీ విద్యాధికురాలుగావాలంటే ఎవ్వరూ కాదనలేరుగాని, పదవుల విషయములో అవివాహితకున్న అర్హత సంసారబాధ్యత గల స్త్రీలకుండదని

"మొగాళ్లకి ఈకల్బు పిచ్చ ఏమిటో నాకేమీ బోధపడడం లేదు పిన్నీ!"

"బోధ పడటానికేముంద మ్మా-కొందరు మొగాళ్లకి వుండటానికి యిళ్లు వుండవు; మరికొందరికి వున్న యిళ్ళల్లో వుండటానికి ఆస్కారంవుండదు. అంతే!"

అద్దం ముందు

అందరూ నావేపు ఎందుకలా చూస్తారు? ఏమిటి దొరుకుతుందనో వారికి - నావేపు అట్లా చూస్తే?

అయితే నేను నిజంగా అందంగా ఉన్నానన్నమాట!

అంత అందంగా వున్నానా? ఏమో మరి! నామట్టుకు నాకెలా తెలుస్తుంది!

మరి నేను అంత ఆకర్షవంతంగా ఉండడానికి కారణం? ముక్కా, చెవులా, కురులా, చెక్కిళ్ళా, కనులా?

కాదు - ముక్కు ఎంతమాత్రము కాదు పొడుగ్గావుంది - కొన సూదిగా.

మరి చెవులా? చెవులూ కాదు కురులా? అందరి ఆడవాళ్ళకున్నట్లే, నల్లగా పొడవుగా ఉన్నాయి. కురులన్నీ చేర్చి అల్లితే చక్కని జడ అవుతుంది.

పండ్లవరుస బయటకు కనుపించనంతవరకు బాగా నేవుంది. చెక్కిళ్లు నునుపుగా, ఎత్తుగ ఉన్నాయి. యౌవనం వచ్చాక ప్రతీ పడుచు తనూలతలో కలిగే మార్పుల్లో ఇదొకటి?

అయితే కన్నులలో ఏదో ఆకర్షణశక్తి వున్నది. పెద్దవిగా గుండ్రంగా చక్రాలులాగున్నాయి. సన్నటి కాటుక తీర్పు కన్నులకు వింత అందం కలుగజేస్తుంది కనుబొమ్మలు నల్లగ సన్నగ తీర్చిదిద్దినట్టున్నాయి

*　　*　　*

ఆమెలో ఒక చైతన్యం కలిగింది. రోజూ అద్దంముందు కూర్చుని ఆమె తను ఎంత అందంగా ఉన్నదీ పరిశీలించుకుంటుంది

"పిల్లలు పుట్టకముందు మా ఆవిడ అస్తమానం హార్మోనియం వాయిస్తుండేది. పిల్లలు పుట్టాక ఆవిడకు తీరిక లేకుండాపోయింది; హార్మోనియం మూలపడింది.

"కాబట్టి పిల్లలు పుట్టటంవల్ల వుండే వుపయోగాలలో అదీ ఒకటన్నమాట!"

సంబంధాలు వస్తున్నాయి. అంతా వస్తున్నారు. చూచి వెళుతున్నారు. కాని ఏ కారణాన్నో ఒక్క సంబంధం నిశ్చయం కావటంలేదు. ఆమెకు అనుమానం కలిగింది. ఏమి? తను అందంగా లేదనా!

ఈమాటు ఆమె కళ్లు ఎత్తిచూసింది, కాబోయే పెళ్లికుమారుని ముఖంలోకి ఆమె కళ్లు జ్యోతుల్లా ప్రకాశించాయి. పెళ్ళికుమారుని ముఖంలో తృప్తి గోచరించింది వచ్చినవారు పిల్లని నచ్చామన్నారు. అన్నీ సవ్యంగా జరిగిపోయాయి ఆమె అత్తవారింటికి వెళ్ళింది.

అత్తవారింటికి వచ్చినది మొదలు ఆమె ఇంకా శ్రద్ధవహిస్తూ వచ్చింది—సౌందర్య పోషణలో. పుట్టినింటినుంచి తెచ్చుకున్న టాయిలెట్ సామాను అయిపోయింది ఆఫీసుకు పోతున్న భర్తతో ఆమె అంది ఒకనాడు.

ఆరికిరేవుల రామధర్మారావు

"ఏమండి! ఒకమాట"

"ఏమిట'ని అతను వెనుదిరిగి ఆప్యాయంగా ఆమెవేపు చూశాడు.

"సాయంకాలం ఇంటికి తిరిగివచ్చేటప్పుడు ఒక పౌడరు డబ్బా తెస్తారా?"

"ఓస్! ఇంతేనా - అలాగే తెస్తాలే" అని అడుగు ముందుకు వేశాడు. ఆమెకు కొంచెం ధైర్యం చేకూరింది

"ఒక స్నోసీసాకూడ తెచ్చి పెట్టండి. నేను మా ఇంటినుండి తెచ్చుకున్నది అయిపోయింది" అని మెల్లగా నసిగింది

"అలాగేలే" అని అతను ముందుకు సాగిపోయాడు. సాయంకాలానికి ఆమె కోర్కె నెరవేరింది

పనులన్నీ చేసుకుని, గదిలో నిలువుటద్దం ముందు నిలబడింది. ఆ అద్దం అంటే ఆమెకు ఎంతో సరదా తనగదిలో చేర్చబడిన హంగుల్లో ఇదొకటి. ఆ ఇంటికి ఆ అద్దమూ ఆమే ఒకేసారి వచ్చినట్లు ఆమె మొదట్లో విన్నది. తన ప్రతిబింబం ఆ అద్దంలో చక్కగా కనుపిసుంది. అంగుళకాబోలు ఆమెకు అమితమైన ఆప్యాయం, ఆ అద్దమంటే.

*　　*　　*

"ఏమండి! ఈ అద్దం ఎంతకు కొన్నారండి" అని అడిగింది భర్తను కొత్తలో.

"ఏం! బాగుందా? మన పెళ్లిముందు కొన్నా. నీకోసమే."

"ఆ! నాకోసమా!" ఆమె ఎంతో మురిసిపోయింది రోజుకి రెండుసార్లయినా అద్దాన్ని గుడ్డతో తుడిచేది తుడిచినంతసేపూ తన ప్రతిబింబం చూసుకునేది.

*　　*　　*

చేతనయినంతవరకు ఆరాత్రి చక్కగ ముస్తాబయింది ఇరుగుపొరుగువారు, చూడవచ్చినవారు, అంతా ఆమె సలక్షణంగా వుందని అనడం వింది. కాని ఒక్కనాడూ భర్త ఆమాట అనలేదు. తను అందంగా వున్నానని భర్తచేత అనిపించుకోవాలనుకుంది. అంతా లోకులపొగడ్తలేనా! తన భర్తకు తను అందంగా కనుపించడములేదేమో! మరి తనని నచ్చినదే ఎలా చేసుకున్నారు? అయినా ఇటువంటి గొడవల్లో ఆయనకు పట్టింపు లేదేమో - ఇంటిపని, ఆఫీసు తప్పిస్తే.

అడుగులో అడుగు వేసుకుంటూ మెల్లగా భర్తను చేరింది. అతను నిద్రపోయి చాలసేపయింది. తట్టి లేపింది నిద్రభారంతో కళ్లెత్తి చూశాడు. ఆవలకు జరిగి మళ్ళీ నిద్రాదేవి ఒడిలో వాలిపోయాడు.

"ఏమండీ! అప్పుడే నిద్ర?"

జవాబులేదు

"ఏమండి మిమ్మల్నే."

"ఆ" అని ఇటు ఒత్తిగిల్లాడు.

"అంత నిద్రేమిటండి. ఊరు పొద్దుపోందే?"

"అవును నీకలాగే వుంటుంది" అని చిరాకుగా అన్నాడు. మూసిన కళ్లు విప్పలేదు. ఆమెకు ఆశాభంగమయింది ఆరాత్రి కలత నిద్రలో ఏమోమో పలవరించింది.

ఆరోజు పనిలో పొరపాటు జరిగింది. "అదేమిటమ్మా, అత్తింటి కోడలవు. అలా చేయవచ్చా!" అన్నారు అత్తగారు. సమాధానం—అత్తగారి కళ్ళల్లోకి కోపంగా చూసింది ఆమె "ఆ! ఎలాగయితే నేం, సంపాదించేవులే రెండు కళ్ళు—చెంపకు చేరజేసి. గుడ్లెక్కపెట్టి కొట్టవచ్చేలా [illegible]" అని [illegible]

అత్తగారు. ఆమె అవమానంతో క్రుంగిపోయింది. రెండు చేతులతో కండ్లు మూసుకుని వచ్చి గదిలో అద్దంముందు చతికిలబడిపోయింది. నిజంగా తన కనుగుడ్లు ఎక్కివచ్చాయా? కళ్ళువిప్పి ఒక్కసారి చూసుకుంది. ముఖానికి కళ కళ్ళే అనుకుంది ఒకనాడు. ఆ కళ్లే ఈనాడు గుడ్లగూబ కళ్ళయాయా?

*　　　*　　　*

"ఏమండీ! వచ్చినప్పటికన్న మీకోడలు చాల చిక్కిపోయింది. కారణం ఏమిటి" అని ఇరుగు పొరుగువారంతా అడిగారు అత్తగార్ని. తను విందీ మాటలు చాటుగా. ఊరిలోవారి కెందుకో తన ఊసు - ఇంట్లోవారికి లేనప్పుడు. అవును - చాల చిక్కిపోయింది తను. నునుపైన బుగ్గలు ఇప్పుడు పాలిపోయాయి. కళ్ళు లోతుగా పీక్కుపోయాయి. ఆమెకు చాల కోపంవచ్చింది.

తనపై తాను శ్రద్ధతీసుకోవడం మానివేసింది. భర్తను తప్పించుకు తిరగడం మొదలు పెట్టింది. గదిలో నిలువుటద్దంమీద పెద్ద గుడ్డ కప్పింది. అది అచ్చట ఉండడము ఆమె కెంతో, ఏదో చెప్పరాని బాధగా వుంది. భర్తతో అంది ఒకనాడు-"ఏమండి ఈ అద్దం ఈ గదిలోంచి తీసివేస్తే?

"ఏం!" అని అమాయకంగా అడిగాడు అతను.

"అబ్బే-అది అక్కడ ఉండడం బాగు లేదు మరే గదిలోకైనా మార్పించండి."

"ఇంక ఎక్కడ పెట్టడం? ఎక్కడా బాగాలేందే. ఇంతకి అది నిన్నేం చేసిందని?"

ఆమె మాట్లాడలేదు.

ఆవేళ అతను ఆఫీసునుంచి ముందుగా వచ్చాడు. చాల హుషారుగా ఉన్నాడు. ఆమెను చాల ప్రేమతో దగ్గరకు చేరదీసుకున్నాడు. "ఇవాళ సినీమాకు వెళదాం వస్తావా!"

ఆమె జవాబు చెప్పలేదు. కొంచెం దూరంగా తొలగిపోయింది.

"మూడు టైము అవుతూంది. తొందరగా తెములు" అంటూ పెరట్లోకి దారి తీశాడు. శూన్యంలోకి చూస్తూ ఆమె అలా అక్కడే నిలుచుండిపోయింది, అతను తిరిగి వచ్చేవరకు.

"ఇంకా తెమలలేదూ?" అన్నాడతను.

"నేనురాను. మీ రొక్కరే వెళ్ళండి" అంది.

"చా! అదేమిటి! ఇద్దరం కలిసి వెళదాము పద"

"ఊహు!" అంది ఆమె బెట్టుసరిగా.

"వంట్లో బాగులేదా? అవును అమ్మ అంటూంది, ఈమధ్య నీ వంట్లో బాగుండడము లేదని. చాలచిక్కిపోయావు కూడ... సరేలే - ఆ సంగతి తరువాత ఆలోచిద్దాము. టైము అవుతూంది. నీవు రావన్నమాట. నే వెళుతున్నాను."

ఆమెలో తుఫాను చెలరేగింది. "ఇన్ని దినాలకు తెలిసివచ్చింది కాబోలు, నే చిక్కిపోయానని - కాదు నా అందంలో మార్పు వచ్చిందని - అదీ అమ్మ చెప్పగా." అనుకుంది బాధగా.

రోజులు గడుస్తున్న కొలదీ ఆమెకు బాధగా ఉంటూంది. అతనిలో చలనం లేదు. గదిలో అడుగుపెట్టింది మూలనున్న నిలువుటద్దం ఆమెకు కన్పించింది. ఆ అద్దం ఆమెకు ఒక శత్రువై కూర్చుంది. దానిపైనున్న గుడ్డతీసే ధైర్యము ఆమెలో లేదు.

ఎదురుగుండా టేబిలుపై నున్న చిన్న అద్దములో తన ప్రతిబింబం కన్పించి మాయమయింది. ధైర్యంతో ఒక్కసారి ఆమె ఆ అద్దాన్ని తన చేతుల్లోకి తీసుకుంది.

చేతులు వణికాయి. వేళ్లు పట్టుతప్పాయి. అద్దం నేలమీద పడి ముక్కముక్కలయి పోయింది. ముక్కలన్నీ పోగుచేసి మటుమాయమయిన తన ముఖాన్నొక్కసారి అందులో చూసుకుంది.

"ఎందు కలా బాధపడిపోతున్నావు" అని ప్రతిబింబం అడిగినట్లయింది. ఆమె త్రుళ్ళిపడింది.

నావల్ల పొరపాటు ఏమైనా జరిగిందనా? - లేదే - మరి? - వారివలన తప్పిందనా? - ఊహూ! - ఆయనకంటె అందంగా ఉన్నాననికదూ? నా సౌందర్యాన్ని ఆయన సరిగ్గా పోషించలేదనికదూ? - అంతా అన్నారు అందంగా ఉన్నానని. అందుకే కదా ఇంత గర్వం? - నాకంటె ఎంతమంది అందంగా లేరు ఈ లోకంలో? - ఇంతకీ, ఆయన ఎంత చక్కగా ఉన్నారో చూశానా - లేదు! కాదు పోశాను. కాని నా బాహ్యసౌందర్యం అహంకారంలో మునిగి తేలిపోయాను. ఆయనకు పీటియందు పట్టింపులేదని తెలుసుకుని బాధపడ్డాను. ఆయన నా అందాన్ని మెచ్చుకోలేరు. నిజమే. కాని ఆయనకు కావలసింది అది కాదేమో - అందరి భార్యాభర్తల నిత్యజీవితాల్లో దీనికి అంతగా స్థానంలేదు కాబోలు. శాశ్వతమైన ఆనందాన్ని చేకూర్చే ఆత్మసౌందర్యాన్ని కాపాడుకోవాలి. అదే చిరస్థాయిగా ఉంటేది. అదే అతను పూజించగలడేమో! మనోవికాసం పొందాలి. ఇప్పటికైనా తెలుసుకోవడం మంచిది.

అద్దం పెంకులన్నీ చెదరిపోయాయి. ఆమె ప్రతిబింబం మాయమయింది.

"అరె అద్దం బద్దలయిపోయిందే! ఎలా పోయింది" - అంటూ అతను గదిలో అడుగుపెట్టాడు. ఆమె కీ మాటలేవీ వినిపించలేదు.

"ఏమండి ఒక్క మాట అడుగుతా; చెప్తారా."

"ఓ! దానికేం పదిమాటలడుగు."

"అదికాదండీ... నే నెలాగున్నానండీ మీకంటికి...... నేను అందంగా ఉన్నాననేనా, మీ వుద్దేశం?"

"ఊ!... లేకేం! ప్రొద్దాసిలాగున్నావే. ఇన్నాళ్ళు నీ అందమే కొరుక్కుతింటున్నా ననుకున్నావా?" అన్నాడతను.

ఆమె ఒక్క గంతులో వెళ్ళి నిలువుటద్దంమీద గుడ్డ తొలగించి చూసింది. ఆమె కళ్లు జ్యోతుల్లా ప్రకాశిస్తున్నాయి. అతను ఆమె వెనకాలే నిలుచుని చిరునవ్వు నవ్వుతున్నాడు. ★

మతిమరుపు ప్రొఫెసరుగారు ఒకరోజున భార్యాబిడ్డలతో కలిసి ఆవూళ్లోనే మరొకపేటలో వున్న బంధువులయింట్లో బస చేశారు. ఆ రాత్రి వున్నట్లుండి జడివాన కురవటం ఆరంభించింది.

ఒక రాత్రివేళ ఎవరో లేచి చూస్తే ఆరుబయట పడుకొన్న ప్రొఫెసరుగారు మంచంమీద కనిపించలేదు. ఆయన ఏమైపోయాడోనని యింటిల్లిపాదీ నాలుగుమూలలా వెతికారు. ఆయన ఎక్కడా కనుపించలేదు. అందరూ కంగారుపడిపోయారు.

తన యింటికి వెళ్ళి గంట గంటన్నరసేపు గడచాక బాగా తడిసిన ప్రొఫెసరుగారు గొడుగు వేసుకువచ్చి గేటుతీసి, తన మంచం తలాపి కట్టకి గొడుగు కట్టేసి కళ్లుమూసుకు పడుకున్నాడు.

బొమ్మరిల్లు

నేస్తాలు

వేజండ్ల సాంబశివరావు

నింగిలోన కోటివేలు మిణుగురులు
నింగినడుమ చక్కని ఆజాబిలి
సరిసరి నేస్తాలు
సిరిసిరి నేస్తాలు-
పచ్చని పచ్చికబయళ్ల సొంపులు
అచ్చట ముచ్చటలాడే రైతులు
సరిసరి నేస్తాలు
సిరిసిరి నేస్తాలు-
జలజలమని పిల్లకాల్వ పరుగులు
గలగలమని పిల్లగాలి కుదుపులు
సరిసరి నేస్తాలు
సిరిసిరి నేస్తాలు-

కలకలమని కలువపూల నవ్వులు
మిలమిలమని మంచునీటి చినుకులు
సరిసరి నేస్తాలు
సిరిసిరి నేస్తాలు-
ఏటి అలల నాట్యమాడు నావలు
నాట్యగతికి పదము పాడు నావికులు
సరిసరి నేస్తాలు
సిరిసిరి నేస్తాలు-
గూటిలోన తల్లిచాటుపిట్టలు
ఇంటిలోన తల్లిఒడిలో పాపలు
సరిసరి నేస్తాలు
సిరిసిరి నేస్తాలు.

గేయ చౌర్యం

9-6-54 నాటి వారపత్రికలో బొమ్మరిల్లు శీర్షికలో సెమలికంటి భారతలక్ష్మి గారిపేర ప్రకటించబడిన "చక్కని ఓ చీమలార!" అనే గేయంయొక్క అసలు గ్రంథకర్త పాట్లపల్లి రామారావుగారనిన్నీ, అది "ఉదయఘంటలు" అను పుస్తకములో ఇదివరకే ప్రకటింపబడినదనిన్నీ కొందరు పాఠకులు మాదృష్టికి తెచ్చినారు. అచ్చులో పేరు చూసుకొని సంతోషిద్దామనే ఉబలాటంతో కొందరు రచయితలు ఇలాంటి గ్రంథచౌర్యాలకుదిగి, తమ్ముతాము న్యూనపరచుకుంటూ పత్రికలకూ, పాఠకులకూ హాని కలుగజేస్తున్నారు; అసలు రచయితలకు అన్యాయం చేస్తున్నారు. ఈ దురభ్యాసంవల్ల ఎవరికీ ప్రయోజనం లేకపోగా నష్టం ఉందని, కనుక దానిని విడనాడవలసిందని వారికి మా మనవి.

—సంపాదకుడు.

శ్రీరంగదేవాలయం ఉత్తరద్వారం

శ్రీరంగంలో వైకుంఠఏకాదశినాడు "ఉత్తర ద్వారదర్శనం చేసిన వారికి వైకుంఠం ప్రాప్తిస్తుందని వైష్ణవప్రముఖుల నమ్మకం.

దేని ప్రాధాన్యం దానికే! వైకుంఠేకాదశి ప్రాధాన్యం బహుస్వల్పం: ఆనాడు శ్రీమహావిష్ణువు లక్ష్మీసమేతంగా, శంఖచక్రగదాధరుడై ఉత్తరద్వారం గుండా లోనికి వస్తాడట! అందుకానాడు ఆద్వార దర్శనం చేస్తే వైకుంఠంలోని ఉత్తర ద్వారం వీరికోరకు శాశ్వతంగా తెరచి వుంచుతారు.

ఇక ఉత్తర ద్వారం వైష్ణవోత్తములందరకూ అతిముఖ్యం! దానికొక చిన్న ఐతిహ్యముంది;

పూర్వం శ్రీరంగపట్టణాన్నేలే మహారాజు గొప్పవైష్ణవుడు. ఆయన నిత్యనైవేద్య దీపారాధనలకు నానావిధ మహోత్సవాలకు అయ్యే ఖర్చంతా తనే భరించేవాడు. దానికిగాను ఏటేటా కొన్నిలక్షల రూపాయలు ప్రజాధనం వినియోగించబడేది.

ఒక సంవత్సరం వైష్ణవోత్తములు శ్రీరంగనికి షోడశకళలు ఆవాహనం చెయ్యడానికిగాను ఒక జన్నం సంకల్పించారు. దానికయ్యేఖర్చు భరించడానికి మహారాజు అంగీకరించాడు. తక్షణమే యజ్ఞం ప్రారంభమయింది.

దిగ్విజయంగా ఆ యజ్ఞం పరిసమాప్తమయే దినాన మహారాజు షోడశకళావాహన చూడగోరేడు. దీనికి వైష్ణవోత్తములు ప్రథమాన అంగీకరించకపోయినా వార్షికాలు పూర్తిగా నిలచిపోతాయనే భయంతో అంగీకరించారు.

కాని ఒక్కషరతు! మహారాజు కళావాహన మధ్యేమార్గంలో ఒకదడి కంతగుండా మాత్రమే చూడాలి! మహారాజంగీకరించాడు.

బి. కమల

ఒకచోట పూర్ణకుంభం రాశిగా పోశారు. దానిమీదనుండి ఒక్కొక్క కళేతీసి విగ్రహానికావాహనం చెయ్యసాగారు. కుంచె పట్టుకుని ఒకవైష్ణవోత్తముడు నడుస్తుంటే ఆకుంచె వెంటే కళవెళ్లేది. దీనినంతా చూచి మహారాజు అపరిమితంగా సంతోషించాడు.

పదిహేనుకళలు ఆవాహనం పూర్తికాగానే పదహారవకళ జీవకళ; దానితో కళావాహనం పూర్తి. మహారాజు కన్నులకరువు దీరేట్లు చూడాలనే ఆకాంక్షతో దడిబ్రద్దలుచేసి ఆకుంచె వెంటబడ్డాడు. ఆకుంచె, కుంభం మోసేవారు మహారాజు దీని నెక్కడ లాక్కుంటాడోనని భయపడి పరుగెత్త సాగారు. మహారాజు వానిని వెంబడించాడు. మహారాజు మరీ దగ్గరకాగానే కుంభపాత్ర మోయునతడు దానిని ఉత్తరద్వారము మీదకు విసిరాడు. అందువలన ఆ జీవకళ దానికావాహనమైనదని ప్రతీతి!

ఈనాటికీ ఆ ద్వారం గుండా వైకుంఠేకాదశి నాడు నడచినంత మంది ఏద్వారంగుండా నడవరు! ★

జనంతో కిటకిటలాడి పోతున్న ఒకవీధిలో ఎవరో ఒకాయన ఎడంచెయ్యి పైకి ఎత్తి పట్టుకొని నడిచిపోతున్నాడు. అతనికి సరిగ్గా మూడుగజాలు వెనగ్గా యింకొకాయన కూడా ఎడంచెయ్యి పైకి ఎత్తి పెట్టుకొని నడుస్తున్నాడు. వీళ్ళిద్దరూ ఎందుకు యిలా నడుస్తున్నారో ఎంతకీ బోధపడని మరొక వ్యక్తి, ముందు నడుస్తున్న మనిషిని ఆపి, "ఎందుకు అలా చెయ్యి ఎత్తిపెట్టుకుపోతున్నార"ని అడిగాడు.

ఆమనిషి కంగారు పడిపోయి చెయ్యివంక చూసుకొని, గిరుక్కున వెనక్కి తిరిగి "అయితే నిచ్చెన మరచిపోయే వచ్చేస్తున్నామన్నమాట!" అన్నాడు.

ఘరానా మావగారు

'నాగు'

చిన్నక్కయ్యపెళ్ళి ఒక పెద్ద సమస్యైకూచుంది మా యింట్లో. పెద్దక్కపెళ్ళితోనే దెబ్బతిన్న ఆర్థికపరిస్థితి కాస్త సర్దుకోవాలనేఉద్దేశంతో నాన్నగారు యీ విషయంపట్ల కాస్త అశ్రద్ధ చూపిన విషయం వాస్తవమే. అయితే నాన్నగారి అశ్రద్ధ హెచ్చినకొలది అమ్మచేసే ఒత్తిడి మరీ హెచ్చిపోయింది. అఖరికి ఎలాగయితేనేం, ఎవరి ప్రయత్నంమీద నయితేనేం ఎవరో దూరపుచుట్టాలు అక్కయ్యని చూడ్డాని కొస్తున్నామని వ్రాశారు. వ్రాయడ మేమిటి-వచ్చారు.

అయితే "కతికితే అతకదు" అనేసూత్రాన్ని అక్షరాలా అమలుపరచి మావూళ్లోనే బంధువుల యింట్లో బస చేశారు. మర్నాడు సప్తమీ లక్ష్మివారం, పుష్యమి నక్షత్రం, అంతా బాగుంది పిల్లని చూడ్డాని కొస్తున్నామని కబురు చేశారు. అనుకున్నట్టే మధ్యాహ్నం మూడుగంటలకల్లా మగపెళ్ళివారంతా దిగబడ్డారు. అక్కయ్యని గంగిరెద్దులా ముస్తాబు చేశారు. అంతా అయింది. అతి బలవంతంమీద అల్పాహారాలు కూడా అయాయి. ఇక మగపెళ్ళివారు మళ్లా వాళ్లబసకు వెళ్లిపోతున్నారు. నాన్నగారుకూడా మెట్లు దిగేవరకూ వాళ్లతో వెళ్లి "ఉంటాను, బావగారూ" అన్నారు.

"ఆఁ - ఆఁ - మరి మీరుండండి. మళ్లా రేపు సావకాశంగా మాట్లాడుకుందాం" అంటూ క్రొత్త మావగారు సాగిపోయారు.

అలా కాస్సేపు పిలబడి వెనక్కి తిరిగి యింట్లోకి వెడుతూ 'అరే' అన్నారు నాన్న సావిట్లో.

ఏమిటా అని ఒక్క పరుగున లోనికి వెళ్లాను.

"చూడు! - ఆయన జోళ్లుమరచిపోయినట్టున్నారు. పటుకెళ్లి చేయ్" అన్నారు నాన్న సావిట్లో మూల నున్న జోళ్లు చూపిస్తూ.

"చిన్నవాళ్లయితే యిదే బాధ. ఏదో ఒకపని చెప్తూనే వుంటా"రనుకున్నాను. ఆయనకి జోళ్లు పట్టుకెళ్లివ్వడం నాకు నామోషి అనిపించింది. నాన్నగారి మాట వినిపించుకోకుండా ఆయన వెనకాల పరిగెట్టేను అప్పటి కాయన నట్టే దూరం పోలేదేమో దార్లోనే పట్టుకొని "ఏమండోయ్! మావయ్యగారూ! మీ జోళ్లు" అన్నాను.

'ఆఁ' అని ప్రశ్నార్థకంగా నా వైపుచూచా డాయన.

"మీ జోళ్లండీ. మా సావిట్లో మర్చిపోయార"న్నా మరి కొంచెం గట్టిగా.

"అవునబ్బే పెద్దకాలమేమో, మతిమరుపు" అని నా వెనకాలే చక్కావచ్చి జోళ్లు తొడుక్కొని శెలవు తీసుకొన్నా రాయన.

మరి కాస్సేపటికల్లా మా వీధి కొసనున్న మేష్టారొచ్చి మా సావిడంతా గాలించడం మొదలెట్టేరు.

"ఏవిటి మేష్టారూ" అంటూ పలకరించేరు మా నాన్న.

"నాజోళ్లు యిందాక వచ్చినప్పుడిక్కడ విడిచేనూ" అని నసుగుతూ తలుపు కొంచెం ముందుకు లాగి ఆమూలచూస్తున్నా డాయన.

"ఆహాఁ - మీ జోళ్లొస్తాయి కూర్చోం" డంటూ మా నాన్న "ఒరే! సుభద్రగారింటి కెళ్ళి మామయ్యగారితో యిందాకటి జోళు మీవి గాను [illegible]

మీతో వచ్చాయని చెప్పి, అవి తీసుకురా'' అని నాకు ఆర్డరు వేసేరు.

ఇదంతా యేమిటన్నట్టు తెల్ల మొహం వేశాన్నేను.

"వెళ్లు" అని మళ్లా ఉరిమేరు నాన్న.

చచ్చినట్టు వెళ్ళాను.

"మామయ్యగారూ! యిందాకటి జోళ్ళు మీవిగావుట యిచ్చేయమన్నా" రన్నాను చల్లగా.

'ఆఁ" అంటూ చిన్నపోజు పెడుతున్నారప్పుడే ఆయన.

"అహాఁ — యిందాకటి జోళ్లు మావీధి కొసనున్న మేష్టరుగారివట. అవిపొరపాటున మీతో వచ్చాయని చెప్పమన్నారు" అని కొంచెంగట్టిగానే చెప్పాను.

"అహా" అని కళ్లజోడు సర్దుకుంటూ సావిడివరకూవచ్చి "అవున్నా అబ్బీ యివినాజోళ్లుగావు. అసలు జోళ్లు తొడుక్కోకుండా వచ్చానివాళ మీయింటికి. అదిమరచిపోయి జోళ్లు తొడుక్కునే వచ్చానన్న భ్రమతో నువ్వు జోళ్ళు మరచి పోయారండీ అంటే అహా ఔనుగామోసు ననుకుని తొడుక్కుని కొచ్చా. తీసుకెళ్లి చ్చెయ్. యివి మనవిగావు." అని చేటభారతమంత సంజాయిషీతో జోళ్లుపట్టుకెళ్లడానికి పర్మిష నిచ్చారాయన.

ఉబికివచ్చేనవ్వును లోపలే ఆపుకుంటూ ఆవదులు జోళ్లీడ్చుకుని మెల్లిగా యింటికొచ్చాను. అంతే.

దేవుడుచాలా మేళ్లేసి మా అక్కకా సంబంధమే కుదిరింది.

ఆవేళ పెళ్ళిపందిట్లో అంతా హడావుడిగావున్నారు. ఇంకోగంట కళ్లాలగ్నం. మామామగారెందుకో విడిదికెళ్లాల్సొచ్చింది. పందిట్లోంచి గుమ్మందాకావచ్చి "నాజోళ్లేవ్రా" అని జోళ్లకుప్ప వెతుకుతున్నారు గుమ్మందగ్గర ఆయన.

"ఫరవాలేదు. ఏవోవోటితొడుక్కెళ్లురూ గురూనా మామగారూ! మిమ్మల్నడిగేదెవరూ" అన్నా పందిట్లో స్టౌ మర్మరెట్లు దగ్గర గోలజేస్తున్న పిల్లల వనకాల్నుంచి నేను.

పందట్లో చిన్నా పెద్దాఅంతా ఒక్కసారి ఘొల్లుమన్నారు. మీరు నమ్మితే నమ్మండి లేకపోతే మానెయ్యండి గాని ఆగోజనుండీ మా యింట అందరం ఆయన్ని "గురూనా మామయ్య"నే పిలుస్తున్నాం.



గోంగూర పచ్చడి

సి. విశ్వనాథం

ఆనాడు ఆదివారం. బద్ధకంగా ఒకమాటు వళ్లువిరుచుకొని, నిద్రమంచం మీద నుంచి లేచి టూత్ బ్రష్ చేతపుచ్చుకొనేటప్పటికి గోడగడియారం ఠంగ్ ఠంగ్ మని 8 గంటలుకొట్టింది. అప్పుడే ఎనిమిదయిందా! అనుకుంటూ బయటకు వెళ్లి అరుగుమీద కూర్చుని ముఖంకడుక్కుని తువ్వాలతో ముఖంతుడుచుకుంటూ పడక కుర్చీలో కూర్చున్నాను.

ఇంతలో మా శ్రీమతి ఆవిర్లు విరజిమ్ముతున్న వేడి కాఫీ గ్లాసుపట్టుకొనివచ్చింది. అది అందుకొని నోటితో చల్లార్చుకుంటూ కాఫీ త్రాగి ఖాళీగ్లాసు బల్లమీద పెట్టాను. ఆనాడు ఆఫీసుకు శలవు అవటంవల్ల చెయ్యటానికి పనేమీ లేక యింటిచూరువంకా, వాసాలవంకా చూస్తూ కొంతసేపు గడిపాను. అట్లాఎంతసేపు చూడగలను. కొంతసేపటికి విసుగుపుట్టి ఏదయినా పుస్తకం చదువుకుందామని చూచేటప్పటికి బల్లమీద పిల్లలు చదువుకొనే ఏదోశతకం కనిపించింది. అదేచదువుదామని తెరిచేటప్పటికి యీ క్రిందపద్యం కంటపడ్డది.

వెల్లుల్లిబెట్టి పొగిచిన
పుల్లని గోంగూరరుచిని
బాగడగవశమా
మొల్లముగనూనెవేసుక
కొల్లగ భుజియింపవలయు
........" ఇది చదివేటప్పటికి చెప్పద్దూ మరి నాకూ నోరూరింది. ఇవ్వాళ ఏమయినాసరే! గోంగూర పచ్చడి తినాలనుకొన్నాను. మరయితే గోంగూర ఎక్కడ దొరుకుతుంది: మార్కెట్లో ఏమయినా అమ్ముతారేమో వెంకన్నని పంపించి చూడాలి. అహా నా బుద్ధి గోంగూర తింది. మొన్ననే గదూ మా శ్రీమతి పెరటిదొడ్లో గోంగూరచల్లింది. ఆ సంగతే మరిచాను అనుకుంటూ "ఏమేవ్! రాజ్యం ఓసారి యిట్లారా!" అని మా శ్రీమతిని కేకేశాను. "ఎందుకండీ పిలిచారు" అంటూ మా శ్రీమతి నా ముందు సాక్షాత్కరించింది. "ఓసేవ్! చూడు. మన పెరటిదొడ్లో గోంగూర బాగా పెరిగిందికదూ! అది కోసి చక్కగా వేయించి వెల్లుల్లిపాయలు బానావేసి నూరి, పచ్చడిచెయ్యి తెలిసిందా" అన్నాను.

"పచ్చడా! పచ్చడేం బాగుంటుందండీ? చక్కగా ఆనపకాయ ముక్కలువేసి పులుసువండుకుంటే జిహ్వాలేచివస్తుంది. ఎన్నాళ్లనుంచో అనుకుంటూవున్నా పులుసు వండుకుందామని. ఎప్పటి కప్పుడే మర్చిపోవటంతోనే సరిపోతోంది." అన్నది మా శ్రీమతి.

"పులుసంటేనే నా కసహ్యం. దాని పేరు చెబితేనేడోకువచ్చే పర్యంతం అవుతుంది. నిక్షేపంగా నామాట విని పచ్చడి చెయ్యి." అన్నా.

"మీ యిష్టమే యిష్టమా! ఎన్నాళ్ళనుండో రెక్కలు ముక్కలయ్యేటట్లు నీళ్లుపోసిపెంచుతే నా యిష్టాన్ననుసరించి చేసుకోటానికి వీల్లేదా?" అంది మా శ్రీమతి చిన్న పుచ్చుకున్న ముఖంతో. "అదంతా అవతలపెట్టు యివ్వాళ ఆరునూరయినా గోంగూరపచ్చడి చెయ్యాలిసిందే" అన్నాను. "ఎన్నడూలేంది యివ్వాళమిమ్మల్ని గోంగూరపచ్చడి పట్టుకుందే" అంటూ మూతి అష్టవంకరలు త్రిప్పింది మా శ్రీమతి. "గోంగూర పచ్చడి రుచి నీకేం తెలుసు పులుసో పులుసో అని అఘోరిస్తావు చూడు. ఒక కవిగారు గోంగూరపచ్చడిని గురించి ఏమన్నారో విను"

"పయరకూరనేచి
పచ్చిమిరపపండ్లనుక్కళించి
పోసి యూగనిచ్చి
కొంత గొంత పొగచి
కొనుగోంగు బచ్చడి
చవికినోరు...చివికితీరు"

అన్నారు. కనుక నువ్వు యివ్వాళ గోంగూరపచ్చడిచేసి దాంతో రెండుముద్దలు తిన్నావంటే మరి విడిచిపెట్టవ్" అన్నాను నవ్వుతూ.

అందరూ అన్నీ చెబుతారు. నాకదేమిటోగాని గోంగూర పచ్చడి

తిన్నరోజున కడుపంతా దేవినట్లుగా వుంటుంది. వద్దుబాబూ దానికో నమస్కారం'' అన్నది రెండు చేతులూ జోడిస్తూ.

''నీకేమీ పడవు. ప్రతిదానికీ ఏదో ఒకవంక చెబుతావు'' అన్నాను కోపంతో.

ఇంతలో మా తమ్ముడు ప్రభాకరం అక్కడికివచ్చి ''ఏమిటివదినా! అన్నయ్యా నువ్వూ దేన్నిగురించో వాదించుకుంటున్నారు'' అన్నాడు.

"చూడు ప్రభాకరం! మీ అన్నయ్యకు పట్టిందే పట్టు. ఇవ్వాళ గోంగూర పచ్చడి చెయ్యమంటున్నారు. నేనేమో పులుసువండుతే బాగుంటుందని అన్నాను. అందుకని మీ అన్నయ్యకి కోప మొచ్చింది. నువ్వేచెప్పు పులుసు బాగుంటుందా? పచ్చడి బాగుంటుందా?" మరిదిని మధ్యవర్తిగా పెట్టుకొని అన్నది.

"రెండూ బాగుండవు. చక్కగా పప్పువేసివండుతే బాగుంటుంది."

"సరిపోయె! మీ అన్నదమ్ము లిద్దరూ ఒక యింటివారె!" అన్నది మా శ్రీమతి.

"ఒక తల్లిబిడ్డలం ఒక యింటి వారముకాక నేరొక యింటి వార మవుతామా? అది సరేలే గానివదినా! ఎన్నాళ్లనుండో గోంగూరపప్పు తినాలని తహతహ లాడుతున్నాను. ఎప్పుడో రెండేళ్ళ క్రితం నా స్నేహితుడి ఇంటికి భోజనానికివెళ్ళితే వడ్డించారు. ఎంత మజాగా వుందనుకొన్నావ్. ఇప్పటికి కూడా మరుపు రాకుండా వుందంటే నమ్ము. నామీద దయ అనేదివుంటే యివ్వాళ నువ్వు పప్పు వండాలిసిందే."

"అదేమిటోయి! నువ్వూ యిట్లా అంటే ఏలా? చిన్నప్పటినుండి నాకు గోంగూరపులుసు అంటే నోరూరుతుంది. ఇవ్వాళ ఏమయినా పులుసే వండుతాను" మీ అన్నదమ్ములు ఏమనుకొన్నా సరే!" పెంకిగాఅన్నది మా శ్రీమతి.

"రాజ్యం చూడు యివ్వాళ నువ్వ గాని గోంగూర పచ్చడి చెయ్యకపోయావా ఏ కాశీ రామేశ్వరమో లేచి పోతా!" అన్నా కోపంతో.

"అవ్వ! అవేంమాటలండీ! మీ మంకుపట్టు మీ దేగాని రెండోవారి మాట వినిపించుకోరుగదా! నా మాట విని యివ్వాళిటికి గోంగూర పులుసు చెయ్యనియ్యండి. మరో మాటు పచ్చడి చేసుకుందాం" అన్నది మా శ్రీమతి తనమాట ఎట్లాగయినా నెగ్గించుకోవాలనే ఉద్దేశ్యంతో.

"చూడువదినా యిట్లా ఎవరికి వారే యమునాతీరే అంటుంటే ఎట్లా ముందు ఆ గోంగూర ఏదో కోసుకొద్దాం పదండి. ఆతరువాత పప్పా! పులుసా! పచ్చడా! అని పోట్లాడుకోనచ్చు" అన్నాడు మా తమ్ముడు రాజీగా.

"సరే! పదరా!" అంటూ నేను ఒకబుట్టా, మా శ్రీమతి ఒకబుట్టా, మా తమ్ముడొకబుట్టా ముగ్గురం మూడుబుట్టలతో దొడ్లోకి వెళ్లాం. అక్కడికి వెళ్ళిచూస్తే ఏముంది! ఎవరిదో గేదె గోంగూరంతా సుష్టుగా తిని నెమరువేస్తోంది. మమ్మల్ని చూసి బెదిరి చక్కాపోయింది. అదిచూసి నేను ముగ్గురం తెల్లబోయాం.


"నామతి మండిపోనూ వని చేసేది వస్తుందని తలుపులీసి అట్టే పెడితే, మనఖర్మానికి యీ గేదె ఎక్కడ దాపురించిందోగాని అంతా తినిపోయింది" అని మా శ్రీమతి శోకాలు తియ్యటం మొదలెట్టింది."

"ఊరుకో వదినా పీడాపోయి పీడ పోయ పిల్లి తీర్చిందని మన ముగ్గురం పచ్చడా? పులుసా? పప్పా అని కొట్లాడుకుంటుంటే గేదెవచ్చి మన సమస్యను మా బాగా పరిష్కరించి పెట్టింది" అన్నాడు మా తమ్ముడు.

వాళ్ల మాటలకు నాకు నవ్వాలో ఏడవాలో తెలియలా. ఆ రోజుకు మటుకు పచ్చడీ లేదు. పులుసూ లేదు. పప్పూ లేదు. నాకుమటుకు ఆరోజల్లా "పెల్లుల్లిపెట్టి పొగచిన... ...." అన్న పద్యం మాటి మాటికి నెమరుకు వస్తూ నేవుంది.

★

సీరియల్:—



మూలం: ఆల్ఫాన్స్ డాడే

[ఈనవల రచించిన ఆల్ ఫాన్స్ డాడే ఫ్రాంసు దేశంలో 1840 లో పుట్టాడు పసితనంలో దేశదిమ్మరిగా చాలా కాలం గడిపాడు. తరువాత కొంతకాలం ఒక పాఠశాలలో అధ్యాపక వృత్తి అవలంబించాడు; కాని అందులో అతని జీవితం దుర్భరమైంది. ఆ తరువాత వాళ్ల అన్న ఎర్నెస్ట్‌తో కలిసి, పారిస్‌లో కొంతకాలం గడిపాడు. అక్కడ వుండగానే సారస్వత వ్యాసంగం ప్రారంభించాడు. మొట్టమొదటిసారిగా 1858 లో తను రచించిన గేయాల సంపుటి ప్రచురించాడు. దీనికి ప్రజాదరణ బాగా లభించింది ప్రస్తుతం తెలుగు పాఠకలోకానికి మేము పరిచయం చేయబోతున్న 'అన్నా — చిన్నా' మాతృక 1868 లో విరచితమైంది. ఈ నవలలో డాడే తన స్వీయ చరిత్రనే చాలా కొద్ది మార్పులతో చెప్పి వున్నాడు. ఎడ్‌మండ్ డి గోన్‌కోర్ట్, ఫ్లాబెర్ట్, జోలా వంటి అలనాటి ప్రముఖ ఫ్రెంచి రచయితలతో సమాన ఛాయాలో మెలగిన డాడే, పిల్లలకోసం చక్కని నవలలు కొన్ని వ్రాశాడు. ఇరవై ఏడో ఏట ఈయన రచయిత్రి అయిన జూలియా అలార్డ్ అనే ఆమెను వివాహం చేసుకొన్నాడు. వీరుభయుల దాంపత్యమూ చాలా ఆదర్శప్రాయంగా గడిచింది. 1897 లో ఏభైఏడో ఏట పారిస్ నగరంలో అంతిమశ్వాస విడిచాడు.]

1. చిన్నా పుట్టిన చోటు

నేను 18--మే 13న పుట్టాను. నా జన్మస్థలం లాన్‌గ్వెడక్. ఫ్రాన్సులో దక్షిణభాగాన వుండే అన్నివూళ్లల్లోలాగానే మావూళ్లోనూ బోలెడంత దుమ్మూ ధూళీ వుండేవి. కార్మెలైట్స్‌కు సంబంధించిన ఒక కాన్వెంటు, రోమన్ రాజ్యవైభవాన్ని స్ఫురణకు తెచ్చే రెండుమూడు జీర్ణసౌధాలుకూడా వుండేవి.

ఆరోజుల్లో మా నాన్నగారు, మస్యూ ఐసెట్టీ, పెద్ద సిల్కువ్యాపారి. ఆవూళ్లో మాకొక పెద్ద సిల్కు ఫ్యాక్టరీ వుండేది. ఆ ఫ్యాక్టరీలోనే ఒక పక్కగా కొంతభాగాన్ని కేటాయించి, అందు మేమంతా కాపురం వుంటుండేవాళ్లం. వర్కుషాపులకీ మేముండే వాటాకి మధ్యను ఒకమాదిరి పెద్దరకం తోట వుండేది. తోటనిండా రకరకాల చెట్లు వుండేవి. అక్కడా నేను పుట్టింది! నా జీవితంలో మొట్టమొదటి సంవత్సరాలు అక్కడే గడిచాయి. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకొంటే, నాజీవితం అంతటిలోకీ తెలిసీ తెలియని ఈడులో గడిచిన ఆరోజులే బాగుండేవనిపిస్తుంది. ఆ ఫ్యాక్టరీ, ఆయిల్లు, ఆతోట, ఆచెట్లూ, వాటికి సంబంధించిన అలనాటి స్మృతులూ యీనాటికీ నా మనస్సులో అచ్చుగుద్దినట్లు వుండిపోయాయి. మా కుటుంబ పరిస్థితి చితికిపోయి, మేమా పరిసరాలను విడిచి వచ్చేస్తున్నప్పుడు, అవన్నీ చేతన వస్తుసముదాయాలైనట్లు, వాటిని విడిచి రావటానికి నేనెంతో బాధపడ్డాను.

నా జీవితగాథను ఆరంభించేముందు ఒక్క ముక్క చెప్పి తీరాలి. నేను పుట్టిన నక్షత్రం ఎటువంటిదో కాని, సరిగ్గా అప్పటినుంచే మా కుటుంబాన్ని అన్నివైపులనుంచీ కష్టాలు చుట్టుముట్టేశాయి. మా వంటలక్క 'ఆనీ' చెప్తుం[illegible]—నేను భూమిమీదపడ్డరోజున మా నాన్నగారు ఎక్కడో ప్రయాణంలో వున్నారట. అక్కడ

అనువాదం: విశ్వాత్ముల నరసింహమూర్తి

వుండగా యిటునుంచీ నేను పుట్టిన కబురూ, అటు మార్సెల్సునుంచీ ఆయన ముఖ్యఖాతాదారులలో ఒకడు పోయిన కబురూ ఒకేసారి వచ్చాయుట. ఆ ఖాతాదారు ఎవరోగాని, ఆ ధర్మాత్ముడి చావు మూలంగా మా నాన్నగారు ఒక్కసారిగా నలభై వేల ఫ్రాంక్‌లు నష్టపోవలసి వచ్చింది. ఒక చెంపనుంచీ ఒక శుభవార్త, యింకో చెంపనుంచీ యింకో అశుభ వార్త ఏకకాలంలో వచ్చేసరికి, మా నాన్నగారికి యీ శుభవార్తనుగురించే సంతోషించాలో, ఆ అశుభ వార్తను తలుచుకొనే ఏడవాలో బోధపడ లేదట. ఇప్పుడు తలుచుకొంటే, ఆరోజున మా నాన్నగారు నలభై వేల ఫ్రాంకులు నష్టపెట్టిన ఆ ఖాతాదారుడి చావుకి విచారపడినట్లే, నాలాంటి దురదృష్టవంతు డొకడు యీ భూమిమీదకు వచ్చినందుకుకూడా దిగులుపడి వుండవలసింద నిపిస్తుంది...

ఇందాకనే చెప్పానుగా—నేను యీ కుటుంబం లోకి వస్తూనే కొంత శనిప్రభావంకూడా వెంటబెట్టుకు వచ్చానని. నేను పుట్టినరోజు, లగాయతు, యించు మించు ప్రతిసారీ, ఏదో ఒక ఘోరవిపత్తు మా కుటుంబాన్ని ఆవహిస్తునే వచ్చింది. మొట్టమొదటి ఆపద, ఆ మార్సెల్సు ఖాతాదారుడు పోవటం. అది యింకా పాతపడకముందే, ఆ ఒక్కసంవత్సరంలోనే మా ఆస్తులకి రెండుసార్లు నిప్పు అంటుకొన్నది; తరు వాత కొద్దిరోజుల్లో నేతపనివాళ్లలసమ్మె: దాంతరువాత మా 'బాప్టిస్టీ'మామయ్య చచ్చిపోవటం; దాంతరువాత అద్దకం రంగుల వ్యాపారస్థులకీ మా నాన్నగారికీ మధ్య నడిచిన దావా—ఆ దావాకోసం ఎంత డబ్బు ఖర్చు అయిందో, మావాళ్లంతా ఎంత శ్రమపడ్డారో అంచెనాకూడా వెయ్యలేం: అన్నిటికంటె మిన్నగా అశనిపాతంలా వచ్చిపడింది 18 -- నాటి విప్లవం! దాంతో మా కుటుంబపరిస్థితి మూలమట్టంతోసహా నాశనమైపోయింది.

ఆరోజునుంచీ మా ఫ్యాక్టరీ బ్రతుకు క్రమంగా క్షీణదశకు వచ్చేసింది. గాయపడ్డ పక్షి ప్రాణం ఎట్లాగైతే ఆఖరుక్షణందాకా గుటగుటలాడుతూ, ఆఖరి అంతమైపోతుందో మా ఫ్యాక్టరీప్రాణంకూడా అట్లాగే గుటగుటలాడి, ఆడి ఆఖరికి ఆగిపోయింది. ఫ్యాక్టరీ వచ్చింది; వర్క్‌షాపులు ఖాళీ అవుతున్నాయి; వారాని కొక మగ్గంచొప్పున ఆగిపోతున్నాయి; నెల కొక అద్దకం బల్లమూలపడుతోంది. దీర్ఘవ్యాధి పీడితుడైన వాడి శరీరంలోనుంచి జీవాత్మ ఎగిరిపోతుంటే చూస్తూ వుండటం ఎంత బాధాకరమో, మా ఫ్యాక్టరీ చరమ దశను చూస్తూవుండమూ అంత బాధాకరంగానూ పరిణమించింది. ఈ కార్యక్రమం అంతా పూర్తి అవ టానికి దాదాపు రెండేళ్లు పట్టింది; అంటే ఆ రెండేళ్ళపొడుగునా మా ఫ్యాక్టరీ మరణావస్థలో కొట్టు మిట్టాడుతూనే వున్నదన్నమాట. చివరి కెప్పటికో ఇన్నిఏళ్లుగా మోగిన ఫ్యాక్టరీ గంట మోగనిరోజూ, పనివారు ఒక్కడైనా రానిరోజూ వచ్చింది. ఫ్యాక్టరీ బావిలోంచి నీరుతోడేయంత్రం అహర్నిశలూ కిర్రు కిర్రుమంటుండేది; ఆరోజుతో ఆ చప్పుడూ శాశ్వ తంగా ఆగిపోయింది. ఫ్యాక్టరీలో వాడిన మురికినీళ్లు వచ్చిపడే పెద్దపెద్ద గుంటలు వున్నాయి. వాటిలోని నీటికి నాటినుంచీ ఎటువంటి కదలికా లేకుండా పోయింది: అంతక్రితంవరకు పగలు॰ రాత్రి పని వాళ్లతోనూ, గుమాస్తాలతోనూ సందడిగావుండే మా ఫ్యాక్టరీ ఆవరణలో ఆరోజనుంచీ మా అమ్మా, నాన్నా, మా వంటలక్క 'ఆనీ', మా అన్న జాక్, నేనూ (నన్ను యింట్లో అందరూ 'చిన్నా' అంటుం టారు) తప్ప యింకెవరూ లేరు. ఎక్కడో దూరంగా ఫ్యాక్టరీ కాంపౌండుగేటుకు ఆనుకొని కాపలావాడు 'కొలోంబీ,' వాడి కొడుకు 'రోజే' కాపురముండేవాళ్లు.

మొత్తానికి ఆరోజుతో మా కుటుంబ పరిస్థితి సాంతం చితికిపోయింది: మేము సర్వనాశనమైనాము.

అప్పటికి నాకు ఐదారుఏళ్లు వుంటాయి. అప్పుడుకూడా అనారోగ్యంగా వుండేవాణ్ణేమో— మా తల్లితండ్రులు నన్ను బడికి పంపించే ఆలోచన అప్పటి కింకా పెట్టుకోలేదు. ఇంట్లో మా అమ్మే నాలుగైదు స్పానిష్ భాషాపదాలు వ్రాయనూ చదు వనూ నేర్పింది. గిటార్ మీద రెండుమూడు రకాల రాగవరసలు వాయించటంకూడా నేర్పింది. అప్పటి నా వాద్యగోష్ఠినిచూచి మా కుటుంబలోనివారందరూ, ముందుముందు సంగీత స్వరార్ణవాన్ని సముద్ధరించే మహామేధావి ఒకడుపుట్టాడని తెగమురిసిపోతుండేవాళ్లు.

అన్నా - చిన్నా

మూలంగా నాకు రోజులో ఒక్కసారి అయినా ఫ్యాక్టరీఆవరణ వదిలిపెట్టి వీధిలోకి వెళ్లవలసిన అవసరం వచ్చేదికాదు. అందుచేత మా నాన్నగారి వ్యాపారం విచ్ఛిత్తి నొందటం ప్రత్యక్షంగా నాకళ్ళఎదుటనే జరిగినట్లు అయింది. అంతటి ఘోరవిపత్తులోకూడా వ్యక్తిగతంగా నాకొక అదనపు సౌకర్యం చేకూరింది. ఇదివరకు ఎన్నడూ లేనంత స్వేచ్ఛగా నా యిష్టం వచ్చినంతసేపు ఫ్యాక్టరీ ఆవరణలో ఎక్కడబడితే అక్కడ తిరిగే అవకాశం లభించింది. ఇదివరకటిరోజుల్లో అయితే ఒక్క ఆదివారంనాడు మాత్రమే నాకాస్వేచ్ఛవుండేది. ఆమాటే నా నెచ్చెలి, సచివుడు అయిన 'రోజే'తో అననుకూడా అన్నాను:— "మనని ఇష్టమొచ్చినట్లు ఆడుకోమని యీ ఫ్యాక్టరీ మనకి యిచ్చేశారురా!" అని.

నేను అన్న ఆమాట మా 'రోజే' నిజమేనని నమ్మాడు. ఆచవట నేను ఏది అంటే అదల్లా అలాగే నమ్మేసేవాడు.

మా కుటుంబాన్ని చుట్టుముట్టిన యీ పరిస్థితులను నేను చూసినంత తేలికగా మా కుటుంబంలో వాళ్లెవ్వరూచూడలేదు. మానాన్నగారు మహా భయంకరంగా తయారైనారు. అంతకుముందే చండశాసనుడు: ప్రతి చిన్నవిషయానికీ రంకెలు వేసేరకం. ఆయన ధోరణిచూసి ఎంతటివాళ్లైనా హడలిపోయేవాళ్లు. అన్నివిధాలా చితికిపోవటంతో ఆయన మరీ భయంకరంగా తయారై పోయారు. పొద్దున నిద్దర లేచింది మొదలు రాత్రి పడుకోబోయేదాకా ఎందుకో ఒకందుకు, ఎవరిమీదనో ఒకరిమీద మండిపడి పోతుండేవారు. మండిపడటానికి ఏకారణమూ కనిపించకపోతే, ఏ ఎండనో, ఏ వడగాడ్పునో, లేకపోతే ఏపాపమూ ఎరుగని మా అన్న జాక్‌నో, వాడూ కనిపించకపోతే మావంటలక్కనో, ఆవిడా ఎదురుగుండా లేకపోతే కొత్తగా దేశంమీద వచ్చిపడ్డ విప్లవాన్నో,-దేన్నో ఒక దాన్ని-పట్టుకు చెడామడా తిట్టి పోస్తుండేవారు. మరీ - ఆ విప్లవాన్ని అయితే, ఆయన తిట్టేతిట్లకి అంతంటూ వుండేదికాదు. ఆ తిట్లు విన్నవాళ్లకెవరికి కేవలం మా కుటుంబాన్ని చితకగొట్టానికే వచ్చిందా అనిపించేది. అలనాటి ఆ విప్లవాన్ని లేవదీసి నడిపినవారిలో ఎవరినీ మా ఐసెట్టీ కుటుంబం మన్నించలేకపోయింది. వారిలో ప్రతి ఒక్కరినీ మా యింటిల్లపాదీ పేరుపేరునా పట్టుకుతిట్టి పోగులు పెడ్తుండేవాళ్లం...యింత మునలివాడయ్యాకకూడా కీళ్లనొప్పి తెర వచ్చినప్పుడల్లా మా నాన్నగారు, ఘడియకొకసారి ఆనాటి విప్లవకారుల్ని పట్టుకొని బండ బూతులు తిట్టుతుంటారు.

ఆయనకు యీ కీళ్లనొప్పి జబ్బు మొదటినుంచీ వుండేదికాదు. అప్పుడు జీవితంలో అన్ని రంగాల్లోనూ తిన్న దెబ్బ మూలంగా అలా తయారయ్యారు.

ఆరోజుల్లో ఆయనకు పక్షానికి రెండుసార్లు చొప్పున రక్తస్రావం చేయించవలసి వచ్చేది. ఆ ఘట్టాలలో యింటిల్లపాదీ బెంబేలెత్తిపోయి, వులుకూ పలుకూ లేకుండ వుండిపోయేవాళ్ళం. భోజనాల దగ్గరకూడా ఫలాని వస్తువు కావాలని బిగ్గరగా అడగటానికి ఎవరికీ ధైర్యంచాలక, ఒకళ్ళకొకళ్ళం మూగ సంజ్ఞలు చేసుకొనేవాళ్లం. ఆయన ఎదురుగా వున్నంతసేపూ మా కెవ్వరికీ గట్టిగా ఏడవటానికైనా ధైర్యం చాలేదికాదు; ఆయన కాస్త కనుమరుగైనారంటే చాలు — యింటిల్లపాదీ ఏకకంఠంతో ఏడుస్తూ కూర్చునేవాళ్ళం. మా అమ్మా, మా వంటలక్క, మా అన్న జాక్, అందరూ గొల్లుమనేవాళ్లు. పక్కవూళ్ళో మతప్రచారకుడుగా పనిచేస్తున్న మా పెద్దన్న 'ఎబ్బే' అప్పుడప్పుడూ మమ్మల్ని చూడటానికి వస్తుండేవాడు; వచ్చినప్పుడల్లా అతనుకూడా యథాశక్తి మిగిలిన వాళ్లతోపాటు కలిసి విలపించేవాడు. ముఖ్యంగా మా నాన్నగారిస్థితిని చూసి మా అమ్మ ఏడ్చేది: ఆవిడను చూసి మా పెద్దన్నయ్యా, మా వంటలక్కా ఏడ్చేవాళ్లు. మా రెండో అన్న జాక్ - వాడికింకా అప్పటికి జరిగిందేమిటో బోధపడే యీడు రాకపోయినా—వాడూ ఏడ్చేవాడు. వాడి ఏడుపు మరీ చిత్రంగా వుండేది. ఏడవటంలో వాడికేదో సుఖం కనిపించేదికాబోలు; అస్తమానం ఏడు

మా అన్న జాక్ నాకంటే రెండేళ్లు పెద్ద అయినా వాడి నడత ఏమిటో గమత్తుగా వుండేది. జరిగిపోయిన యిన్ని సంవత్సరాల జీవితాన్ని మననం చేసుకుచూస్తే, వాడిమొఖం ఏనాడూ కన్నీటి చారికలు లేకుండా పరిశుభ్రంగా కనుపించటంలేదు. పొద్దునా సాయంత్రం పగలూ, రాత్రి, యిల్లూ బడీ అనే వ్యత్యాసం లేకుండా ఎప్పుడుపడితే అప్పుడు, ఎక్కడపడితే అక్కడ ఏడుస్తూనే వుండేవాడు. "ఎందుకురా బాబూ, ఏడుస్తున్నావు?" అని ఎవరైనా అడిగితే, "ఏమీలేదు" అంటూనే గుక్కపట్టి ఏడ్చేవాడు. నిజంకూడా అంతే—వాడి ఏడుపుకి ఎప్పుడూ ఫలానా అని ఒక కారణం వుండేది కాదు. మనం ముక్కు చీదినంత మామూలుగా వాడు అహర్నిశలూ ఏడుస్తుండేవాడు. వాడి ఏడుపు ముఖం చూసినప్పుడల్లా మా నాన్నగారు మండిపడి పోయేవారు.

మా అమ్మను కేకేసి "చూడు, ఆ వెధవని? దరిద్రపుగొట్టు వెధవ. అస్తమానం ఏడుస్తూనే వుంటాడు. వీడికళ్ళల్లో ఏవో పెద్దపెద్ద నదులో మహాసముద్రాలో వుండివుంటాయి. లేకపోతే ఎందుకువస్తాయి—అన్ని కన్నీళ్లు?" అంటుండేవారు.

మా నాన్నగారుపడే చీదరను చూసి మా అమ్మ ముసిముసి నవ్వులు నవ్వుతూ "పోనీలెస్తురూ! కుర్ర వెధవ. పెద్దవాడైతే వాడే మానేస్తాడు. వాడి ఈడులో వుండగా నేనూ సరిగ్గా యిలానే అస్తమానం ఏడుస్తుండేదాన్ని" అంటూవుండేది.

జాక్ పెరగటమైతే రోజురోజుకీ పెరుగుతున్నాడుకాని, ఎంత పెరిగినా వాడి ఆపాడు అలవాటుమాత్రం పోలేదు. ఆ అలవాటు పోకపోగా, ఏకారణమూ లేకుండా కడవలకి కడవలుగా కన్నీళ్లు కార్చేవాడి అద్భుతశక్తి దినదిన ప్రవర్ధమానంగా పెరుగుతూ వస్తోంది. అప్పట్లో మా కుటుంబానికి వచ్చిపడ్డ ఆ ఘోరవిపత్తు మా వాడికి మహాబాగా అనుకూలించింది. వాడి పాలిట అది ఒక వరప్రసాదమైంది: అపురూపంగా వచ్చిన యీ అవకాశాన్ని చక్కగా సద్వినియోగం చేసుకొని కరువుతీరా రోజుల తరబడి ఆపకుండా ఏడ్చేశాడు. అందరూ యించుమించు అదే పరిసితిలో వున్న కారణంచేత వాణ్ణి ఎవ్వరూ అడ్డగించలేదు;—'ఎందుకు ఏడుస్తున్నా'వని ఎవరూ అడగలేదు.

మా నాన్నగారి వ్యాపారం దెబ్బతినటం, తత్ఫలితంగా సంసారం చితికిపోవటం అనేది అవాంఛనీయమే అయినప్పటికీ ప్రత్యేకించి నాకూ మా జాక్‌కీ అందులో వేరేవేరే కారణాలమూలంగా కొంత హర్షించదగిన అంశాలు కనిపించాయి.

నే నెక్కడ వున్నదీ, ఏం చేస్తున్నదీ ఎవరూ పట్టించుకోవటంలేదు. అది నామటుక్కి నాకు చాలా సరదాగా వుంది. ఆ విధంగా లభించిన స్వేచ్ఛను పూర్తిగా అనుభవించాను. నా నెచ్చెలీ నా సచివుడు అయిన 'రోజే'తో రోజంతా, ఆటలు ఆడుకొంటూ గడిపేసేవాణ్ణి. మా ఫ్యాక్టరీ ఆవరణలో జనసంచారం అనేది ఆగిపోయి అప్పటికప్పుడే చాలా రోజులు గడిచినందువల్ల అదివరకంతా కొట్టికోలాహలంగావుండే వర్క్‌షాపుల్లో గడ్డీ గాదరా దట్టంగా మొలిచాయి. జీర్ణ దేవాలయాల్లో లాగా మా అడుగులు చప్పుడు భయంకరంగా ప్రతిధ్వనిస్తుండేది.

'రోజే'కి అప్పటికి పన్నెండేళ్లుంటాయి. చిన్నసైజు దున్నపోతుకు మల్లే దుక్కలా వుండేవాడు. వాడు కుక్కవలె విశ్వాసం కల జంతువు గార్దభమువలె బుద్ధిహీనుడు. రాగిరంగు జుట్టు (జూలు!) ఎగరేసుకుంటూ నా వెనక పరుగెత్తుతుండే వాడు. వాడి జుట్టు రంగునుబట్టే వాడికాపేరు (రోజే) వచ్చింది. వాడి రూపురేఖలు గుణగణాలు ఎలాంటివైతేనేం—నాకు మాత్రం నర్మసఖుడిలాంటి వాడయ్యాడు.

నే నాడే ప్రతి ఆటలోనూ వాడూవుండేవాడు. అప్పుడప్పుడూ నేను 'రాబిన్‌సన్‌క్రూసో' * ఆట ఆడేవాణ్ణి. నేను రాబిన్‌సన్‌క్రూసో నైతే, వాడు 'ఫ్రైడే!' మరికొన్ని సందర్భాలలో నన్ను నేను ఏదో చీమలు దూరని చిట్టడవీ, కాకులుదూరని కారడవిలోకి సాహసోపేతంగా చొచ్చుకు పోయిన రాజకుమారుణ్ణిగా వూహించుకొనేవాణ్ణి. అట్టి సందర్భాలలో కథానాయకుణ్ణి ఎదిరించి ఓడిపోయిన ఆటవిక బృందాలకి ఏకైక ప్రతినిధి మా 'రోజే!' ఆ విధంగా నేను విన్నవీ వూహించినవీ అయిన కథలను సందర్భోచితంగా మార్పులూ, చేర్పులూ చేస్తూంటూ స్వతంత్రంగా ఆడేవాణ్ణి

★ అన్నా - చిన్నా ★

ప్రతి ఆటలోనూ 'రోజే' ఏదో ఒక అతి ప్రధానమైన పాత్ర నిర్వహిస్తుండేవాడు. మరీ ముఖ్యంగా క్రూసో ఆట ఆడిన ఆరోజులే నాకు తరుచు జ్ఞాపకం వస్తుంటాయి. జనసంచారంలేని ద్వీపంలో చిక్కుపడిపోయిన రాబిన్‌సన్ క్రూసో * సాహసచర్యలను గురించి రాత్రులు చదివి వుప్పొందిపోయేవాణ్ణి. ఆయాఘట్టాలను పొద్దునే నాటకంగా రోజేతో కలిసి ఆడేవాణ్ణి. కట్టుకొనేందుకు బట్టలులేక గొర్రెతోళ్లు కప్పుకొని తిరుగుతున్న క్రూసోగా నన్ను నేను ఊహించుకు వుప్పొంది పోయేవాణ్ణి...(అవ్యక్త మధురంగా గడిచిన ఆ రోజులు తలుచుకుంటే యిప్పుడు వొళ్లు పులకరిస్తోంది!) నే నొక్కణ్ణే రాబిన్‌సన్ క్రూసోగా మారిపోవటంతో సరిపోయేదికాదు. నా చుట్టూవున్న పరిసరాలన్నిటినీ కలిపి ఒక మహానాటకరంగ మైనట్లు వూహించుకొనేవాణ్ణి. అట్టి సందర్భాలలో మా ఫ్యాక్టరీ ఫ్యాక్టరీకాదు: అది కాస్తా రాబిన్‌సన్ క్రూసో కథలోని నిర్జనద్వీపంగా మారిపోయేది. ఫ్యాక్టరీమురికిగుంటలు గంభీర సాగరాలుగానూ, మాపూలతోట మానవమాత్రుడెవరూ చొరరాని ఘోరభీకరారణ్యంగానూ మారిపోయేవి!

మా తోటలోని చెట్లకొమ్మలమీద రంగుల రంగుల సీతాకోకచిలుకలు గుంపులు గుంపులుగా వచ్చివాలుతుండేవి. వాటికావిషయం తెలియకపోయినా — నా నాటకాల్లో అవీ పాత్రధారులే!

వాటిదాకా ఎందుకు—నా నెచ్చెలి 'రోజే'కైనా వాడు నిర్వహిస్తున్న పాత్రఏమిటో, దాని ప్రాముఖ్యమేమిటో ఆ వంతైనా బోధపడేది కాదు. అన్నిసార్లు నా నాటకాల్లో వేసినా, వాణ్ణి ఎవరైనా 'రాబిన్‌సన్ క్రూసో ఎవర్రా' అని నిలదీసి అడిగితే, గుడ్లప్పగించేవాడు. అర్థంకాకపోతే మటుకేం—వాడు నిర్వహిస్తున్న పాత్రలో పూర్తిగా లీనమైపోయేవాడు. ఒక్కొక్కప్పుడు ఆటవికుల అరుపులను వాడు అనుకరించిన పద్ధతి చాలా అసాధారణంగా వుండేది. అంత భయంకరంగా కేకలుపెట్టటం వాడెక్కడ నేర్చుకున్నాడో నాకైతే తెలియదుకాని, నెత్తిమీద ఎర్రజూలు ఆడించుకొంటూ గుండెలు అవిసిపోయేట్టు పెడబొబ్బలు పెట్టుతుంటే ఆ కేకలు విని ఎంతటివాడైనా హడలిపోవాల్సిందే. రాబిన్‌సన్ క్రూసో తరువాత మళ్ళీ రాబిసన్‌సన్ క్రూసో అంత ధైర్యశాలి ననుకొంటున్న నాకే, వాడి కేకలు వింటుంటే అప్పుడప్పుడూ వల్లమాలిన భయంవేసేది; గుండె ఆగిపోయినంతపని అయ్యేది. ఉచ్ఛ్వాసనిశ్వాసాలు బిగబట్టి "మరీ అంత బిగ్గరగా అరవకురా బాబూ; నాకు భయమేస్తోంది" అని బతిమాలుకొనేవాణ్ణి.

ఆటవికుల అరుపులను అంత నేర్పుగా అనుకరించే మా 'రోజే', అంతకంటే ఎక్కువ వొడుపుగా అలగాజనం తిట్టుకొనేతిట్లూ, బూతులూ ప్రయోగించేవాడు. వాడితో సావాసంచేసి చేసివున్నమీదట ఆ తిట్లూ, ఆ బూతులు సగం నాకూ వొచ్చేశాయి. ఒకరోజు రాత్రి మా అమ్మా, నాన్నా మేమంతా కలిసి భోంచేస్తుండగా, ఆ బూతుల్లో మరీ పచ్చిబూతు ఒకటి పొరపాటున నా నోరు జారివచ్చేసింది. అది విని మావాళ్ళంతా చేష్టలుడిగిపోయారు.

"ఎవరు నేర్పారురా యీ కారుకూతలు నీకు? ఎక్కడ నేర్చుకొన్నావు యీ పాండిత్యం?" అంటూ

---

* డేనియల్ డీఫో అనే ఆంగ్ల రచయిత 1719 లో రచించిన 'రాబిన్‌సన్ క్రూసో' నవల ప్రపంచ బాల సాహిత్యంలో గణనకెక్కిన రచన. ఇందులో రాబిన్‌సన్ క్రూసో అనే యార్కు దేశస్థుడు, తను ప్రయాణం చేస్తున్న ఓడ నట్టనడి సముద్రంలో బద్దలైపోగా, కొయ్యముక్కల ఆధారంతో సముద్రంలో యీదుకొంటూ పోయి, మనుష్య సంచారంలేని ఒకానొక ద్వీపానికి చేరుకుంటాడు. అక్కడ అతడు తిండికీ, బట్టకీ నానా యిబ్బందులు పడతాడు. చిన్న చిన్న పనిముట్లను ఉపయోగించి పెద్దగావుండే పాక ఒకటి కట్టుకొంటాడు. కూడా తెచ్చుకొన్న తుపాకీతో వేటాడుతూ పొట్టనింపుకొంటూ వుంటాడు. ఇలా కొన్ని యేండ్లు గడిచాక ఒకరోజున అతనికి నిర్మానుష్యంగావుండే ఆ దీవిలో మనుష్యులు నడచిన అడుగులజాడలు కనిపిస్తాయి. వాటిని అనుసరించి పోగాపోగా ఆటవికుడొకడు అతనికి కనిపించి, శరణువేడుతాడు. ఆ తరువాత వాడు అతనికి అతి నమ్మకమైన సేవకుడుగా పని చేస్తుంటాడు. ఇంత మంచి మిత్రుణ్ణి, సేవకుణ్ణి తాను పొందగలిగినందుకు సంతోషించి, తనకు అతడు దొరికింది ఒకానొక శుక్రవారంనాడు కాబట్టి అతనికి 'ఫ్రైడే' అని పేరు పెట్టి పిలుస్తాడు. ఆ తరువాత మరికొంత కాలానికి ఒక సరకులఓడ ఆతీరం మీదగా పోతూ వీళ్లిద్దరినీకూడా ఎక్కించుకొని తీసుకువచ్చి ఇంగ్లండులో వదలిపెట్టుతుంది. ఆ నవలలో రాబిన్‌సన్ క్రూసో ఎదుర్కొన్న అనేక సమస్యలు, వాటిని అతడు అతి ధైర్యంగా

విజ్ఞానవీధులు
"డాక్టర్"

189. పరమాణుశక్తి శాంతికాల ప్రయోజనాలు: ఏమైనా ఉన్నాయా?

పరమాణుశక్తిని మానవ విధ్వంసానికే కాకుండా మానవ సౌభాగ్యానికి కూడా ఉపయోగించవచ్చును. ఉష్ణశక్తి, విద్యుచ్ఛక్తి, జల విద్యుచ్ఛక్తుల కంటె పరమాణుశక్తిని అందుకొరకై వినియోగించుకొనడంలో కొన్ని సౌకర్యాలు కూడా ఉన్నాయి. యురేనియమ్ వంటి ఎక్కువ బరువైన మూలద్రవ్య కేంద్రకాలను బ్రద్దలు కొట్టడంవలననూ, హైడ్రొజనివంటి తక్కువ బరువైన మూలద్రవ్య కేంద్రకాలను సమ్మేళన మొనర్చడంవలననూ కూడా పరమాణుశక్తిని ఉత్పత్తి చేయవచ్చును కదా. ఇందులో యురేనియమ్ వంటి ఎక్కువ బరువైన మూలద్రవ్య కేంద్రకాల విదళనమువలన చేకూరిన పరమాణుశక్తిని మాత్రమే శాంతికాల ప్రయోజనాలకై ఉపయోగించుకొనడం ఇంతవరకు మానవుడు తెలిసికొన్నాడు.

పరమాణుశక్తిని జనింపచేయడానికై ప్రారంభదశలో చాలా ఎక్కువ ఖరీదైన యంత్రాలను నెలకొల్పాలి. యురేనియమ్ వంటి విదళనాన్ని పొందగలిగిన ద్రవ్యాలు చాల తక్కువ మొత్తంలో లభ్యం కావడంవలన అవి చాల ప్రియంగా ఉంటాయి. పైగా శుద్ధమైన ఆ ద్రవ్యాలను తయారుచేయడానికీ, వీటిలో ఉన్న వేర్వేరు ఐసటోపులను వేరుచేయడానికీ ఎక్కువ ధనం అవసరమౌతుంది. ప్రారంభదశలో పెట్టవలసిన యీ పెట్టుబడిధనం కోట్లలో ఉంటుందని వేరే చెప్పనక్కరలేదు. అయితే విదళనాన్ని పొందగలిగే ద్రవ్యాన్ని తగు మొత్తంలో ఒకసారి తయారుచేసి దానిని యంత్రాలలో ఉంచి, దానిలో విదళనము నియమితమైన రేటున గొలుసుకట్టు ప్రక్రియగా జరిగేటట్లు చేసినట్లయితే ఇక మన ప్రమేయం లేకుండా ఆ ద్రవ్యం ఉన్నంతకాలం ఆ ప్రక్రియ అవిచ్ఛిన్నంగా జరిగి పరమాణుశక్తి విడుదల అవుతూనే ఉంటుంది. పరమాణుశక్తి జనకయంత్రం ఎంత చిన్నదైనా దానినుండి సుమారు 10,000 సంవత్సరాల వరకు అవిచ్ఛిన్నంగా శక్తి ఉత్పన్నమౌతుంటుందని శాస్త్రజ్ఞులు అంచనా వేస్తున్నారు. సామాన్య శక్తి జనకయంత్రాలవలె పరమాణుశక్తి జనకయంత్రాలు మధ్య మధ్య చెడిపోవడంగాని, ఆగిపోవడంగాని ఉండదు. మనకు అవసరమున్నా లేకపోయినా నియమితమైన రేటున ఆశక్తి ఉత్పన్నమౌతూనే ఉంటుంది. దానిని ఏదోవిధంగా మనం ఉపయోగించుకోవలసిందే. అందుచేత పరమాణుశక్తి జనకయంత్రాలకు మధ్య మధ్య ఖర్చు ఏమీ ఉండదు.

పరమాణుశక్తి జనకయంత్రాలవలన ఉత్పత్తిల్లే శక్తి పరిమాణం చాల హెచ్చుగా ఉంటుంది. అందుచేత కేంద్రస్థానాలలో పరమాణుశక్తి జనక యంత్రాలను స్థాపించుకొని, అక్కడినుండి దేశంలో నలుమూలలకు శక్తిని పంపించి, దానివలన పరిశ్రమలను నడుపుకోవచ్చును. పరమాణుశక్తివలన పనిచేసే జలాంతర్గామి నౌకదానిని ఇటీవల అమెరికావారు నిర్మించేరు. రైళ్లు మొదలగు ఇతర వాహనములను నిర్మించడానికికూడా ప్రయత్నాలు జరుగుచున్నవి.

అనేక నిర్మాణ కార్యక్రమాలలోకూడ భవిష్యత్కాలంలో పరమాణుశక్తి విరివిగా ఉపయోగపడగలదు. భూమార్గాలను వేయడంలో పెద్ద పెద్ద కొండలు అడ్డుగా నిలిచినపుడు వానిని పెకలించివేయడంలో పరమాణుశక్తి ఎక్కువగా ఉపయోగపడుతుంది. అట్లే క్రొత్త క్రొత్త జలమార్గాలను వేయడానికి భూభాగాలను త్రవ్వవలసివచ్చినపుడుకూడా పరమాణుశక్తి వినియోగపడగలదు. భూమిపై ప్రస్తుతం నివాసయోగ్యంగా లేని ప్రదేశాలను నివాసయోగ్యంగా చేయడానికికూడా పరమాణుశక్తి సాహాయ్యపడుతుందని శాస్త్రజ్ఞులు తలుస్తున్నారు. ఒక ప్రదేశంయొక్క శీతోష్ణస్థితి ఆ ప్రదేశానికిని భూమధ్యరేఖకును గల దూరాన్ని బట్టియును, అక్కడి కొండల వరుసలను బట్టియును, పెద్ద పెద్ద జలాశయాలను బట్టియును ఉంటుంది. ఎడారి ప్రదేశాలు నివాస యోగ్యాలు కాకపోవడానికి కారణం అక్కడ వర్షాలు లేకపోవడమే. అట్టి ప్రదేశాలలో ఉన్న కొండల వరుసలను తీసివేయడంవలనగానీ, లేదా అక్కడ క్రొత్తకొండల వరుసలను ఏర్పరచడంవలనగానీ ఆ ప్రదేశాలలో మేఘాలు ఆగి వర్షించేటట్లు చేయవచ్చును. ఈ పనిని పరమాణుశక్తివలన చేయించవచ్చునని శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. ఇక ఆ ప్రదేశాలలో పెద్ద పెద్ద సరస్సులను ఏర్పరచడం, ఆ ప్రదేశాలగుండా క్రొత్త నదులు ప్రవహించేటట్లు చేయడం పరమాణుశక్తి మన అధీనమైననాడు కష్టమనిపించదు.

—అనంత్.

మెదడుకి మేత

మెదడుకి మేత పెట్టేవి పుస్తకాలే కాని బేకన్ చెప్పినట్లు, వాటిలో కొన్నిటిని చవి మాత్రం చూసి వదలెయ్యాలి; మరి కొన్నిటిని నమలకుండా మింగెయ్యాలి; యిక పోగా మిగిలినవి మాత్రం నెమ్మదిగా నెమరవేసుకొంటూ జీర్ణం చేసుకొంటూ చదువుకుపోవాలి.

మహాఘోరమైన నేరం కళ్ళఎదుట జరుగబో కల్పించుకొని, యింగితం ఎరుగవలసిన యీడువచ్చిన ఉన్నట్లు అందరూ వూపిరి బిగబట్టేసి చూస్తూ వుండి 'వెధవ'ని కనుక నన్ను స్కూలుకి పంపే ముందు పోయారు. తక్షణమే నన్ను 'రిఫర్మేటరీ'స్కూలుకు 'కన్‌ఫెషన్'కి పంపించి ప్రాయశ్చిత్తం చేయించాలని పంపిస్తే తప్ప నే నెందునా కొరగాకుండాపోతానని సూచించారు. మరునాడే నన్ను 'కన్‌పెషన్'కిగాను




ప్రతిభావారి "రేచుక్క"లో మంత్రికూతురు లలితాదేవిగా సరికొత్త నటి ప్రమీల.



ప్రియురాలు, ప్రియుడు, అనుచరుడు
"రేచుక్క"లో అంజలీదేవి, ఎన్. టి. రామారావు, పేకేటి.

★

జనతా వారి "పరివర్తన"లో సావిత్రి, పెరుమాళ్లు, ఎన్. టి. రామారావు.



జర్మన్ చిత్రపరిశ్రమ

హెచ్. డైటర్ ఎబెలర్

రెండవ ప్రపంచయుద్ధం అంతమవడంతోపాటు జర్మన్ సినిమా పరిశ్రమకూడా అంతమైంది. ఎన్నో స్టూడియోలు, సినిమాహాళ్లు తగలబెట్టబడి విధ్వంసమైనాయి. తారలు, టెక్నీషియన్లు జర్మనీ అంతటా చెల్లాచెదరయ్యారు. తిరిగి జర్మన్ సినిమా పరిశ్రమను పునరుద్ధరించడం సాధ్యమని ఎవరికీ ఆశ కలగనేలేదు. అంతా అరాజకమైపోయింది.

1945, 1946 సంవత్సరాలిలాగే గడిచాయి. ఆతరవాత ఆక్రమిత జర్మనీలో చాలాచోట్ల పాత శిథిలాలనుండి కొత్త భవనాలను పునర్నిర్మించ ప్రారంభించారు. సినిమాపరిశ్రమ పునరుద్ధరణ విషయంకూడా ఆలోచించసాగారు.

1947 లో యుద్ధానంతరపు మొట్టమొదటి జర్మన్ చిత్రం విడుదల అయింది. ఇది కేవలం 'ఎక్స్‌పెరిమెంట్' మాత్రమే. యంత్ర పరికరాలు, ముడిఫిలిము కరువుగా ఉండడంవల్లనూ, కథ సరియైనది లేకపోవడంవల్లనూ, ఆ చిత్రం సినిమా పరిశ్రమ తొలిరోజులను జ్ఞాపకంచేసింది. అయినా అది మొదటి చిత్రం గనుక ప్రజలు ఆ దృష్టితోనే దాన్ని అభిమానించారు.

యుద్ధమైన తర్వాత మొదట్లో అమెరికన్, బ్రిటిష్, ఫ్రెంచి చిత్రాలు మాత్రమే జర్మనీలో ప్రదర్శించబడేవి. వాటికి జర్మన్ సబ్‌టైటిల్స్ ఉండేవిగాని, సరిగ్గా ఉండేవికావు. ఈ విదేశీయ చిత్రాలు జర్మన్ ప్రేక్షకుల అభిరుచులకు సరిపడలేదు. పైగా నిజం చెప్పాలంటే, ఆ రోజుల్లో దిగుమతి అయిన చిత్రాలన్నీ పాతకాలపు చిత్రాలే.

మెల్లిగా హాంబర్గ్, గోటింగెన్, పశ్చిమ బెర్లిన్ నగరాల్లో ఆధునిక సామగ్రితో నిండిన స్టూడియోలు లేచాయి. మ్యూనిక్‌లోని గీసెల్ గాస్టీగ్ స్టూడియో మాత్రమే యుద్ధంలో చెక్కుచెదరకుండా నిలిచింది. ఈ స్టూడియో ఇప్పటికీ యూరప్‌లోకల్లా పెద్దదే. పూర్వపు తారలు, డైరెక్టర్లు తిరిగి ఒకరినొకరు కలుసుకున్నారు. నిర్మాతలు మాత్రం కొత్తవారే వచ్చారు. 1946 వరకూ చిత్రాలు నిర్మించి, డిస్ట్రిబ్యూట్ చేసిన ప్రభుత్వఫిలిం ట్రస్ట్ స్థానంలో 260 నిర్మాణ సంస్థలు కొత్తవి బయల్దేరాయి. చిత్రపరిశ్రమలో లాభాలు బావుకుందామనే ఆశతో చిన్నచిన్న వ్యాపారస్థులే ఎక్కువగా ఈ కంపెనీలు లేవదీశారు.

సాధ్యమైనంత శీఘ్రంగా లాభాలు ఆర్జించడమే ఈ నిర్మాతల లక్ష్యం. ఈ కారణంవల్ల చిత్రాల స్థాయి చాలా దిగజారిపోయింది. అదీకాక నటీనటులు, తతిమావారు అందరూ పాతవారే చిత్ర పరిశ్రమను గుత్తకు పుచ్చుకున్నట్టు ప్రవర్తించారు. చిత్రనిర్మాణం ఎప్పటికప్పుడు కొత్తవారు వస్తేనే అభివృద్ధి అవుతుందనేది వారు మరిచిపోయారు. కొత్త నటీనటులకు ఛాన్సు ఇవ్వలేదు. ఇదివరకటి ఫార్ములాలతోనే వారు చిత్రాలు నిర్మించేవారు. ఆ ఫార్ములాలు ఇప్పటి ప్రజలకు పనికిరావనే సంగతి వారు గుర్తించలేదు. అయితే వారి చిత్రాల్లో కొన్ని మాత్రం స్విట్జర్లండు, ఫ్రాన్స్, అమెరికాలలో విడుదలై విజయం పొందినవి లేకపోలేదు.

యుద్ధానంతర జర్మన్ చిత్రాలు అధికభాగం నష్టపడడానికి ముఖ్యకారణం సరైన ఇతివృత్తాలను తీసుకోకపోవడమే. ఈ ఇతివృత్తాలను పత్రికలు తీవ్రంగా నిరసించాయి.

జర్మన్ నిర్మాతలు పాతనృత్య నాటికలను, సంగీత నాటికలను, చవకబారు కామెడీలను పునర్నిర్మించడం ద్వారా లాభాలు దోచుకోవచ్చునని ఆశపడ్డారు. చలనచిత్రం కళ అనీ, జాగ్రత్తగా ఆ కళను సాధించాలనీ వారు మరిచిపోయారు. యుద్ధ సమస్యలను చిత్రించే చిత్రాలు పూర్వమూ ప్రజాదరణ పొందలేదు, ఇప్పుడూ ప్రజాదరణ పొందడంలేదు. వాస్తవ జీవితంలో ప్రజలు యుద్ధ ఫలితాలు ఎలాగూ అనుభవిస్తూనే ఉన్నారు. వాటినే డబ్బిచ్చి సినిమాల్లో కూడా చూడడానికి వారిష్టపడలేదు.

"అయితే ఎటువంటి చిత్రాలు తీయమంటారు?" అని నిర్మాతలు 'సణి'గారు. "ఇంకా మంచి చిత్రాలు, ప్రయోజనకరమైనవి తీయండి" అని ప్రజలు, పత్రికలవారూ సమాధానమిచ్చారు.

చాలా కంపెనీలు దివాలా తీశాయి. చిత్రనిర్మాణానికి పెట్టుబడి పెట్టడం కష్టతరమైపోయింది. లాభాలలో నూటికి నలభై వంతులు ఆదాయపు పన్నుగా కట్టవలసి వచ్చింది. సాధారణ చిత్రమేదైనా సరే నిర్మించడానికి 8 లక్షల రూపాయలు అయ్యేది. అయితే రాష్ట్ర ప్రభుత్వాలు పదేసి లక్షల రూపాయల ప్రభుత్వ సెక్యూరిటీలు యిచ్చి చిత్ర నిర్మాతలకు కొంత వరకూ సాయం చేసింది.

కిందటి ఏడాది జర్మన్ చిత్రపరిశ్రమలో ఒక మహాత్పరిణామం వచ్చింది. కొన్ని ఇంగ్లీషు కంపెనీలు, అమెరికన్ కంపెనీలు జర్మనీవచ్చి, జర్మనీని గూర్చి చిత్రాలు తీశాయి. జర్మన్ సమస్యలపై అవి నిర్మించిన చిత్రాలు జర్మన్లు తీసిన వాటికంటె బాగా ఉన్నాయి.

"ది థర్డ్ మాన్" అనే చక్కని చిత్రం తీసిన బ్రిటిష్ డైరెక్టరు కెరోల్ రీడ్ "ది మాన్ బిట్వీన్" అనే చిత్రం జర్మనీలో తీశాడు. ఇందులో యుద్ధానంతర సమస్యలు చిత్రించబడ్డాయి. బెర్లిన్ దిగ్బంధం మొదలైన సమస్యలపై మరికొన్ని చిత్రాలు విదేశీయులు తీసినవి వెలువడ్డాయి.

వీటిని చూసేసరికి జర్మనీలో ఇంత చక్కని ఇతివృత్తాలు దొరుకుతాయని మనకే తెలియదే అని జర్మన్ నిర్మాతలు ఆశ్చర్యపోయారు. వీధిలోకి వచ్చి చూడాలేగాని ఎంత చిత్రమైన సంఘటనలైనా కనిపిస్తాయని తెలుసుకున్నారు. ఇంతకుముందే ఎందుకు తెలుసుకోలేదా అని విచారపడ్డారు.

ఫ్రెంచి, ఇటాలియన్ చిత్రాలవలెనే జర్మన్ చిత్రాలు కూడా "స్వప్నలోకా"లను వదిలిపెట్టి వాస్తవలోకంలోకి వచ్చాయి. "వాస్తవికత కావాలి" అనేది నిర్మాతల నినాదమైపోయింది. తెల్లటి టెలిఫోన్లు వాడే జనరల్ మేనేజర్లు, షాంప్ పాత్రలు చిత్రాల్లో కనిపించడం మానేశారు. కష్టపడి పనిచేసి జీవితం గడిపే సామాన్య మానవులే కనిపించసాగారు.

యథార్థ జీవితంనుండి కథలు రాసాగాయి. కొత్త నటీనటులకు ప్రోత్సాహం లభించింది. ఈరోజున హిల్డిగార్డ్ నెఫ్, హోనర్ల్ మాట్జ్, మేరియా షెల్, డైటర్ బోర్శ్, ఓ. డబ్ల్యు. ఫిషర్ మున్నగు తారలు పాత వారికంటె చాలా ప్రసిద్ధి సంపాదించారు.

జర్మన్ కంపెనీలు విదేశీయ కంపెనీలతో కలిసి, జాయింటుగా పెట్టుబడి పెట్టి చిత్రాలు తీయసాగినవి. అప్పటినుంచి మళ్ళీ అంతర్జాతీయ రంగంలో ఫరవాలేదనిపించుకోదగిన చిత్రాలు తయారవుతున్నాయి. కవల పడుచులను గూర్చిన ఒక చిత్రం, లారీడ్రైవర్లను గూర్చిన చిత్రం, ప్రసిద్ధ రచయిత థామస్ మాన్ [illegible] ఒక నవల ననుసరించి తీయబడిన [illegible] చిత్రం, రష్యాలో ఖైదీలుగా [illegible] జర్మన్ స్త్రీలనుగూర్చి ఒక చిత్రం [illegible] పేరొందినవి. "As long as you [illegible]

here", "The dancing heart" అనే రెండు చిత్రాలు ఇటీవల కౌనిస్‌లో జరిగిన చలనచిత్రోత్సవంలో మంచి విజయం పొందాయి. మేరియా షెల్ అనే నటికి 1954 లో ఉత్తమ నటిగా బహుమతి వచ్చింది.

జర్మన్ ఫిలింపరిశ్రమ పూర్తిగా కోలుకున్నట్లు తోస్తుంది. అరాజకంనుండి, శైథిల్యంనుండి పరిశ్రమ బయటపడింది ఈ రోజున మంచి అమెరికన్, బ్రిటిష్, ఫ్రెంచి, ఇటాలియన్ చిత్రాలతో పోల్చదగిన జర్మన్ చిత్రాలు చాలా ఉన్నాయని నిస్సందేహంగా చెప్పవచ్చును.

—(ఫిల్మ్‌ఫేర్ నుండి)

★

★ సినిమా వార్తలు ★

విజయావారు తమ సాంఘిక చిత్రం "మిస్సమ్మ" షూటింగ్ ఈ నెల 14 వ తేదీన ప్రారంభించారు "పెళ్ళిచేసిచూడు" వలెనే ఇది పూర్తిగా హాస్యభరితమై ఉంటుందని తెలుస్తోంది. మొదటి సెట్టు ఒక క్రైస్తవ కుటుంబంయొక్క ఇల్లు. అందులో ఒక గదిలో షూటింగ్ ప్రారంభమైంది ఈ గది చాల చక్కగా అలంకరించబడింది. ఏసుక్రీస్తు, మేరీ మాత పటాలు, ఐకన్లు అమర్చబడ్డాయి మొదటి షాట్‌లో మీనాక్షి, దొరస్వామి, రమణారెడ్డి ప్రాతధారులు. రమణారెడ్డి వచ్చి మీనాక్షిని బాకీ తీర్చమని అడుగుతాడు. ఈలోగా ఆమె భర్త దొరస్వామి వచ్చి వచ్చేనెల పూర్తిగా తీర్చివేస్తాము, ఆగమని చెబుతాడు. రెండవ షాట్‌లో దొరస్వామి నాలుగువందల రూపాయల బాకీ తీర్చివేస్తాడు ఒక్క నెలలో ఇంత డబ్బు ఎలా వచ్చిందని రమణారెడ్డి అడుగుతాడు మీలాంటి పుణ్యాత్ముల దయవల్లనని దొరస్వామి జవాబు చెబుతాడు. సరేగాని, మేరీ ఎక్కడుంది అని రమణారెడ్డి అడగ్గా, ఆమె సంగతి ఎత్తవద్దని చెప్పలేదా అని దొరస్వామి అంటాడు

ఎన్ టి రామారావు, నాగేశ్వరరావు, భానుమతి, సావిత్రి, రేలంగి, రంగారావు మున్నగువారు ఈ చిత్రంలో పాల్గొననున్నారని పాఠకులకు విదితమే.

* * *

జనతావారి "పరివర్తన" చాలవరకు తయారైపోయింది. త్వరలోనే పూర్తవుతుందని తెలుస్తోంది. ఇటీవల వాహినీలో ఒకపాట రికార్డుచేశారు. అది జమున, రాజా, రాణి, జిక్కీల పాట. ఘంటసాల, ఎ. పి. కోమల, పి నాగేశ్వరరావు మున్నగువారు రికార్డింగ్‌లో పాల్గొన్నారు

* * *

బ్రిటన్‌లోని పెద్ద స్టూడియోలలో ఒకటైన షెప్పర్టన్ స్టూడియోను బ్రిటిష్ ప్రభుత్వం త్వరలో వశపరచుకోబోతుంది. ఈ స్టూడియో యజమానులైన బ్రిటిష్ లయన్ ఫిల్మ్ కార్పొరేషన్‌వారు దివాళా తీయడమే దీనికి కారణం స్టూడియోలకు ధనసహాయం చేసేందుకు 1948 లో ప్రభుత్వం ఏర్పరచిన నేషనల్ ఫిల్మ్ ఫైనాన్స్ కార్పొరేషన్ అనే సంస్థ అత్యధికమైన ధనం సహాయం చేసినప్పటికీ ఆ కంపెనీ నష్టాలను తప్పించుకోలేకపోయింది. బ్రిటిష్‌లయన్‌వారు "థర్డ్ మాన్" "సౌండ్ బారియర్" మొదలైన మంచి చిత్రాలు తీసి లాభాలు సంపాదించారు. అయితే ఈ లాభాలతో ప్రభుత్వానికి బాకీ తీర్చకుండా కొత్త చిత్రాలు తీసి అపరిమితంగా నష్టపోయారు. ఈవిధంగా 20 లక్షల పౌనుల బాకా బకాయి మిగిలిపోయింది అందుచేత ప్రభుత్వం బ్రిటిష్ లయన్‌ను వశపరుచుకుని తాత్కాలికంగా దాని వ్యవహారాలు చూసేందుకు ఒక రిసీవర్‌ను నియమించింది.

* * *



యునైటెడ్ టెక్నీషియన్సు శ్యామలావారి 'పల్లెపడుచు'లో డ్రిల్‌మాష్టరు కామేశంగా పేకేటి శివరామ్.

చార్లీ చాప్లిన్

రాయదుర్గంనుండి ఎమ్. పి. చెన్నమల్లప్పగారి ప్రశ్న.— "తామధ్య పేపర్లలో



"అన్నదాత"లో చలం, ఒక క్రొత్తనటి.

★ చార్లీచాప్లిన్ ★

ప్రపంచశాంతి బహుమానము (*Nobel Prize*) ఇంగ్లీషు హాస్య సినిమానటుడైన చార్లి చాప్లినుగారికి అందినట్లు ప్రకటించినారు. ఆయన ప్రపంచశాంతికి చేసిన కార్యములను, ఆయొక్క నోబులు బహుమతి పొందుటకు గల మూలకారణములతో భవానీ వివరింపవలెనని కోరుచున్నాను."

చార్లీ చాప్లినుకు ఇవ్వబడినది నోబెల్ శాంతి బహుమానం కాదు. ఇటీవల తూర్పు బెర్లిన్‌లో జరిగిన 'వరల్డ్ పీస్ కౌన్సిల్' సమావేశం వారిచ్చిన శాంతి బహుమతి మాత్రమే. నోబెల్ శాంతి బహుమతులు చార్లీ చాప్లిన్ వంటి వారికి లభించేవి కావు. చార్లీచాప్లిన్ అమెరికన్ విద్రోహి అనీ, కమ్యూనిస్టు అనీ, అవినీతి పరుడనీ అమెరికన్ పాలకవర్గంవారు అతని మీద చాలా ఎక్కువగా కత్తికట్టారు. ప్రపంచ ప్రజల దృష్టిలో అతన్ని సాధ్యమైనంత కించపరచాలని అమెరికన్ అధికారులు ప్రయత్నించారు. అతడు నిర్మించిన చిత్రాలు అమెరికాలో ప్రదర్శించకూడదని నిషేధించారు. అతనికి అమెరికాలో స్థానం లేకుండా చేశారు. ఇప్పుడతడు సకుటుంబంగా స్విట్జర్లెండులో నివాసం ఏర్పరచుకుని ఉన్నాడు. అమెరికా నుండి బహిష్కృతుడైన చాప్లిన్‌కు అమెరికా అడుగుజాడల్లో నడిచే నోబెల్ కమిటీవారు బహుమానం ఇవ్వరు. క్రితం సారి నోబెల్ శాంతి బహుమతి అమెరికన్ సైనికాధికారి, మాజీ విదేశాంగమంత్రి అయిన జార్జిమార్షల్‌కివ్వబడింది.

చాప్లిన్ పీస్ కౌన్సిల్ వారి బహుమతి స్వీకరిస్తూ ఇలా అన్నాడు: "శాంతివాంఛ విశ్వజనీనమైనది. యుద్ధకారణాలను తొలగించే మార్గమేదో నాకు తెలియదు కాని, ఒకటి మాత్రం తెలుసు. ద్వేషంతో పరస్పర భీతితో నిండిన ప్రస్తుత వాతావరణంలో ప్రపంచశాంతిని స్థాపించలేము. హైడ్రోజన్ బాంబులు వెయ్యడం ద్వారా శాంతి నెలకొల్పలేము. హైడ్రోజన్ బాంబులు తయారుచేసే విధానం అతి త్వరలో అన్ని దేశాలకు తెలిసిపోక తప్పదు. చిన్న దేశాలకు, పెద్దదేశాలకు ఈ బాంబులు లభిస్తాయి. అందుచేత తమతమ విభేదాలను పరిష్కరించుకోడానికి వివిధదేశాలు ఆటవిక పద్ధతులు వదిలిపెట్టి అంతకంటె విజ్ఞానాత్మకమైన మార్గం అవలంబించాలి. హైడ్రోజన్ యుద్ధానికి ప్రపంచాన్ని సిద్ధం చెయ్యడం మానవాత్మపట్లనే అపచారం. దీనివల్ల ప్రపంచం క్రమంగా ఉన్మాదిని అవుతోంది."

చార్లీ చాప్లిన్ అమెరికాలో ఉండగా "మీరు కమ్యూనిస్టులా?" అని ఒకరు అడిగారు. "కాదు. నేను శాంతికాముకుణ్ణి" అని చాప్లిన్ సమాధానమిచ్చాడు. అతడు తను నిర్మించిన చిత్రాలన్నిటిలోనూ మానవత్వాన్ని పెంపొందించే సిద్ధాంతాలకే ప్రాధాన్యమిచ్చాడు. హింసా పిపాసను రేకెత్తించే హాలీవుడ్ చిత్రాల్ని నిరసించాడు. యుద్ధకాలంలో "గ్రేట్ డిక్టేటర్" అనే చిత్రం తీసి హిట్లర్, ముసోలినీ వంటి యుద్ధోన్మాదులైన నియంతలను తూర్పారపట్టాడు. యుద్ధానంతరం "మస్యూర్ వెర్డూ" అనే చిత్రం తీసి ప్రస్తుత ఆర్థికవ్యవస్థ దోపిడీ మీద ఏవిధంగా ఆధారపడివుందో, చూపిస్తూ యుద్ధం కావాలనే వారిని విమర్శించాడు. చాప్లిన్ తన అసమానమైన కళా ప్రతిభ ద్వారా మానవుల మధ్య సామరస్యం నెల

కొల్పడానికి ఎంతో కృషి చేశాడు. ఈ కారణంవల్ల పీస్ కౌన్సిల్ వారు అతనికి శాంతి బహుమానం ఇచ్చారు. ★

న్యూస్ రీల్

(3-వ పేజీ తరువాయి)

మంగళవారం, జూన్ 15 :

—కొరియా సమస్య ఐక్యరాజ్య సమితిలో చర్చకు పంపాలని జెనీవా సమావేశంలో మిత్రరాజ్య ప్రతినిధులు ప్రతిపాదించారు. దక్షిణకొరియా ప్రతినిధి ఆరంకాల కార్యక్రమం ఒకటి సూచించారు. కొరియా సమస్య పరిష్కారమయేవరకూ శాంతికి భంగం కలగకుండా ప్రవర్తించాలని అందరికీ విజ్ఞప్తిచేయాలని రష్యన్ విదేశాంగ మంత్రి మాలటోవ్ ప్రతిపాదించారు.

—చర్చిల్, ఈడెన్‌లను జూన్ 25 వ తేదీకి వాషింగ్టన్‌కు అతిథులుగా అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ ఆహ్వానించారు. ★

★ కాలక్షేపం ★

(6-వ పేజీ తరువాయి)

కాలకు సిద్ధంగాఉన్న పాతరస్తాలు యీ పులవృత్తులు.

"అనేక శతాబ్దములనుండి హిందూదేశములో భౌతిక సంక్షోభములున్నా రాజకీయాందోళన సంఘర్షణములున్నా ఎన్ని సంభవించినప్పటికీ, హిందూ సంఘమునకు హానిరాకుండా ప్రజలలో సంతుష్టిని ప్రసాదించినది యీ వర్ణాశ్రమమని వాదించుటకు విశేష శ్రమపడనక్కరలేదు"—ఇది "సిడ్నీలో" పండితుని అభిప్రాయం.

భారతదేశం యిందులోఉన్న సత్యం గ్రహిస్తే చాలు. సత్యమేవ జయతే—మున్ముందుకూడా భారతదేశం తలయెత్తుకొని తిరుగుతుంది, యీ తల తిరిగిన ప్రపంచంలో.

"తల పైకెత్తియె జోలివల్లు నెపుడుని
తన్నెట్లుగా త్రిప్పినన్"
"క్రిందు సేయంగబడినట్టి కృష్ణపథుని
కీల యెందైన మీదుగా గెరలుగాద." ★

గ్రంథస్వీకారము

ఆకాశదీపాలు:— కథల సంపుటి; రచయిత అవసరాల సూర్యారావు; ప్రచురణ కర్తలు—నగారా ప్రచురణాలయం, కొత్తపేట, గుంటూరు - 1; వెల 1-0-0; ప్రతులకు విశాలాంధ్ర ప్రచురణాలయం, బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ - 2.

86 పేజీలుగల ఈ పుస్తకంలో ఆరుకథలున్నాయి. 'ఊరేగింపు' అనే కథలో విద్యార్థుల జీతాల హెచ్చింపు సమస్య చిత్రించబడింది. 'అన్నయ్య వెళ్ళిన దారి'లో ఆదర్శాలకోసం ఇల్లువిడిచి వెళ్లిన యువకుడు, 'షష్ఠిపూర్తి'లో జమీందారీ దోపిడీలో నలిగిపోయిన ముత్యాలు, అతని పెళ్ళాం, 'పాలికాపు'లో జీవనోపాధికి పల్లెవదిలి పట్నంవెళ్లిన పాలికాపు, 'కొత్త పుంతలు'లో పాగాకు చుట్టలు చుట్టే కార్మికులు, 'అన్నదమ్ముల పంపిళ్లు'లో వేరుపడిపోయి సుఖంగా బతకదలుచుకున్న అన్నదమ్ములు చిత్రించబడ్డారు.

సూర్యారావుగారు అభ్యుదయ సాహిత్యవాది. చాలమంది అభ్యుదయవాదులు కళాపటిష్ఠమైన సాహిత్యం సృజించడంలో విఫలులవుతున్న ఈరోజుల్లో, ఈ కథకుని కృషి కొనియాడదగినదిగా ఉంది. సంకుచితమైన ధోరణి ఎక్కడా కనిపించనీకుండా, వాస్తవజీవితాన్ని మానవీయ దృక్పథంతో చూపించడానికే ఈయన యత్నించారు. ముఖ్యంగా, పాఠకుణ్ణి ఆకర్షించేది, మళ్ళీ మళ్ళీ చదువుకొనేట్టు చేసేది కథకుని శైలి. వీరి శైలిలో ప్రత్యేకత ఉంది. వీరికి కవిత్వంలోకూడా ప్రవేశం ఉండడం వల్ల కావచ్చును, హృద్యములైన ఉపమాదిఅలంకారాలు ప్రతికథలోనూ కొల్లలుగా పడి రమ్యత ఆపాదిస్తున్నాయి. ఈ ఉపమానాలు జాగ్రత్తగా ఆలోచించి వేసినవైనా, సహజంగా పాత్రలలోంచే ఉబికి వచ్చినట్లు చక్కని ఔచిత్యంతో ధ్వనిస్తాయి. "పంటచేనుమీద మిడతలదండులా పూళ్లో పడింది దివాణం దండు;" "ముత్యాలు గుండెల్లో ఎవరో చావు బాజా వాయించినట్లయింది;" ఇలాంటి వెన్నో కనబడతాయి. రచయిత విశాఖ జిల్లాకు చెందినవారవడంచేత ఆ ప్రాంతపు నుడికారమూ, మాండలీయకాలు కథనంలోనికి చొచ్చుకువచ్చి మరింత వాస్తవికత చేకూరుస్తున్నాయి.

ఈ కథల్లో శైలిపొందినంత పరిణతి కథా శిల్పం పొందలేదేమో ననిపిస్తోంది. ఎక్కువగా 'స్కెచ్చీ' గా ఉండి, చిన్నకథకు దాని పరిమితిలో దాని కుండవలసిన సమగ్రత లోపించినట్లు, ముగింపులో తేలిపోతున్నట్లు కనిపిస్తాయి.

ఈ సంపుటికి కొడవటిగంటి కుటుంబరావుగారు ప్రస్తావన వ్రాశారు. చిన్నకథ బహుళ ప్రచారం పొందడానికి కారణాలు, సాహిత్య ప్రయోజనం ఆయన చర్చించారు.

సూర్యారావుగారి కథలు ఆధునిక సాహిత్యాభిమానులందరూ తప్పక చదవదగినవి. ★

రచయితలకు మనవి

మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫొటోలు పంపేవారు

ఈ క్రింది అంశాలను గమనించ ప్రార్థన.

ప్రచురించని వానిని త్రిప్పిపంపగోరే వారు బుక్ పోస్టుకు అవసరమైన స్టాంపులను, రచనలూ, చిత్రాలూ, ఫొటోలతోనే చేర్చిపంపాలి.

బుక్ పోస్టుకు అణా స్టాంపుకు తక్కువ కాకుండా పంపాలి.

రచనలను కాయితానికి ఒకే వైపున సిరాతో వ్రాసిపంపాలి.

ఫొటోలు కనీసం కార్డు సైజులో వుండాలి. నెగటివ్‌లు స్వీకరించబడవు.

చిత్రాలు ఇండియన్ ఇంకుతో వేసిపంపాలి. రంగుల చిత్రాలు స్వీకరించబడవు.

ప్రచురణ విషయాన్ని వెంటనే తెలియచెయ్యడం కష్టం.

నిరాకరించబడిన రచనలను త్రిప్పి పంపడానికి మాకు కనీసం ఒక మాసమైనా వ్యవధి అవసరం. ఫొటోలు, చిత్రాల విషయంలో యింకా ఎక్కువ వ్యవధి కావలసివుంటుంది.

ప్రచురించే వానిని గురించి ప్రచురించే ముందు మాత్రమే తెలియపరచగలము.

మాకు పంపిన రచనలను, ఫొటోలను, చిత్రాలను గురించి మా కార్యాలయం నుంచి ఎవ్విధమైన సమాచారమూ అందనిదే, వాటి ప్రతులను యితర పత్రికలకు పంపవద్దని ప్రార్థన.

రచయితలూ, చిత్రకారులూ, సహృదయంతో సహకరించగలరని విశ్వసిస్తున్నాము.

—సంపాదకుడు.



"సంఘం"లో అందాల తారలు
అంజలీ దేవి, వైజయంతీమాల.

★




"రాజూ - పేద"లో
ఎస్. వి. రంగారావు

Edited, Printed & Published by
S Sambhu Prasad at the Andhra
Patrika Press, 7, Thambu Chetty
St, Madras



విభిన్న కోణాలలో ఒకే దృశ్యం

—ఫొటోలు . సి.వి. నారాయణమూర్తి (పెరవలి)




25.వ. తేది విడుదల
బి.ఏ.యస. ప్రొడక్షన్స
రాజూ పేద
నిర్మాత, దర్శకుడు,
బి.ఏ. సుబ్బారావు
S.V. రంగారావు,
N.T. రామారావు, రేలంగి
R. నాగేశ్వరరావు,
లక్ష్మిరాజ్యం, అమ్మాజీ,
& సుధాకర్
నటించినది.